

'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ణి చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 67

సోమవారం 29-5-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 67

సోమవారం 29-5-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



వాన వచ్చె.. వాయిదా పడె

వర్షం వల్ల చెన్నై, గుజరాత్ ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ నేటికి వాయిదా - 12లో



ప్రణయ్ నిరీక్షణ ముగిసె

మలేసియా మాస్టర్స్ టోర్నీ టైటిల్ నెగ్గిన భారత షట్లర్ - 12లో



నేడు అమెరికాకు రాహుల్

కోర్టు ఆదేశాల మేరకు సాధారణ పాస్‌పోర్టు అందుకున్న కాంగ్రెస్ నేత రాహుల్ 3 రోజుల పర్యటన కోసం నేడు అమెరికా వెళ్తున్నారు.


వివరాలు 6లో ▸



రెజ్లర్లపై పోలీసుల ప్రతాపం

రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలంటూ రెజ్లర్లు చేపట్టిన నిరసన దీక్షను పోలీసులు భగ్నం చేశారు.

వివరాలు 12లో ▸



అంబటి రాయుడు 'గుడ్‌బై'

చెన్నై, గుజరాత్ మధ్య జరిగే ఫైనల్ తనకు చివరి ఐపీఎల్ మ్యాచ్ అని తెలుగు తేజం అంబటి రాయుడు ప్రకటించాడు.

వివరాలు 12లో ▸



నామినీ నమోదు చేశారా?

పెట్టుబడులు, జీవిత బీమా తదితరాల్లో నామినేషన్ నమోదు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం..

వివరాలు 13లో ▸

న్యూస్‌రీల్

బాబోయ్.. లో బ్యాటరీ!



ఫోన్‌లో లో–బ్యాటరీ అనే సింబల్ కనిపిస్తే.. చాలా మందిలో ఆందోళన పెరిగిపోతుంటుంది. దీనినే నోమోఫోబియో (నో మొబైల్ భయం) అని పిలుస్తారంట. ప్రతి నలుగురు భారతీయుల్లో ముగ్గురు దీనితో బాధపడుతున్నారని ఓ సర్వేలో తేలింది.

వివరాలు 2లో ▸

పొత్తులపై తుది నిర్ణయం అధిష్టానానిదే..



బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి వచ్చే ఎన్నికలకు వెళ్లాలన్న కోరికతో పవన్ కళ్యాణ్ ఉన్నారని.. ఇదే విషయాన్ని తమ పార్టీ పెద్దలకూ చెప్పారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు తెలిపారు. పొత్తులపై బీజేపీ అధిష్టానమే తుది నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

వివరాలు 3లో ▸

నేటి నుంచి మోస్తరు వర్షాలు!



ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో సోమవారం నుంచి కోస్తాంధ్ర, రాయలసీమలోని కొన్ని చోట్ల మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. రోహిణి కార్తె కావడంతో కొన్ని ప్రాంతాల్లో మాత్రం ఎండలు, వడగాడ్పుల తీవ్రత ఎక్కువగానే ఉంటుంది.

వివరాలు 5లో ▸

ఇదంజగత్



కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవంలో 'సెంగోల్'తో ప్రధాని | అనంతరం ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ





ఇది నవోదయం

నూతన పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ఉద్ఘాటన

- పార్లమెంట్ కొత్త భవనం ప్రపంచ దేశాల ప్రగతికి స్ఫూర్తి
- అణగారిన వర్గాల సాధికారితకు ఇక్కడే ముందడుగు
- పార్లమెంట్‌లో మరికొంత మంది ఎంపీలు చేరుతారు
- ఇక్కడ తీసుకునే ప్రతి నిర్ణయం దేశ ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేస్తుంది
- కొత్త భవనంలోని ప్రతి ఇటుక, ప్రతి గోడ పేదల సంక్షేమానికే అంకితం
- 2026 తర్వాత పునర్వ్యవస్థీకరణతో ఎంపీల స్థానాలు పెరుగుతాయి

6లో

స్వేచ్ఛా మాతృభూమికి
కొంగొత్త విలువలు కావాలి
స్వేచ్ఛా గీతాలాపనకు కొత్త రాగం కావాలి
కొత్త పండుగకు కొత్త ఆత్మ కావాలి

" అందుకే భారత్‌కు ఉజ్వల భవిష్యత్తునివ్వనున్న ఈ సమున్నత ప్రాంగణమూ కొత్తగా ఉండాలి.

పార్లమెంట్ భవన ప్రారంభోత్సవంతో మన హృదయాలు, మనసులు గర్వం, ఆశ, వాగ్దానంతో నిండిపోయాయి. ఈ అద్భుత భవనం ప్రజల సాధికారితకు, వారి కలలను ప్రేరేపించడానికి, వాస్తవ రూపం దాల్చడానికి వేదిక కావాలి. మన మహోన్నత దేశాన్ని అభివృద్ధి పథంలో ఉన్నత శిఖరాల దిశగా నడిపించాలి.

ప్రధాని నరేంద్ర మోదీ

ప్రారంభోత్సవం సాగింది ఇలా..! | **దేశానికి గర్వకారణం: రాష్ట్రపతి** | **ప్రారంభోత్సవమా? పట్టాభిషేకమా?: రాహుల్**



పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తదితరులు

విభజన సమస్యలు పరిష్కరించండి

- కేంద్ర హోం మంత్రికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజ్ఞప్తి
- అమిత్ షాతో 40 నిమిషాల పాటు భేటీ

2లో

పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి హాజరైన **సీఎం వైఎస్ జగన్**

పేదలందరినీ ధనికులుగా మారుస్తా

- టీడీపీ తొలి విడత మేనిఫెస్టోలో చంద్రబాబు స్పష్టీకరణ
- 'భవిష్యత్తుకు గ్యారంటీ' అంటూ మహానాడులో విడుదల
- మహాశక్తి, యువగళం, అన్నదాత, ఇంటింటికీ నీరు, బీసీలకు రక్షణ చట్టం, పూర్ టూ రిచ్
- ఆడబిడ్డ నిధి కింద మహిళలకు నెలకు రూ.1,500
- తల్లికి వందనం పేరుతో ప్రతి బిడ్డకు ఏడాదికి రూ.15 వేలు
- ఏటా ఉచితంగా 3 సిలిండర్లు.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం



రాజమండ్రిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద చంద్రబాబు అభివాదం

3లో

- ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు
- అప్పటి వరకు ప్రతి నెలా రూ.3 వేల నిరుద్యోగ భృతి
- రైతుకు సంవత్సరానికి రూ.20 వేలు సాయం.. బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం
- వచ్చే దసరాకు పూర్తి మేనిఫెస్టో

అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశావ్?



3లో

- అమరావతిలో పేదలకు సీఎం జగన్ సెంటు భూమి ఇస్తుంటే.. రగిలిపోయింది నువ్వు కాదా?
- దాన్ని అడ్డుకోవడానికి కోర్టులకు వెళ్లింది మీరు కాదా?.. అధికారంలో ఉన్నప్పుడు ఒక్క పేదవాడినైనా ధనికుడ్ని చేశావా?
- ఎన్నికల హామీల్లో ఒక్కటైనా అమలుచేసిన చరిత్ర నీకుందా బాబూ?
- మహానాడులో నువ్విచ్చిన హామీలను నీ కార్యకర్తలే నమ్మలేదు.. ప్రజలు నమ్ముతారా?.. చంద్రబాబుపై మంత్రి అంబటి ఫైర్



పోసానికి ఎన్టీఆర్ లలిత కళా పురస్కారం అందజేస్తున్న లక్ష్మీపార్వతి, రామ్‌గోపాల్‌వర్మ తదితరులు

నాడు ఎన్టీఆర్‌ను తిట్టారు.. నేడు దండలు వేస్తున్నారు

- రాజమండ్రిలో జరుగుతున్నది పెద్ద జోక్
- ఎన్టీఆర్ కూడా నవ్వాలో.. ఏడ్వాలో అర్థం కాని జోక్ అది
- చంద్రబాబు, టీడీపీ నేతల తీరుపై సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ విమర్శ
- గుణం లేని వాడు చంద్రబాబు.. ఇలాంటి వాళ్లకు దూరంగా ఉండాలి
- వైఎస్సార్‌సీపీని మళ్లీ మళ్లీ గెలిపిస్తేనే ఎన్టీఆర్ ఆత్మకు శాంతి
- ఏపీ ఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి
- విజయవాడలో ఘనంగా ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు
- ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్టు, దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టుల ఆధ్వర్యంలో నిర్వహణ

3లో

పాలనలో నయా పంథా

సంస్కరణలతో విప్లవాత్మక మార్పులు

బ్రాండ్ ఏపీ

- పల్లె, పట్టణ ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు, పథకాలు
- దేశంలోనే తొలిసారిగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ.. వాటిలో 1.34 లక్షల శాశ్వత ఉద్యోగాల భర్తీ
- ఎటువంటి లంచాలు, వివక్షకు తావు లేకుండా 600 పౌర సేవలు
- ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ చొప్పున సేవా వ్యవస్థ
- ప్రజా సేవలో 2.65 లక్షల మంది వలంటీర్లు
- ప్రతి నెలా 1న లబ్ధిదారుల ఇంటి వద్దే సామాజిక పింఛన్ల పంపిణీ
- ఫలితంగా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాక్షాత్కారం



2లో

క్లుప్తంగా...

అటు పెత్తందార్ల నాయకుడు.. ఇటు పేదల రక్షకుడు!

తణుకులో ఆకట్టుకుంటున్న ఫ్లెక్సీ



తణుకు అర్బన్: పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ఆకట్టుకుంటున్నాయి. పేదలకు, పెత్తందార్లకు మధ్య జరిగే యుద్ధం పేరిట ఈ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీలో ఒకవైపు చంద్రబాబు, లోకేశ్ పల్లకీలో కూర్చుని ఉంటే.. ఎల్లో మీడియా యాజమాన్యాలు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తదితరులు దానిని మోస్తున్నట్టు ఉంది. మరికొందరు వారి పక్కనే నిలబడి పేదల పైకి రాళ్లు విసురుతున్నట్టుగా ఉంది. ఇదే పోస్టర్‌లో రెండో వైపు పేదలుంటే.. వారికి అండగా బాహుబలి ఆకారంలో సీఎం వైఎస్ జగన్ ఉన్నారు. పెత్తందార్లు విసురుతున్న రాళ్లు పేదలకు తగలకుండా జగన్‌మోహన్‌రెడ్డి అడ్డుగా నిలిచారు. జగన్, పేదలు ఉండే భూమి పచ్చగా ఉండగా.. పెత్తందార్లు ఉండే భూమి మాత్రం బీడువారిపోయి ఉంది. ఈ ఫ్లెక్సీలను ప్రయాణికులు ఆగి మరీ చూసి వెళ్తున్నారు.

కాదలూరు పంచాయతీకి జాతీయ అవార్డు

సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య స్వగ్రామమైన కాదలూరు పంచాయతీ క్లీన్ అండ్ గ్రీన్ అంశంలో జాతీయ స్థాయి అవార్డు-2023కి ఎంపికైంది. కేంద్ర పర్యావరణ, అటవీశాఖ రాష్ట్రంలో 3 పంచాయతీలను అవార్డులకు క్లీన్ అండ్ గ్రీన్ అంశంలో ఎంపిక చేసింది. అందులో కాదలూరు పంచాయతీ కూడా ఎంపికైంది. ఈ అవార్డును జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో సర్పంచ్‌లకు అందజేయనున్నారు. సంజీవయ్య తల్లి కిలివేటి మస్తానమ్మ కాదలూరు సర్పంచ్‌గా ఉన్నారు.

తొలి బ్యాచ్ సీహెచ్‌వోలకు శిక్షణ పూర్తి

సోమవారం నుంచి రెండో బ్యాచ్‌కు శిక్షణ

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌లో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌లలో నైపుణ్యాలు పెంచేందుకు చేపట్టిన శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 22 నుంచి అన్ని జిల్లా, బోధనాస్పత్రుల్లో శిక్షణ కార్యక్రమాలను వైద్య శాఖ ప్రారంభించింది. ఒక్కో బ్యాచ్‌కు 40 మంది సీహెచ్‌వోలకు వారం పాటు శిక్షణ ఇస్తున్నారు. కాగా మొదటి వారంలో 1,237 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారు. సోమవారం నుంచి రెండో బ్యాచ్ వారికి శిక్షణ ప్రారంభించనున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక గ్రామాల్లో ప్రతి 2,500 మంది జనాభాకు ఒకటి చొప్పున 10,032 విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసింది. ప్రతి క్లినిక్‌లో బీఎస్సీ నర్సింగ్ విద్యార్హత ఉన్న వారిని సీహెచ్‌వోగా నియమించింది. ఆరోగ్య అత్యవసర సమయాల్లో ప్రజలకు ప్రాథమిక వైద్యసేవలు అందించడం, ఇతర క్లినికల్ మేనేజ్‌మెంట్‌కు వీలుగా వీరిలో సామర్థ్యాలను పెంచాలని సీఎం జగన్ ఆదేశించారు. ఈ క్రమంలో ప్రత్యేక కరిక్యులమ్‌ను ఏర్పాటు చేసి సీహెచ్‌వోలకు శిక్షణ ఇస్తున్నారు. అత్యవసర సమయాల్లో అన్ని రకాల ప్రాథమిక వైద్యసేవలు అందించడంపై అవగాహన కల్పిస్తున్నారు.

ప్రధాన కేంద్రాల్లో ఆదివారం నమోదైన గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు(డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
రెంటచింతల	47.2	29.6
నెల్లూరు	42.5	31.8
కర్నూలు	42.4	29.2
గుంటూరు	42.0	29.0
విజయవాడ	42.0	28.0
కడప	40.5	27.0
ఏలూరు	40.0	29.0
తిరుపతి	40.0	27.0
రాజమహేంద్రవరం	39.0	27.0
శ్రీకాకుళం	37.0	26.0
విశాఖపట్నం	35.2	28.0

బాబోయ్.. లో బ్యాటరీ!



- ప్రతి నలుగురిలో ముగ్గురికి ఫోబియా.. స్మార్ట్‌ఫోన్ 'లో-బ్యాటరీ'లో పడితే..
- బ్యాటరీ చార్జింగ్‌పై భయం పెట్టుకుంటున్న వినియోగదారులు
- దీనినే 'నోమోఫోబియా'గా పేర్కొంటున్న ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ
- 'ఒప్పో, కౌంటర్ పాయింట్' సర్వేలో ఆసక్తికరమైన విషయాలు వెల్లడి

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: కాసేపు ఫోన్ కనపడకపోతే.. ప్రపంచానికి మనం దూరమైపోయినట్టు తల్లడిల్లిపోతుంటాం. అదే.. ఫోన్‌లో లో-బ్యాటరీ అనే సింబల్ కనిపిస్తే.. చాలామందిలో ఆందోళన పెరిగిపోతుంటుంది. దీనినే నోమోఫోబియో (నో మొబైల్ భయం) అని పిలుస్తారంట. నాలుగేళ్ల క్రితం ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలో ఈ పదాన్ని చేర్చినా.. ఇప్పుడు ప్రతి నలుగురు భారతీయుల్లో ముగ్గురు ఈ నోమోఫోబియోతో బాధపడుతున్నారని ఓ సర్వేలో తేలింది. ప్రముఖ స్మార్ట్ ఫోన్ తయారీ సంస్థ ఒప్పో ఇండియా, మార్కెట్ రీసెర్చ్ సంస్థ కౌంటర్ పాయింట్‌తో కలిసి దేశంలోని నగరాల్లో ఈ సర్వే నిర్వహించింది. ఫోన్ బ్యాటరీ లెవల్స్ పడిపోయినప్పుడు వినియోగదారులు ఎలా స్పందిస్తున్నారనే దానిపై టైర్-1, టైర్-2 నగరాల్లోని 1,500 మంది ఫోన్ యూజర్ల నుంచి వివరాలు సేకరించారు.

బ్యాటరీ అయిపోతే.. ఫోన్ వాడలేం!

ఈ అధ్యయనం ప్రకారం.. సెల్‌ఫోన్ బ్యాటరీ చార్జింగ్ అయిపోతే ఫోన్ వాడలేం కదా.. ఇప్పుడెలా అనే ఆందోళనతో ఎక్కువ మంది బాధపడుతున్నారట. ఈ క్రమంలో లో-బ్యాటరీ అనే సిగ్నల్ కనిపిస్తే చాలు టెన్షన్‌తో ఇబ్బందులు పడుతున్నారని వెల్లడైంది. 100 శాతం బ్యాటరీ ఉన్నప్పుడు ఆనందంగా ఉండే వినియోగదారులు.. ఫోన్ చార్జింగ్ 20 శాతానికి తక్కువగా కనిపిస్తే ఫోబియోతో బాధపడుతున్నారని తేలింది. 100 మందిలో 75 మంది ఫోన్ చార్జింగ్ తగ్గిపోతున్న కొద్దీ స్విచ్‌ఆఫ్ అయిపోతుందన్న ఆందోళనతో కనిపిస్తున్నారని ఈ అధ్యయనంలో తేలింది.

సర్వే ఇంకేం చెప్పిందంటే..

- 'లో బ్యాటరీ' నోమోఫోబియో భయం 31 నుంచి 40 ఏళ్లలోపు వయసు వారిలో 77 శాతం వరకూ ఉండగా.. 25 నుంచి 30 ఏళ్లలోపు వారిలోనూ ఈ భయం గుర్తించినట్టు సర్వేలో వెల్లడించింది.
- 87 శాతం మంది ఫోన్‌ని చార్జింగ్ పెట్టి మరీ ప్రమాదకరంగా వినియోగిస్తున్నారు.
- ఫోన్ బ్యాటరీ పనిచేయకుంటే భయం భయంగా ఉంటుందని 82% మంది పురుషులు చెప్పగా.. 74 శాతం మంది మహిళా యూజర్లు అదే ఆందోళన వెలిబుచ్చారు.
- 60 శాతం మంది వినియోగదారులైతే ఫోన్ బ్యాటరీలో చార్జింగ్ తక్కువ సమయం వస్తుంటే.. వెంటనే 100లో 60 మంది కొత్త ఫోన్ కొనుగోలు చేసేస్తున్నారు.
- 100లో 46 మంది వినియోగదారులు తమ ఫోన్‌లో చార్జింగ్ ఉన్నప్పటికీ రోజుకు రెండు సార్లు చార్జింగ్ పెడుతున్నారు. 0 92 శాతం మంది తమ ఫోన్‌లో పవర్ సేవింగ్ మోడ్ వినియోగిస్తున్నారు.
- ఇంటికి చేరేలోపు లో-బ్యాటరీ సిగ్నల్ వస్తుందేమోనన్న భయంతో 82 శాతం మంది యూజర్లు సోషల్ మీడియా వినియోగ సమయాన్ని తగ్గించేసుకుంటున్నారు.
- సోషల్ మీడియా కోసమే స్మార్ట్ ఫోన్ అని 78 శాతం మంది చెప్పారు.
- ఎంటర్‌టైన్‌మెంట్, మూవీస్, సీరియల్స్, టీవీ షోస్ చూసేందుకు ఎక్కువగా వినియోగిస్తున్నామని 42% మంది వినియోగదారులు చెప్పారు.

ఆందోళన తగ్గించుకోవాలి



స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో వస్తున్న మార్పులపై అధ్యయనం చేసేందుకు సర్వే నిర్వహించాం. ప్రస్తుత రోజుల్లో స్మార్ట్‌ఫోన్‌లు జీవితాలపై ప్రతికూల ప్రభావాలను కూడా కలిగిస్తాయని గుర్తించాలి. గంటల కొద్దీ ఫోన్‌ని వినియోగించకుండా అవసరం మేరకే ఫోన్లని వాడాలి. స్మార్ట్ ఫోన్ల విషయంలో కలిగే ఆందోళనలను తగ్గించుకునేందుకు ప్రయత్నించాలని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. ఫోన్ వాడకానికి అప్పుడప్పుడూ గ్యాప్ ఇస్తూ కుటుంబసభ్యులు, స్నేహితులు, కొలీగ్స్‌తో మమేకమవుతూ మానవ సంబంధాలకు విలువనివ్వాలి. ఫోన్ల వాడకంపై అవగాహనతో పాటు జాగ్రత్తగా ఉండటం ద్వారా నోమోఫోబియోని అధిగమించడం సులువు.

– దమయంత్ సింగ్ ఖనోరియా, సీఎంవో, ఒప్పో ఇండియా

పార్లమెంటు భవనం ప్రారంభోత్సవానికి హాజరైన సీఎం వైఎస్ జగన్

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటు నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. లోక్‌సభలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ముఖ్యమంత్రి తొలి వరసలో కూర్చొన్నారు. ఈ సందర్భంగా పలువురు కేంద్ర మంత్రులు, నేతలను ముఖ్యమంత్రి జగన్ పలకరించారు.

విభజన సమస్యలు పరిష్కరించండి

కేంద్ర హోంమంత్రికి సీఎం జగన్ విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల మధ్య విభజన సమస్యలు పరిష్కరించాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కు ఏపీ సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం రాత్రి ఆయన హోం మంత్రి నివాసంలో అమిత్ షా తో సుమారు 40 నిమిషాలు భేటీ అయ్యారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఇప్పటికీ పరిష్కారం కాని పలు అంశాలపై చర్చించారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి సవరించిన అంచనాలకు వీలైనంత త్వరగా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపేలా చూడాలని కోరారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ, తెలంగాణ మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలో ఏపీ భవన్ సహా షెడ్యూల్ 9, 10 ఆస్తుల విభజనపై కూడా చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి రావాల్సిన విద్యుత్ బకాయిల అంశాన్నీ హోం మంత్రి దృష్టికి తెచ్చారు. ఏపీ విద్యుత్ సంస్థల ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని, వెంటనే ఈ బకాయిలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పాలనలో నయా పంథా

- నవరత్నాల పథకాల ద్వారా రూ.2.11 లక్షల కోట్లు ప్రజల ఖాతాల్లో జమ
- రాజకీయ, ఆర్థిక భరోసాతో మహిళా సాధికారతకు పెద్దపీట
- 10,778 రైతు భరోసా కేంద్రాలు.. 10,592 గ్రామ, వార్డు హెల్త్ క్లినిక్‌లు
- 13 జిల్లాలను 26 జిల్లాలుగా చేసి పరిపాలన వికేంద్రీకరణకు శ్రీకారం
- భూ వివాదాలకు శాశ్వత ముగింపు దిశగా సమగ్ర భూ సర్వే

సాక్షి, అమరావతి: కేవలం నాలుగేళ్లలోనే సంస్కరణల ద్వారా పరిపాలన వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు రాష్ట్రం చిరునామాగా మారింది. సామాజిక బాధ్యతగా విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ రంగాల్లో అందించాల్సిన సేవల్లో ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులు, సంస్కరణలు సత్ఫలితాలిస్తున్నాయి. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పాలనా వ్యవస్థల్లో మార్పులు కొట్టొచ్చినట్లు కనిపించేలా చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ సర్కారుకే దక్కుతుంది. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని, 73వ రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థలకే అధికారాలు, విధులు అప్పగించాలనే మాటలను సాక్షాత్కరింప చేసిన ఏకైక రాష్ట్రంగా నిలిచింది ఏపీనే. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు, పథకాలను అందిస్తోంది. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే (2019) కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేసి, చేతులు దులుపుకోకుండా.. వాటి ద్వారా ప్రభుత్వ సేవలు, పథకాలు అందించడానికి అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు ఉద్యోగులు, సిబ్బందిని భర్తీ చేసింది. దేశ చరిత్రలోనే తొలిసారిగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాలతో పక్కా వ్యవస్థ ఏర్పాటు చేసింది. వీటిలో 1.34 లక్షల శాశ్వత ఉద్యోగాలను సృష్టించి.. భర్తీ చేసింది. ప్రతి 50 ఇళ్లకు వలంటీర్ చొప్పున ప్రజల చేయి పట్టుకుని నడిపించే సేవా వ్యవస్థను తెచ్చింది. సచివాలయాలతో అనుసంధానమై 2.65 లక్షల మంది వలంటీర్లుగా పనిచేస్తున్నారు. తద్వారా 600 పౌర సేవలు లంచాలు, వివక్షకు తావు లేకుండా అందుతున్నాయి. మారుమూల పల్లెల్లో సైతం ఎక్కడ చూసినా పౌర సేవల్లో గొప్ప విప్లవం కనిపిస్తోంది.

రేషన్ డోర్ డెలివరీతో రోల్ మోడల్

పేదల ఇంటి వద్దకే రేషన్ డోర్ డెలివరీ చేయడంలో ఏపీ రోల్ మోడల్‌గా నిలిచింది. ఏ పల్లెలో అయినా, పట్టణంలో అయినా రేషన్ బియ్యం మన వీధికి, మన ఇంటి ముంగిటకే అందించే వ్యవస్థ దేశంలో ఏపీలోనే అమల్లో ఉంది. మిగతా రాష్ట్రాలు ఈ వ్యవస్థను అమలు చేసేందుకు యత్నిస్తున్నాయి. రేషన్ షాపుల దగ్గర గంటల తరబడి క్యూలో నిలబడే దుస్థితిని నివారించి రాష్ట్ర వ్యాప్తంగా 9,260 డెలివరీ వ్యాన్‌లతో నాణ్యమైన సార్టెక్స్ బియ్యాన్ని డెలివరీ చేస్తున్న ప్రభుత్వం దేశంలో ఏపీ ఒక్కటే.

వ్యవసాయం పండుగైంది



దేశంలోనే తొలిసారిగా రైతుల కోసం 10,778 రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే) ఏర్పాటు చేయడం ద్వారా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు కనిపిస్తున్నాయి. ఈ కేంద్రాలు విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు ప్రతి సేవలోనూ రైతన్నకు తోడుగా ఉంటూ, వారి చేయి పట్టుకుని నడిపిస్తున్నాయి. ఆర్బీకేలలో 10,778 మంది అగ్రికల్చర్, హార్టికల్చర్ గ్రాడ్యుయేట్లు పని చేస్తూ రైతులకు తోడుగా ఉన్నారు.

అవ్వాతాతల ఇంటికే ప్రతి నెలా పెన్షన్

దేశంలో ఎక్కడా లేని విధంగా పేద అవ్వాతాతలు, వికలాంగులు, వితంతువులు, దీర్ఘ వ్యాధిగ్రస్తుల ఇంటికే ప్రతి నెలా పెన్షన్‌ను వలంటీర్ల ద్వారా అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ప్రతీ నెలా ఒకటో తేదీన సూర్యోదయానికి ముందే వలంటీర్ ఇంటింటికీ వచ్చి లబ్ధిదారుల చేతిలో పెన్షన్ సొమ్ము పెట్టే కార్యక్రమం సజావుగా సాగుతోంది.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఆరోగ్యానికి భరోసా

రాష్ట్రంలో 10,592 గ్రామ, పట్టణ హెల్త్ క్లినిక్స్ ద్వారా ఆయా గ్రామాల్లోని ప్రజలకు ఉచితంగా వైద్య చికిత్సలను అందుబాటులోకి తెస్తూ ప్రభుత్వం ఈ రంగంలో గొప్ప మార్పులు తెచ్చింది. ఈ క్లినిక్స్‌ల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ 24 గంటలూ అందుబాటులో ఉంటారు. 105 రకాల మందులు ఉంటున్నాయి. 14 రకాల పరీక్షలు చేస్తూ.. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో అనుసంధానమై అక్కడే సేవలందిస్తూ కనిపిస్తున్నారు. గతానికి ఇప్పటికి వ్యవస్థలో ఇదో స్పష్టమైన మార్పు.

ఉన్న ఊరిలోనే ప్రభుత్వ సేవలు



ప్రజలు పనుల నిమిత్తం మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలకు తిరగాల్సిన అవసరం లేకుండా ఉన్న ఊరిలోనే ప్రభుత్వ సేవలు, పథకాలు అందుతున్నాయి. దీంతో గతంలో ఎక్కడకో వెళ్లి దరఖాస్తు చేయడం, రాజకీయ నేతల చుట్టూ తిరగడం, లంచాలు ఇవ్వడం.. ఇలాంటి కష్టాలన్నింటికీ బ్రేక్ పడింది. ఉన్న ఊరిలో గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే అర్హత ఉంటే చాలు.. ఎవరి సిఫార్సు లేకుండానే సేవలు, పథకాలు అందుతున్నాయి. గతంలో రూపాయి ఇస్తే పావలా మాత్రమే లబ్ధిదారులకు చేరేది. ఇప్పుడు నేరుగా నగదు బదిలీ ద్వారా రూపాయి ఇస్తే రూపాయి లబ్ధిదారుల ఖాతాల్లోకి వెళుతోంది. గత నాలుగేళ్లలో నవరత్నాల పథకాల ద్వారా రూ.2.11 లక్షల కోట్లు లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా నగదు జమ అయింది. రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు, పెన్షన్, ఇంటి జాగా ఇలా ఏ ప్రభుత్వ పథకం కావాలన్నా.. లేదా ఏ ప్రభుత్వ సేవలు కావాలన్నా గ్రామ, వార్డు సచివాలయాల్లోనే అందుతున్నాయి. గతానికి, ఇప్పటికీ ఇదో గొప్ప మార్పు.

బ్రాండ్ ఏపీ

కొత్తగా మరో 13 జిల్లాలు

రాష్ట్రంలో 2019 నాటికి 13 జిల్లాలు ఉంటే జిల్లా పాలన వికేంద్రీకరణలో భాగంగా ప్రభుత్వం కొత్తగా మరో 13 జిల్లాల ఏర్పాటు ద్వారా మొత్తం 26 జిల్లాలను చేసింది. 51 డివిజన్లను 78కి, 679 మండలాలను 691కి పెంపు ద్వారా మరింతగా పాలనను వికేంద్రీకరణ చేసింది. ఆఖరికి చంద్రబాబు నియోజకవర్గం కేంద్రమైన కుప్పంను రెవెన్యూ డివిజన్‌గా చేసింది ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వమే. ప్రజలకు జిల్లా, డివిజన్, మండల పాలన సేవలను మరింత చేరువ చేయడంలో భాగంగా వికేంద్రీకరణ చేపట్టింది. ఇది పరిపాలన రంగంలో గొప్ప సంస్కరణగా నిలుస్తోంది.

సమగ్ర భూ సర్వేతో వివాదాలకు స్వస్తి

భూ వివాదాలకు శాశ్వత ముగింపు దిశగా వందేళ్ల తర్వాత సమగ్ర భూ సర్వే చేపట్టి గ్రామ స్థాయిలో గొప్ప మార్పునకు నాంది పలికింది. సమగ్ర భూ సర్వే కోసం గ్రామాలు, పట్టణాల్లో ఏకంగా 10,185 మంది సర్వేయర్లను నియమించింది. 40 డ్రోన్లు కొనుగోలు చేసింది. కబ్జాలకు, భూ వివాదాలకు శాశ్వతంగా స్వస్తి పలుకుతూ.. ప్రజల భూములపై శాశ్వత భూ హక్కును కల్పిస్తూ స్పష్టమైన భూ రికార్డులకు ప్రభుత్వం నాంది పలికింది. గ్రామ, వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ల అమలుకు శ్రీకారం చుట్టడం ద్వారా గొప్ప మార్పులను చేపట్టింది.

టెండర్ల విధానంలో పారదర్శకత

జ్యుడిషియల్ ప్రివ్యూతో పాటు రివర్స్ టెండర్ ద్వారా టెండర్ల విధానంలో పారదర్శకతకు పెద్ద పీట వేసింది. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా తొలిసారి జ్యుడిషియల్ ప్రివ్యూను ఏర్పాటు చేసింది. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ మౌలిక సదుపాయాలు (తొలుత న్యాయ పరమైన సమీక్ష ద్వారా పారదర్శకత) చట్టం–2019ను అమల్లోకి తెచ్చింది. రూ.100 కోట్లు పైబడిన పనుల టెండర్లన్నీ జ్యుడిషియల్ ప్రివ్యూకు వెళ్తున్నాయి. రివర్స్ టెండర్ విధానం ద్వారా ప్రజా ధనం ఆదాకు పెద్ద పీట వేస్తూ టెండర్ల రంగంలో చేపట్టిన సంస్కరణలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి.

'స్పందన'తో ప్రజా సమస్యల పరిష్కారం

అధికారంలోకి వచ్చిన నాటి నుంచే రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల, గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ప్రజా సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి 'స్పందన' కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చింది. ప్రతి సోమవారం స్పందన కార్యక్రమాన్ని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి కార్యాలయాల్లో సంబంధిత ఉన్నతాధికారులు స్వయంగా నిర్వహిస్తున్నారు. 1902కు ఫోన్ చేసి సమస్యను చెబితే.. దాన్ని నమోదు చేసుకుని నిర్ణీత సమయంలోగా పరిష్కరించే ఏర్పాటు చేశారు. దీన్ని మరింత నాణ్యతతో అమలు చేయడంలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం జగనన్నకు చెబుదాం కార్యక్రమంగా మార్చారు. దీన్ని జిల్లా కలెక్టర్లతో పాటు నేరుగా సీఎం కార్యాలయం పర్యవేక్షిస్తోంది. ఇది ప్రజల సమస్యల పరిష్కారానికి వ్యవస్థలో తీసుకొచ్చిన గొప్ప మార్పుగా నిలుస్తోంది.

చేతల్లో సుపరిపాలన

గత ప్రభుత్వాలు ఏవీ కూడా అధికారాలను, విధులను స్థానిక సంస్థలకు అప్పగించడానికి ఇష్టపడలేదు. తొలిసారిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి.. ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన, పౌర సేవలను ధైర్యంగా తీసుకెళ్లారు. గత ప్రభుత్వాలు విద్య, వైద్య రంగాలను ప్రైవేట్‌కు అప్పగించడానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తే.. సీఎం జగన్.. ప్రభుత్వ రంగంలో విప్లవాత్మక మార్పులు తేవడం ద్వారా ఆ రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి బలోపేతం చేశారు. సమగ్ర భూ సర్వే అనేది మరో విప్లవాత్మక చర్య. కరణం, మునసబుల వ్యవస్థను రద్దు చేశాక గ్రామాల్లో భూ రికార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. భూముల లిటిగేషన్లతో చాలా మంది ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. దీనికి పరిష్కారంగా వందేళ్ల తర్వాత తొలిసారిగా సమగ్ర భూ సర్వే చేపట్టారు. విద్యుత్ రంగంలో రెన్యువబుల్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇస్తున్నారు. దీని వల్ల కొంత కాలం తర్వాత ఉత్పత్తి వ్యయం తగ్గి, ప్రజలకు మేలు చేకూరుతుంది. పోర్టు ఆధారిత పారిశ్రామికాభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. మొత్తంగా వేగవంతమైన అభివృద్ధి దిశగా అడుగులు ముందుకు వేస్తున్నారు.

– అజేయ కల్లం, సీఎం ముఖ్య సలహాదారు

మహిళా సాధికారత దిశగా అడుగులు

మహిళలకు ప్రభుత్వ నామినేటెడ్ పనులు, నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఏకంగా చట్టాలు చేసి, అమలు చేస్తోంది. దేశంలో ఏ రాష్ట్రంలోనూ మహిళల కోసం ఇలాంటి చట్టాలు చేసిన దాఖలాల్లేవు. జెండర్ బేస్డ్ బడ్జెట్ పేరుతో మహిళలకు, పిల్లలకు బడ్జెట్ ప్రత్యేక కేటాయింపులు చేస్తోంది. 31 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలను మహిళల పేరిట ఇచ్చిన ఏకైక ప్రభుత్వం ఇదే. మహిళా సాధికారత దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో స్థాపించే పరిశ్రమలు, కంపెనీల్లో స్థానిక యువతకు ఉద్యోగాల్లో 75 శాతం ఇవ్వాలని ప్రత్యేకంగా చట్టం చేసి, అమలు చేస్తోంది. స్థానికంగా యువతకు ఎక్కువగా ఉపాధి కల్పించే ఎంఎస్ఎంఈ రంగాలను ప్రోత్సహిస్తోంది.

మారిన విద్య, వైద్య రంగాల ముఖ చిత్రం

ప్రజలకు విద్య, వైద్యం అందించాల్సిన కనీస సామాజిక బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుంది. ఈ రెండు రంగాల్లో సీఎం వైఎస్ జగన్ భారీ మార్పులకు శ్రీకారం చుట్టడంతో ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వ రంగంలోని విద్య, వైద్య సంస్థలను వేగంగా బలోపేతం చేస్తున్నారు. మారుతున్న సాంకేతికతతో పాటు భవిష్యత్‌లో అవసరమైన రంగాల్లో మానవ వనరులను అభివృద్ధి చేసేందుకు బోధనా పద్ధతుల్లో, పాఠ్యాంశాల్లో మార్పులు తెచ్చారు. నైపుణ్యాలతో కూడిన యువతను తయారు చేయడానికి బాటలు వేశారు. వైద్య రంగంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మార్పులు తెచ్చారు. గత రెండేళ్లలోనే 48,639 మంది వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించడం ద్వారా అన్ని స్థాయి వైద్య సంస్థల్లో మెరుగైన వైద్య చికిత్సలను అందుబాటులోకి తీసుకు వచ్చారు.

చెప్పిందొకటి.. చేసింది మరొకటా?

- నీటి పంపిణీలో కృష్ణా బోర్డు తీరుపై రాష్ట్ర ప్రభుత్వం ఆక్షేపణ
- పాత విధానాన్నే కొనసాగిస్తామని సమావేశంలో చెప్పిన బోర్డు చైర్మన్
- మినిట్స్‌లో మాత్రం అపెక్స్ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తున్నట్లు వెల్లడి
- దీనిపై కృష్ణా బోర్డు చైర్మన్‌కు లేఖ రాస్తామన్న ఏపీ ఈఎన్‌సీ

సాక్షి, అమరావతి: కృష్ణా నదీ జలాల పంపిణీపై కృష్ణా బోర్డు తీరును రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ఆక్షేపిస్తోంది. పాత పద్ధతిలోనే పంపిణీ చేస్తామని చెప్పిన బోర్డు.. ఆ తర్వాత అపెక్స్ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తామనడంపై తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఈనెల 10న జరిగిన 17వ సర్వ సభ్య సమావేశంలో పాత పద్ధతిలోనే ఏపీకి 66 శాతం, తెలంగాణకు 34 శాతం జలాలను పంపిణీ చేస్తామని బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్ స్పష్టంగా చెప్పారు. దీనిపై అభ్యంతరం ఉంటే కేంద్ర జల్ శక్తి శాఖ లేదా అపెక్స్ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లాలని తెలంగాణకు సూచించారు. కానీ.. ఈనెల 19న జారీ చేసిన సమావేశం మినిట్స్‌లో జలాల పంపిణీ అంశాన్ని అపెక్స్ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఆమోదించింది ఒకటైతే.. మినిట్స్‌లో మరొకటి ఎలా పొందుపరుస్తారంటూ ఆంధ్రప్రదేశ్ అభ్యంతరం తెలిపింది. దీనిపై బోర్డు చైర్మన్‌కు లేఖ రాస్తామని ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి 'సాక్షి'కి చెప్పారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన జలాలను విభజన అనంతరం రెండు రాష్ట్రాలకు పంపిణీ చేసే బాధ్యతను కూడా అదే ట్రిబ్యునల్‌కు కేంద్రం అప్పగించింది. ఉమ్మడి రాష్ట్రంలో పూర్తయిన ప్రాజెక్టులకు చేసిన కేటాయింపుల జోలికి వెళ్లకుండా.. నీటి కేటాయింపులు లేని ప్రాజెక్టులకే పంపిణీకి పరిమితం కావాలని విభజన చట్టంలో నిర్దేశించింది. రెండు రాష్ట్రాలకు నీటి కేటాయింపులపై ట్రిబ్యునల్ ఎనిమిదేళ్లుగా విచారణ చేస్తోంది.

బచావత్ ట్రిబ్యునల్ అవార్డే ప్రామాణికం

ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణా బేసిన్‌లోని 29 ప్రాజెక్టులకు బచావత్ ట్రిబ్యునల్ 811 టీఎంసీలను కేటాయించింది. ఈ కేటాయింపుల ఆధారంగా ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు (66 శాతం), తెలంగాణకు 299 టీఎంసీలు (34 శాతం) దక్కుతాయి. ఆ మేరకు నీటిని పంపిణీ చేస్తూ 2015 జూన్ 19న కేంద్రం సమక్షంలో తాత్కాలిక సర్దుబాటు ఒప్పందంపై రెండు రాష్ట్రాలు సంతకాలు చేశాయి. 2015–16లో అదే పద్ధతిలో కృష్ణా బోర్డు నీటిని పంపిణీ చేసింది. కానీ తెలంగాణ సగం జలాల కోసం ప్రతి ఏటా పట్టుబడుతూ వస్తోంది. నీటి కేటాయింపుల అధికారం తమకు లేదని, దానిపై బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ చేస్తోందని, తాత్కాలిక సర్దుబాటు మేరకే నీటిని పంపిణీ చేస్తామని బోర్డు చెబుతోంది. 2023–24లోనూ పాత పద్ధతిలోనే పంపిణీ చేస్తామని బోర్డు చైర్మన్ చెప్పారు. మినిట్స్‌లోకి వచ్చే సరికి అపెక్స్ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొనడంపై నిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. బచావత్ ట్రిబ్యునల్ అవార్డే ప్రామాణికమని గుర్తుచేస్తున్నారు.

బోర్డు ప్రేక్షకపాత్ర

కృష్ణా జలాలపై రెండు రాష్ట్రాల మధ్య విభేదాలు రాకుండా చూడాల్సిన బోర్డు.. పరిష్కారమైన వివాదాలను కూడా తెలంగాణ ప్రభుత్వం రాజేస్తుంటే.. వాటికి చెక్ పెట్టకుండా ప్రేక్షకపాత్ర పోషిస్తోండటంపై నిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నీటిని కేటాయించే అధికారం ట్రిబ్యునల్‌కే ఉందని, కేంద్ర జల్ శక్తి శాఖకు, అపెక్స్ కౌన్సిల్‌కు లేదనే విషయాన్ని గుర్తు చేస్తున్నారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు అమల్లోకి వచ్చే వరకూ పాత పద్ధతిలోనే పంపిణీ చేయాలని, లేదంటే న్యాయ ఉల్లంఘనే అవుతుందని స్పష్టం చేస్తున్నారు.

నేటి భవితలో..

- సీడీఎస్ఈ(2)–2023: డిగ్రీతో.. డిఫెన్స్ ఆఫీసర్: బ్యాచిలర్ డిగ్రీ అభ్యర్థులకు సువర్ణావకాశం. భద్రతా దళాల్లో కెరీర్‌కు బంగారు బాట వేసే కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(సీడీఎస్ఈ)కు యూపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపిక ప్రక్రియలో విజేతగా నిలిస్తే.. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌ల్లో పర్మనెంట్ కమిషన్ ర్యాంకుతో ఆఫీసర్‌గా కొలువుదీరొచ్చు. ఇటీవల సీడీఎస్ఈ(2)–2023 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. సీడీఎస్ఈ ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..
- గ్రూప్స్ ప్రత్యేకం–కరెంట్ అఫైర్స్: పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడేలా.. అంతర్జాతీయం, జాతీయం, రాష్ట్రీయం, వార్తల్లో వ్యక్తులు, క్రీడలు తదితర ముఖ్యాంశాలతో వీక్లీ కరెంట్ అఫైర్స్ రౌండప్
- విద్య, ఉద్యోగ సమాచారం



నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

క్లుప్తంగా...

రాజకీయాల్లో, చిత్రపరిశ్రమలో ఎన్టీఆర్‌ది చెరగని ముద్ర

నివాళులర్పించిన ప్రధాని మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: రాజకీయాల్లో, చలనచిత్ర పరిశ్రమలో చెరగని ముద్రవేసిన గొప్ప వ్యక్తి ఎన్టీఆర్ అని ప్రధాని మోదీ కొనియాడారు. కోట్లాది మంది ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారని పేర్కొన్నారు. ఆదివారం 101వ మన్‌కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ.. ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'రాజకీయాల్లో, చలనచిత్ర పరిశ్రమలో తన అద్భుతమైన ప్రతిభతో చెరగని ముద్ర వేసిన గొప్ప వ్యక్తి ఎన్టీ రామారావు. తన బహుముఖ ప్రజ్ఞతో తెలుగు చిత్రసీమలో సూపర్ స్టార్‌గా నిలవడమే కాకుండా కోట్లాది మంది ప్రజల హృదయాలను గెలుచుకున్నారు. 300కి పైగా సినిమాల్లో నటించారు. శ్రీకృష్ణుడు, శ్రీరాముడు తదితర పాత్రల్లో ఎన్టీఆర్ నటనను ప్రజలు ఎంతగానో ఇష్టపడ్డారు. ఎన్టీఆర్ సినీ రంగంతో పాటు రాజకీయాల్లోనూ తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రజల నుంచి అమితమైన ప్రేమ సంపాదించిన ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్నాను' అని ప్రధాని పేర్కొన్నారు.

నూతన పార్లమెంట్‌పై ప్రతిపక్షాలది అనవసర రాద్ధాంతం: సునీల్ దేవ్‌ధర్



కర్నూలు(సెంట్రల్): ప్రధాని మోదీ 9 ఏళ్ల పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని, రెండున్నరేళ్లలోనే నూతన పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించడం గర్వించదగ్గ విషయమని బీజేపీ నేత సునీల్ దేవ్‌ధర్ అన్నారు. ఆదివారం కర్నూలులో జరిగిన బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో 30–40 ఏళ్లకుగాను ఒక్క ప్రాజెక్టు పూర్తి అయ్యేది కాదన్నారు. పాత పార్లమెంట్ భవనానికి నెహ్రూ పునాది వేస్తే రాజీవ్‌గాంధీ హయాంలో ప్రారంభించడమే నిదర్శనమన్నారు. నూతన పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవంపై ప్రతిపక్షాలు లేని పోని రాద్ధాంతం చేస్తున్నాయని, వాటికి ప్రజాస్వామ్యంపై గౌరవం లేదన్నారు. కేవలం మోదీని వ్యతిరేకించాలన్న దురుద్దేశంతో పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి రాలేదన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరెడ్డి శబరి, బిట్ర శివనారాయణ హాజరయ్యారు.

వెన్నుపోటు పొడిచి.. శతజయంతి ఉత్సవాలా?

చంద్రబాబును ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్



సాక్షి, న్యూఢిల్లీ: నాడు ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి నేడు శతజయంతి ఉత్సవాలు చేస్తారా అని టీడీపీ అధినేత చంద్రబాబును వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రశ్నించారు. ఎన్టీఆర్ నుంచి పార్టీని లాక్కుని సస్పెండ్ చేసిన విషయం మరిచిపోయారా అని నిలదీశారు. ఢిల్లీలో ఆదివారం పార్లమెంటు నూతన భవనం ప్రారంభోత్సవానికి హాజరైన అనంతరం ఎంపీ భరత్‌రామ్ మీడియాతో మాట్లాడారు. ఎన్టీఆర్.. చంద్రబాబును గాడ్సేతో పోల్చిన విషయాన్ని గుర్తుచేశారు. రాజమహేంద్రవరంలో టీడీపీ మహానాడు రాజకీయంగా ఆ పార్టీకి చివరినాడు కాబోతోందన్నారు. తాతకు వెన్నుపోటు పొడిచారని గుర్తించినందువల్లే జూనియర్ ఎన్టీఆర్ మహానాడుకు దూరంగా ఉన్నారేమో అని పేర్కొన్నారు. చంద్రబాబు గురించి ప్రజలతో పాటు టీడీపీ కార్యకర్తలు, నేతలు కూడా ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడాన్ని టీడీపీ వ్యతిరేకించడం సబబు కాదని చెప్పారు. 50 వేల ఎకరాల్లో 2,500 ఎకరాల వరకు పేదలకు ఇవ్వొచ్చని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం పేదలదని చెప్పారు. సెంటు భూమి పేదలకు సరిపోదంటూ అచ్చెన్నాయుడు అవహేళన చేస్తున్నారని పేర్కొన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తే తప్పేంటో చెప్పాలన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వొద్దని లేఖలు రాస్తున్న రఘురామకృష్ణరాజుకి మహిళలే బుద్ధిచెబుతారని హెచ్చరించారు.

బాబు 14 ఏళ్లు సీఎంగా ఉండి బీసీలకు చేసింది శూన్యం

ఏపీ బీసీ సంఘం అధ్యక్షుడు మారేష్



సాక్షి, అమరావతి: బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుని దగా చేసి వదిలేసిన చంద్రబాబుకు బీసీల పేరెత్తే అర్హత లేదని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ మండిపడ్డారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో చంద్రబాబు మళ్లీ బీసీ మంత్రం పటిస్తూ మహానాడులో మోసపూరిత ప్రసంగాలు చేయడాన్ని ఖండిస్తూ విజయవాడలోని బీసీ సంఘం రాష్ట్ర కార్యాలయంలో 25 బీసీ కుల సంఘాలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. మారేష్ మాట్లాడుతూ 14 ఏళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు బీసీలకు చేసింది శూన్యమన్నారు. సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో 139 బీసీ కులాలకు సంక్షేమం, అభివృద్ధిలో న్యాయం చేస్తున్నారని కొనియాడారు. చంద్రబాబు హయాంలో సంపద కొద్ది మంది చేతుల్లో మాత్రమే కేంద్రీకృతమైందని, సీఎం వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రంలో సృష్టించబడుతున్న సంపద పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాల రూపంలో నేరుగా వారి ఖాతాల్లోకి వెళుతోందన్నారు.

నాడు ఎన్టీఆర్‌ను తిట్టారు.. నేడు దండలు వేస్తున్నారు

చంద్రబాబు, టీడీపీ నేతల తీరుపై ఆర్జీవీ, పోసాని, లక్ష్మీపార్వతి ఆగ్రహం



ప్రసంగిస్తున్న రామ్‌గోపాల్ వర్మ. వేదికపై పోసాని కృష్ణమురళి, నందమూరి లక్ష్మీపార్వతి తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): 'నేను ఒక సీరియస్ జోక్ చెప్పడానికే ఇక్కడికి వచ్చాను. ఆ జోక్ ప్రస్తుతం రాజమండ్రిలో జరుగుతోంది. స్వర్గంలో ఉన్న ఎన్టీఆర్ కూడా నవ్వాలో.. ఏడ్వాలో అర్థం కానీ జోక్ అది. ఆయన మరణానికి కారణమైన వాళ్లే.. ఇప్పుడు ఎన్టీఆర్ కంటే గొప్ప వ్యక్తి లేరు అంటూ కీర్తిస్తున్నారు' అని టీడీపీ మహానాడును ఉద్దేశించి సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ అన్నారు. నాడు లక్ష్మీపార్వతితో ఉన్న ఎన్టీఆర్‌ను తిట్టిన వాళ్లే.. నేడు ఆయనకు ఎందుకు దండలు వేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్టు, దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అతిథులు ఎన్టీఆర్ లలిత కళా అవార్డును పోసాని కృష్ణమురళికి ప్రదానం చేశారు. అనంతరం రామ్‌గోపాల్‌వర్మ మాట్లాడుతూ.. చంద్రబాబు ఎలాంటి వ్యక్తి అనేది స్వయంగా ఎన్టీఆరే చెప్పారన్నారు. రజనీకాంత్ లాంటి వ్యక్తి రాష్ట్రానికి వచ్చి ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన వాళ్లతో కూర్చున్నారంటే.. ఒకరకంగా ఆయన కూడా ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడుస్తున్నట్లేనన్నారు. నందమూరి కుటుంబంలో ఉన్న ఒకే ఒక్క మగాడు జూనియర్ ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. తాతకు వెన్నుపోటు పొడిచిన వారితో వేదిక పంచుకోవడం ఇష్టం లేకే.. ఆయన వీళ్లందరికీ దూరంగా ఉంటున్నారన్న విషయం స్పష్టమవుతోందన్నారు. తాను 'వ్యూహం' సినిమా తీస్తున్నానని, అందులో చంద్రబాబు క్యారెక్టర్‌ను అరటిపండులా వలిచి చూపిస్తానని ప్రకటించారు.

లక్ష్మీపార్వతిపై బాబు పుకార్లు..

ఏపీ ఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి మాట్లాడుతూ.. ఏ కులం, ఏ మతం వారితో అయినా స్నేహం చేయవచ్చు కానీ.. గుణం లేని వారితో మాత్రం చేయకూడదన్నారు. గుణం లేని వాడు చంద్రబాబు అని.. అతనికి దూరంగా ఉండటం చాలా మంచిదని సూచించారు. తన మంచిచెడులు చూసుకునేందుకు లక్ష్మీపార్వతిని ఎన్టీఆర్ ఆహ్వానించారని, కానీ ఆమెపైనా చంద్రబాబు అనేక పుకార్లు పుట్టించారని చెప్పారు. చంద్రబాబు వల్ల ఎన్టీఆర్‌కు మూడుసార్లు గుండెపోటు వచ్చినా.. లక్ష్మీపార్వతి ఒక్కరే అండగా నిలిచారని చెప్పారు. రాష్ట్రంలో మళ్లీ మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపిస్తేనే ఎన్టీఆర్ ఆత్మకు శాంతి కలుగుతుందన్నారు.

బాబు కుట్రలకు ఎన్టీఆర్ కుమిలిపోయారు

తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ.. అడ్డదారుల్లో అధికారాన్ని లాక్కునేందుకు చంద్రబాబు చేసిన కుట్రలపై ఎన్టీఆర్ ఎంతగానో కుమిలిపోయారని చెప్పారు. ఎన్టీఆర్‌ను అడుగడుగునా వేధింపులకు గురిచేశారని వివరించారు. ఎన్టీఆర్ కష్టకాలంలో దేవినేని నెహ్రూ అన్నీ తానై నిలిచారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ పేరుతో జిల్లా ఏర్పాటు చేసినందుకు సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. తన గౌరవాన్ని నిలబెట్టిన జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని చెప్పారు. మాజీ మంత్రి పేర్ని నాని మాట్లాడుతూ ఎన్టీఆర్ ప్రారంభించిన పథకాలు ఎప్పటికీ చిరస్మరణీయమేనని అన్నారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్టీఆర్ లాంటి గొప్ప మనిషి కూడా చంద్రబాబు కుట్రకు బలయ్యారన్నారు. దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టు కన్వీనర్, వైఎస్సార్‌సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి అవినాశ్ మాట్లాడుతూ ఎన్టీఆర్, వైఎస్సార్ ఒక కులానికో, పార్టీకో పరిమితం కాదన్నారు. ఈ సభలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు, నవరత్నాలు అమలు కమిటీ వైస్ చైర్మన్ నారాయణమూర్తి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్ పాల్గొన్నారు.

పొత్తులపై తుది నిర్ణయం అధిష్టానానిదే..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

సాక్షి, విశాఖపట్నం: బీజేపీ, జనసేన, తెలుగుదేశం పార్టీల పొత్తుపై పార్టీలో చర్చించడం తప్పులేదన్నది తన అభిప్రాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు చెప్పారు. తెలుగుదేశం పార్టీతో జనసేన పొత్తు కోరుకుంటోందన్నారు. ఆదివారం ఆయన విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఈ మూడు పార్టీలతో కలిసి వచ్చే ఎన్నికలకు వెళ్లాలన్న కోరికతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఉన్నారని, ఇదే విషయాన్ని తమ పార్టీ పెద్దలకూ చెప్పినట్టు తెలిపారు. పొత్తులపై బీజేపీ అధిష్టానమే తుది నిర్ణయం తీసుకుంటుందని, దానికి తామంతా కట్టుబడి ఉంటామని వీర్రాజు స్పష్టం చేశారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి వ్యవహారంలో సీబీఐ చట్ట ప్రకారం వ్యవహరిస్తోందన్నారు. కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో జరిపించలేదంటూ ప్రతిపక్షాలు రాద్ధాంతం చేయడంలో అర్థం లేదన్నారు. తెలంగాణ నూతన అసెంబ్లీ ప్రారంభోత్సవానికి ఆ రాష్ట్ర గవర్నర్‌ను ఆహ్వానించారా? అని సోము వీర్రాజు ప్రశ్నించారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌లది సూడో మనస్తత్వమని ఆరోపించారు.

పేదలందరినీ ధనికులుగా మారుస్తా

టీడీపీ తొలి విడత మేనిఫెస్టో విడుదల చేసిన చంద్రబాబు



గాలిదుమారంతో ఇబ్బంది పడుతున్న కార్యకర్తలు

సాక్షి, అమరావతి/ సాక్షి, రాజమహేంద్రవరం: రాష్ట్రంలో పేదలే లేకుండా చేస్తానని, అందరినీ ధనికులుగా మారుస్తానని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో ఆదివారం మహానాడులో ఆయన తొలి విడత ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేశారు. మహిళలు, యువకులు, రైతులను ఆకర్షించడమే లక్ష్యంగా అందులో ఆరు అంశాలను పొందుపరిచారు. అధికారంలోకి వస్తే మహాశక్తి, యువగళం, అన్నదాత, ఇంటింటికీ నీరు, బీసీలకు రక్షణ చట్టం, పూర్ టూ రిచ్ పేర్లతో ఆయా వర్గాలకు ప్రయోజనాలు కల్పిస్తామని చెప్పారు. మహానాడు ముగింపు సందర్భంగా రాజమండ్రిలో ఆదివారం జరిగిన బహిరంగ సభలో ఆయన ఈ మేనిఫెస్టో ప్రకటించారు. ప్రతి మహిళను మహాశక్తిగా తయారు చేస్తానంటూ ఆడబిడ్డ నిధి కింద ప్రతి నెలా 18–59 సంవత్సరాల లోపు వారికి రూ.1500 నేరుగా వారి అకౌంట్‌లో వేస్తామన్నారు. ఒక ఇంట్లో ఇద్దరు మహిళలుంటే ఇద్దరికీ ఇస్తామన్నారు. ఈ లెక్కన ఏటా రూ.18 వేలు, ఐదేళ్లలో రూ.90 వేలు ఇస్తామన్నారు. జగన్ అమలు చేసే అమ్మఒడి పథకం బూటకమని చెబుతూ.. తాను అదే తరహాలో తల్లికి వందనం పేరుతో సంవత్సరానికి ప్రతి బిడ్డకు రూ.15 వేలు ఇస్తానని తెలిపారు. ఒక ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి ఈ పథకం ఇస్తానని చెప్పారు. ఇద్దరి కంటె ఎక్కువ మంది పిల్లలున్నా మహిళలకు స్థానిక సంస్థల్లో పోటీ చేసే అవకాశం కల్పిస్తామని, గతంలో తాను పొరపాటున ఇద్దరు పిల్లల నిబంధన పెట్టానని చెప్పారు. ఇప్పుడు ఆ నిర్ణయాన్ని మార్చుకుంటున్నట్లు తెలిపారు. దీపం పథకం మాదిరిగా మహిళలకు సంవత్సరానికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తానన్నారు. ఆడ బిడ్డలకు ఆయా జిల్లాల్లో ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పిస్తామని చెప్పారు.

20 లక్షల ఉద్యోగాలు.. రూ.3 వేల నిరుద్యోగ భృతి

యువగళం విన్నామని, ఐదు సంవత్సరాల్లో 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని, ఉద్యోగాలు వచ్చే వరకు నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని తెలిపారు. ప్రతి రైతుకి ఇప్పుడు ఇచ్చేది కాకుండా సంవత్సరానికి రూ.20 వేలు ఇస్తామని చెప్పారు. అధికారంలోకి రాగానే ప్రతి ఇంటికీ మంచి నీరు ఇస్తామన్నారు. బీసీలకు రక్షణ కల్పించేందుకు ఒక చట్టాన్ని తీసుకువస్తామన్నారు. పూర్ టు రిచ్ పేరుతో పేదవారిని ధనికులుగా చేసి ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో పేదవాడు అనేవాడు లేకుండా చేస్తానని, ప్రతి పేదవాడినీ ధనికుడిగా చేసే బాధ్యత తనదేనన్నారు. ఇందుకోసం సమాజంలో పైకి వచ్చిన వారు ఒకరిద్దరు పేద వారిని ధనికులుగా చేసే బాధ్యత తీసుకోవాలన్నారు. పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్‌తో దీన్ని చేస్తామన్నారు. ఇంతవరకు ఎవరూ చూడని సమర్థవంతమైన పాలన అందిస్తానని హామీ ఇస్తున్నట్లు తెలిపారు. టీడీపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఈ పథకాల గురించి వివరించాలన్నారు. దసరా నాటికి పూర్తి స్థాయి మేనిఫెస్టో విడుదల చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో అసమర్థ పాలన సాగుతోందని చెప్పారు.

తడబడిన లోకేశ్.. సుత్తికొట్టిన బాలకృష్ణ

మహానాడు ముగింపు సభ మధ్యాహ్నం బదులు సాయంత్రం 6 గంటల తర్వాత మొదలైంది. దీంతో చాలా మంది సభ ప్రారంభం కాకముందే వెళ్లిపోయారు. టీడీపీ నేత పయ్యావుల కేశవ్ సభను నిర్వహించగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు అచ్చెన్నాయుడు, కాసాని జ్ఞానేశ్వర్ తదితరులు ప్రసంగించారు. లోకేశ్ తన ప్రసంగంలో పలుసార్లు తడబడగా, బాలకృష్ణ సుత్తి కొడుతూ కార్యకర్తలకు విసుగు తెప్పించారు.

మహానాడులో గాలి దుమారం

ఆదివారం సాయంత్రం ఉన్నట్టుండి ఒక్కసారిగా బలమైన ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో మహానాడులో దుమారం రేగింది. దీంతో సభా ప్రాంగణంలో టెంట్లు కూలిపోయాయి. ఫ్లెక్సీలు కిందపడిపోయాయి. కార్యకర్తలు పరుగులు తీశారు. దీంతో అక్కడ గందరగోళ వాతావరణం ఏర్పడింది. ఫ్లెక్సీలు కూలిపోవడంతో బాపట్లకు చెందిన మోషేష్, సత్యసాయి జిల్లాకు చెందిన నాగరాజు గాయపడ్డారు. ఇదిలా ఉండగా టీడీపీ నేత కళావెంకట్రావు మాట్లాడుతూ.. టీడీపీ కార్యాలయంలో ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని, కార్యకర్తలకు గౌరవం ఇవ్వడం లేదని మండిపడ్డారు. లోకేశ్ యువగళం పాదయాత్రను ఓ పద్ధతి ప్రకారం నడపాలన్నారు.

ఎన్‌టీఆర్‌కు చంద్రబాబు, బాలయ్య నివాళి

టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శత జయంతి సందర్భంగా రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్‌లోని ఆయన విగ్రహానికి ఆ పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదివారం పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు పలువురు నేతలు పాల్గొన్నారు.

మహానాడుకు వెళ్లే కారు బోల్తా.. 8 మందికి గాయాలు

ఉంగుటూరు: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ మహానాడుకు వెళుతున్న కారు ఆదివారం ఏలూరు జిల్లా బాదంపూడి వద్ద జాతీయరహదారిపై బోల్తా పడింది. మితిమీరిన వేగంతో వెళుతున్న కారు అదుపుతప్పి పల్టీలు కొడుతూ పొలాల్లోకి వెళ్లి పడిపోయింది. ఆ కారులో ప్రయాణిస్తున్న ఏలూరు జిల్లా దెందులూరుకు చెందిన టీడీపీ కార్యకర్తలు ఎనిమిదిమందికి గాయాలయ్యాయి. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. టి.మహేష్, ఎం.లక్ష్మణ్, పి.వినోద్‌కుమార్, కె.వినోద్‌కుమార్, ఎస్.రమేష్, ఎస్.సాయిరామ్, ఎన్.రాజేష్, ఎం.రాకేశ్ గాయపడ్డారు. గాయపడినవారిని ఉంగుటూరు 108 అంబులెన్సులో తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పోలీసులు.. సొంత భోజనాలు

- సొంతంగా వంట వండించుకుని మహానాడు విధుల నిర్వహణ
- తినేందుకే వచ్చారా అంటూ అప్పట్లో దూషించిన అచ్చెన్నాయుడు

సాక్షి, రాజమహేంద్రవరం/ ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరంలో నిర్వహించిన టీడీపీ మహానాడులో పోలీసుల తీరు ఆదర్శంగా నిలుస్తోంది. రెండు రోజుల పాటు నిర్వహించిన మహానాడుకు వివిధ స్థాయిల్లో 1,500 మంది పోలీసులు బందోబస్తు పర్యవేక్షించారు. గతంలో టీడీపీ నేతల దూషణలను దృష్టిలో పెట్టుకుని మహానాడులో వారు ఏర్పాటు చేసిన భోజనాల వైపు కన్నెత్తి చూడలేదు. కనీసం వాళ్ల మంచి నీళ్లు కూడా తీసుకోలేదు. మజ్జిగ అయినా తాగండని కొందరు కార్యకర్తలు సూచించగా, సున్నితంగా తిరస్కరించారు. మహానాడు విధుల్లో ఉన్న పోలీసుల భోజనాల కోసం ఆ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, సాయంత్రం భోజనాలు సమకూర్చారు. భీమవరం నుంచి ప్రత్యేకంగా వంట మేస్త్రీలను రప్పించి.. శాకాహార, మాంసాహార వంటలు వండించారు. వాటిని ప్యాకెట్లుగా చేసి బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులకు వాహనంలో తీసుకొచ్చి అందించారు. మజ్జిగ ప్యాకెట్లు కూడా ఇచ్చారు.

టీడీపీ నేతల వ్యాఖ్యలతో కలత

యువగళం పాదయాత్ర ప్రారంభమైనప్పుడు 500 మందితో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అప్పట్లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు పోలీసులను టార్గెట్ చేస్తూ 'పోలీసులు ఎందుకొచ్చారు? ...తినేందుకా?' అని పత్రికల్లో రాయలేని అసభ్య పదాలతో విరుచుకుపడ్డారు. దీనిపై అప్పటి నుంచీ పోలీసుల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది. అంతటితో ఆగకుండా చంద్రబాబు సహా టీడీపీ నేతలు ఎక్కడపడితే అక్కడ పోలీసులపై నోరు పారేసుకుంటూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసుల ఆత్మాభిమానం దెబ్బతింది. దీంతో తమ శాఖ ఉన్నతాధికారుల ద్వారా భోజనాలు సమకూర్చుకుంటూ విధులు నిర్వర్తిస్తున్నారు.

బాబుకు మేనిఫెస్టో అంటే చిత్తుకాగితం

- బాబుకు మేనిఫెస్టో అంటే చిత్తుకాగితం
- విడతల వారీగా విడుదల చేయడానికి అది సినిమా కాదు
- గతిలేకే ఎన్టీఆర్ జపం
- డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, మంత్రులు రజిని, మేరుగు, ఎమ్మెల్యే కొడాలి ఫైర్

చిలకలూరిపేట/తాడేపల్లిగూడెం రూరల్/గుడివాడ టౌన్/సింహాచలం: మేనిఫెస్టో అంటే సినిమా కాదని.. దానిని విడతల వారీగా విడుదల చేస్తానని చంద్రబాబునాయుడు చెప్పడం ఏమిటోనని వైఎస్సార్‌సీపీ నేతలు ఎద్దేవా చేశారు. అసలు చంద్రబాబుకు మేనిఫెస్టో అంటే చిత్తు కాగితంతో సమానమని వారన్నారు. ముసలి బ్యాచ్ ఒకరినొకరు పలకరించుకోడానికే మహానాడు పెట్టారని వ్యాఖ్యానించారు. చంద్రబాబు వంటి దుర్మార్గుడిని సమూలంగా రాజకీయాలకు దూరంగా ఉంచేలా ప్రజలు నిర్ణయం తీసుకోవాలని కోరారు. మహానాడు నేపథ్యంలో ఆదివారం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రులు విడదల రజిని, మేరుగు నాగార్జున, మాజీమంత్రి, ఎమ్మెల్యే కొడాలి నాని వేర్వేరుచోట్ల టీడీపీపై విమర్శలు గుప్పించారు. వారేమన్నారంటే..

మేనిఫెస్టోపై బాబు మాట్లాడడం సిగ్గుచేటు: మంత్రి రజిని



మేనిఫెస్టో గురించి చంద్రబాబు మాట్లాడం సిగ్గుచేటు. తొలి విడత అంటూ దానిని విడుదల చేయడం ఏంటో ఎవరికీ అర్థంకాని విషయం. మేనిఫెస్టో అంటే ఏ పార్టీకి అయినా పవిత్రమైనదిగా భావించాలి. మా నాయకుడు జగనన్న మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావిస్తారు. ఇచ్చిన హామీల్లో 98 శాతానికి పైగా నెరవేర్చి ప్రజల బతుకుల్లో జగనన్న వెలుగులు నింపారు. కానీ, చంద్రబాబు 2014లో 600కు పైగా హామీలిచ్చి ఒక్కటి కూడా నెరవేర్చలేదు. పైగా దానిని ఎవరికీ కనపడకుండా చేశారు. మేనిఫెస్టో అంటే ఆయనకు చిత్తు కాగితంతో సమానం. ఇక మహానాడు వేదికగా చంద్రబాబునాయుడు డిక్షనరీలో లేని సంక్షేమం, అభివృద్ధి, పేదలు అంటూ కొత్త రాగం అందుకున్నారు. నిజానికి.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిట్టడానికే మహానాడును పెట్టినట్లుగా ఉంది. సైకిల్ ముందుచక్రం సంక్షేమానికి, వెనక చక్రం అభివృద్ధికి నిదర్శనమని బాబు ప్రకటించటం హాస్యాస్పదం. వాస్తవానికి సైకిల్ ముందు చక్రం దోచుకోవటానికి, వెనుక చక్రం దాచుకోవటానికి నిదర్శనం.


బాబువి తప్పుడు రాజకీయాలు: డిప్యూటీ సీఎం కొట్టు



చంద్రబాబు ఎక్కడో హైదరాబాద్‌లో ఉండి చుట్టం చూపుగా రాష్ట్రానికి వచ్చి ఇక్కడ తప్పుడు రాజకీయాలు చేస్తున్నాడు. పిల్లనిచ్చిన సొంత మామకు వెన్నుపోటు పొడిచాడు. అటువంటి దుర్మార్గుడు ప్రజల సంతోషాన్ని నాశనం చేసేందుకు మళ్లీ ఎన్టీఆర్ బొమ్మతో ముందుకొస్తున్నాడు. ఈయనకు పవన్ తోడవుతున్నాడు. పవన్‌ను నమ్మి గ్రామాల్లో జనసేన కార్యకర్తలు సొంత డబ్బులు ఖర్చుపెడుతుంటే పవన్ మాత్రం తన సొంత సామాజిక వర్గాన్ని చంద్రబాబుకు తాకట్టు పెట్టేస్తున్నాడు. తనకు సీఎం అయ్యే పరిస్థితిలేదని తెలిసి.. చంద్రబాబు సీఎం అయితే ఆయన నీడలో బతికేయవచ్చని పవన్ తప్పుడు ఆలోచన చేస్తున్నాడు. జగన్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉంటే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఓర్వలేకపోతున్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో మారీచులు వస్తారు.. వారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

బాబు దళిత వ్యతిరేకి: మంత్రి మేరుగు

చంద్రబాబు దళిత వ్యతిరేకి. ఆయనకు ఎస్సీలంటే చులకన. ఎస్సీ కులంలో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని ఆయన చేసిన వ్యాఖ్యలు అంబేడ్కర్‌ని



అగౌరవపరిచినట్లే. ఆనాడు ఆయన చేసిన వ్యాఖ్యలు తప్పని చంద్రబాబు ఇప్పటికీ అంబేడ్కర్ విగ్రహం పాదాల చెంతకు వచ్చి చెప్పలేదు. అది ఆయనలోని అహంకారానికి నిదర్శనం. అసలు అంబేడ్కర్ ఆలోచన విధానానికి ఆయన పూర్తి వ్యతిరేకం. కానీ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన అంబేడ్కర్ భావజాలంతో ముడిపడి ఉంది. టీడీపీ హయాంలో దళితులపై దాడులు జరిగితే చంద్రబాబు ఏనాడు పట్టించుకోలేదు. దళిత మహిళలను అగౌరవపరిచినా కూడా స్పందించలేని పరిస్థితి. దళిత భూములను లాక్కున్నారని ప్రశ్నిస్తే స్వయంగా నన్నే అరెస్టుచేశారు. అదే జగనన్న పాలనలో దళితులకు ఎంతో మేలు జరిగింది.

టీడీపీ నేతలు స్క్రాప్ బ్యాచ్: కొడాలి నాని



టీడీపీ నేతలందరూ కలిసి రాజమండ్రిలో మహానాడు సభ పెట్టారు. దాని వల్ల తెలుగుదేశానికి వచ్చే లాభం ఏమీ ఉండదు. వారంతా స్క్రాప్ బ్యాచ్. ప్రస్తుతం ఎన్టీఆర్ పేరుతో ప్రజలకు వెన్నుపోటు పొడవడానికి చంద్రబాబు ఈ కార్యక్రమం ద్వారా సిద్ధమవుతున్నాడు. గతంలో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉంటే పార్టీ, రాష్ట్రం నాశనం అవుతుందని చెప్పిన చంద్రబాబు నేడు తిరిగి ఆ మహానాయకుని పేరు వాడుకుంటున్నారు. 1999 ఎన్నికల్లో వాజ్‌పేయిని అడ్డుపెట్టుకుని గెలిచిన చంద్రబాబు ఆ తర్వాత ఆయన పేరును ఎక్కడా కనబడనివ్వలేదు. నాలాంటి అభిమానులు ఎన్టీఆర్ ఫొటో పెట్టుకుంటే బెదిరించిన పరిస్థితులున్నాయి. ఇప్పుడు గతిలేక రాజకీయంగా బతకడానికి తిరిగి ఎన్టీఆర్‌ను ఈ 420 చంద్రబాబు వాడుకొంటున్నాడు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఆయన్ను చెప్పుదెబ్బలు కొడతారు. చంద్రబాబు, లోకేశ్‌కు దమ్ముంటే గుడివాడ, గన్నవరంలో పోటీ చేయాలి.

అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశావ్?

- ఎన్నికల హామీల్లో ఒక్కటైనా అమలుచేసిన చరిత్ర నీకుందా చంద్రబాబూ?
- తెలుగుదేశానికి ఇదే చివరి మహానాడు..
- టీడీపీ అధినేత చంద్రబాబుపై మంత్రి అంబటి ఫైర్

సాక్షి, అమరావతి: అమరావతి ప్రాంతంలో సీఎం వైఎస్ జగన్ పేదలకు ఒక సెంటు భూమి చొప్పున ఇస్తుంటే కడుపుమంటతో రగిలిపోయిన నువ్వు పేదలను ధనవంతులుగా చేస్తావా? అంటూ టీడీపీ అధినేత చంద్రబాబుపై జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విరుచుకుపడ్డారు. సీఎంగా పనిచేసిన 14 ఏళ్లలో ఒక్క పేదనైనా ధనవంతుడిగా చేశావా? అని ప్రశ్నించారు. ప్రజాధనాన్ని దోచేసి.. ఈనాడు రామోజీ, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ, టీవీ5 నాయుడు, సుజనాచౌదరి వంటి పేదలను ధనవంతుల్ని చేయడం కోసం పరిపాలన చేసిన చరిత్ర నీదేనంటూ చంద్రబాబుపై మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం అంబటి మీడియాతో మాట్లాడుతూ అమరావతిలో ఒక సెంటు చొప్పున భూమిని పేదలకు ఇచ్చేందుకు సీఎం జగన్ సిద్ధమైతే.. దాన్ని హైకోర్టు, సుప్రీంకోర్టులో సవాల్ చేయడం ద్వారా చంద్రబాబు అడ్డుకునేయత్నం చేశారన్నారు. దీనిపై సుప్రీంకోర్టు మొట్టికాయలు వేస్తే ప్రభుత్వంపై ఎల్లో మీడియాలో దుష్ప్రచారం చేయించడం ద్వారా పేదలపై చంద్రబాబు కక్ష తీర్చుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అంబటి ఇంకా ఏమన్నారంటే..

ఎన్టీఆర్‌కు 'భారతరత్న' అరిగిపోయిన రికార్డు..

శతజయంతి సందర్భంగా ఎన్టీఆర్‌ను చంద్రబాబు ఓట్ల కోసమే పొగుడుతున్నారు. ఎన్టీఆర్‌కు 'భారతరత్న' ఇవ్వాలని అరిగిపోయిన రికార్డునే విన్పించారు. అధికారంలో ఉన్నప్పుడు కేంద్రంలో చక్రం తిప్పానని చెప్పుకునే నువ్వు.. ఎన్టీఆర్‌కు 'భారతరత్న' ఎందుకు తీసుకురాలేకపోయారని శతజయంతి సందర్భంగా ప్రజానటుడు ఆర్.నారాయణమూర్తి వేదికపై నుంచి నిన్ను నిలదీస్తే నీకు సిగ్గేయలేదా? నువ్వు సిగ్గుతో తలదించుకోలేదా చంద్రబాబూ? ఇక ఎన్టీఆర్ జన్మించి నూరేళ్లు పూర్తయ్యాయి. నీ చేతుల మీదుగా.. నీ కొడుకు లోకేశ్ చేతుల మీదుగా రాజమండ్రిలో నిర్వహించిన మహానాడే చివరిది. నీ దుర్మార్గపు పాలనను 2019లో ప్రజలు అంతం చేశారు. మళ్లీ జనం నిన్ను తీసుకురారు. తుప్పుపట్టిన సైకిల్‌ను నువ్వూ, నీ అబ్బాయి తొక్కలేరు. అందుకే దత్తపుత్రుడ్ని తెచ్చుకున్నావు.

నువ్వు తెచ్చుకున్న జనమే నీ హామీలను నమ్మలేదు..


- మహానాడులో హామీలను ప్రకటిస్తూ మాటమాటకీ తమ్ముళ్లూ.. నా మాటను నమ్మారా? అంటూ అడిగావు. అంటే.. నువ్వు తీసుకొచ్చిన కార్యకర్తలే నీ మాట నమ్మరనే అనుమానం నీది చంద్రబాబూ.
- ప్రతి తల్లికి రూ.15 వేలు, రైతులకు ఏడాదికి రూ.20వేలు.. నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తానని చంద్రబాబు హామీలు ఇచ్చాడు. అసలు నీ 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో.. నువ్వు ఎనాడైనా నీ హామీల్లో ఒక్కటైనా అమలుచేశావా?
- 2014 ఎన్నికల్లో రైతుల రుణాలను పూర్తిగా మాఫీ చేస్తానని హామీ ఇచ్చావు. అరకొకరగా మాఫీచేసి రైతులను మోసం చేశావు. ఇదేం న్యాయమని మీడియా అడిగితే దబాయించలేదా చంద్రబాబూ?
- 2014 ఎన్నికల్లో నిరుద్యోగ భృతికింద నెలకు రూ.రెండు వేల చొప్పున ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. కానీ, ఇవ్వకుండా యువతను మోసం చేశాడు.
- మేనిఫెస్టో ప్రకటించడం పూర్తయ్యాక చంద్రబాబు టోపీ పెట్టుకున్నాడు. అంటే.. హామీలు అమలుచేయకుండా ప్రజల నెత్తిన టోపీ పెడతానని తన నైజాన్ని చెప్పకనే చంద్రబాబు చాటిచెప్పుకున్నారు.
- ఎన్నికల మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా సీఎం జగన్ భావించి అమలు చేస్తున్నారు. ఇప్పటికే 98.5 శాతం హామీలను అమలుచేశారు. విశ్వసనీయతకు జగన్ ప్రతీకతే.. ప్రజలను మోసంచేసే చంద్రబాబు ఓ 420, ఓ చీటర్.

పెత్తందార్లపై గెలిచేది పేదలే..

- ఆయుధాలు ఇచ్చాను.. కురుక్షేత్రంలోకి వెళ్లండని టీడీపీ నేతలు, కార్యకర్తలకు చంద్రబాబు పిలుపునిచ్చారు. కానీ, చంద్రబాబూ.. యుద్ధానికి నువ్వొక్కడే వస్తావా.. ఇంకెవరినైనా తోడు తెచ్చుకుంటావా? ఈ పోరాటంలో పేదవాళ్ల పక్షాన నిలబడిన సీఎం వైఎస్ జగన్‌దే విజయం.
- పోయిన అధికారాన్ని తెచ్చుకోవాలనే ప్రయత్నం.. ప్రజలను మోసం చేయాలనే ప్రయత్నంతో సీఎం జగన్‌పై కల్లుతాగిన కోతుల్లా చంద్రబాబు, టీడీపీ నేతలు విరుచుకుపడటం హేయం. క్యాస్ట్ పేరు చెబితే చెప్పు తీసుకుని కొట్టాలని చంద్రబాబు అన్నారు. అలా కొట్టాల్సి వస్తే మొదట నిన్ను, నీ కొడుకునే కొట్టాలి చంద్రబాబు. మా రక్తాన్ని కూడా ఇంకొక కులానికి ఇవ్వొద్దని మదమెక్కి మాట్లాడింది మీరు కాదా చంద్రబాబూ?.

చంద్రబాబుకే సంక్షోభం: కొమ్మూరి

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సంక్షేమంతో పురోగమిస్తోందని, ప్రస్తుతం రాజకీయ సంక్షోభంలో ఉన్నది మాత్రం చంద్రబాబేనని ఏపీ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకరావు స్పష్టం చేశారు. ఎస్సీ సంక్షేమంపై టీడీపీ మహానాడులో నక్కా ఆనందబాబు ప్రవేశపెట్టిన అబద్ధాల తీర్మానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఆయన ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



ఎవరినీ ఎప్పుడూ నిరుత్సాహ పరచవద్దు. ఎవరు ఎంత నిదానంగా ఉన్నా, వారిలో నిరంతర పురోగతి ఉండనే ఉంటుంది.

– ప్లేటో

సాక్షి

సోమవారం, 29 మే 2023

రాజదండం - రాజ్యాంగ దండం

నిప్పు కాలుతుంది, అయినా నిప్పు లేనిదే రోజు గడవదు. కాలకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే నిప్పును వాడుకోవాలి. అధికారం కూడా అంతే; అధికారం చెడగొడుతుందనీ, సంపూర్ణ అధికారం సంపూర్ణంగా చెడగొడుతుందనీ ఒక ఆంగ్ల మేధావి సెలవిచ్చాడు. లోకవ్యవహారం సజావుగా సాగాలంటే అందుకు అవసరమైన అధికారాన్ని ఒక వ్యక్తి చేతిలోనో, వ్యవస్థ చేతిలోనో పెట్టక తప్పదు. మళ్ళీ అది చెడుదారి పట్టకుండా అవసరమైనప్పుడు కళ్లేలు బిగించకా తప్పదు. ఒక తెగకు లేదా ఒక ప్రాంతానికి చెందిన జనం సమష్టి ప్రయోజనాల కోసం ఎప్పుడైతే గుంపు కట్టారో అప్పుడే అధికార– నియంత్రణల రెండింటి అవసరాన్నీ గుర్తించారు. ఆ క్రమంలో ఎన్నో ప్రయోగాలు జరిగాయి, ఇంకా జరుగుతూనే ఉన్నాయి. ఒక కోణంలో చూస్తే మానవచరిత్ర అంతా అధికారమూ, దాని నియంత్రణల మధ్య ఎడతెగని పెనుగులాటే!

ఈ పెనుగులాట రూపురేఖలు మన పురాణ ఇతిహాసాలలోనూ కనిపిస్తాయి. దశరథుడు అవడానికి రాజే కానీ పెద్దకొడుకైన రాముడికి పట్టాభిషేకం చేసే స్వతంత్రాధికారం మాత్రం ఆయనకు లేదు. పౌరజానపద పరిషత్తును సమావేశపరచి అనుమతి కోరాడు. ఆ పౌర జానపదులలో తరుజనులు, గిరిజనులూ కూడా ఉన్నారని రామాయణం చెబుతోంది. దశరథుడికి పౌరజానపదుల ఆమోదం సునాయాసంగా లభించింది కానీ; మహాభారత ప్రసిద్ధుడైన యయాతికి మాత్రం అంత సులువుగా లభించలేదు. తన చిన్న కొడుకైన పూరునికి రాజ్యం అప్పగించాలన్న తన ప్రతిపాదనను అతడు పౌరజానపదుల ముందు ఉంచినప్పుడు, పెద్దకొడుకైన యదువు ఉండగా చిన్నకొడుకును ఎలా రాజును చేస్తావని వారు ప్రశ్నించారు. యయాతి వారిని ఎలాగో ఒప్పించి తన నిర్ణయాన్ని అమలు చేశాడు. ప్రజామోదంతో రాజైన వ్యక్తి ఆ తర్వాత సర్వస్వతంత్రుడై విర్రవీగినప్పుడు అతణ్ణి తొలగించిన ఉదాహరణలూ ఉన్నాయి. మహాభారతంలోని పురూరవుడు, నహుషుడు ఆ కోవలోకి వస్తారు.

రాజు ధర్మతత్పరతను ఉగ్గడించే కథలు; ధర్మం తప్పిన రాజూ, అతని రాజ్యమూ కూడా భస్మీపటలమైన కథలూ చరిత్రకాలంలోనూ కనిపిస్తాయి. బెజవాడ రాజధానిగా ఏలిన విష్ణుకుండిన రాజు మాధవవర్మ, తన కొడుకు ప్రయాణించే రథం కింద పడి ఒక పౌరుడు మరణించినప్పుడు కొడుకని చూడకుండా మరణశిక్ష అమలు చేస్తాడు. 'శిలప్పదికారం' అనే ప్రసిద్ధ తమిళ కావ్యంలో నాయిక కణ్ణగి తన భర్త కోవలన్ కు పాండ్యరాజు ఒకడు అన్యాయంగా మరణశిక్ష అమలు చేసినప్పుడు ఆగ్రహించి అతని రాజ్యాన్ని బూడిదకుప్ప కమ్మని శపిస్తుంది. శిక్షించే అధికారంతో పాటు తప్పొప్పులను నిర్ణయించే అధికారాన్ని కూడా రాజు గుప్పిట పెట్టుకున్న దశను ఈ కథ సూచిస్తుంది.

రాజూ, రాజ్యాధికారమూ, ధర్మబద్ధత, దండనీతి గురించిన భావనలు ఏ ఒక్క దేశానికో పరిమితమైనవి కావు; సార్వత్రికమైనవీ, అత్యంత ప్రాచీనమైనవీ కూడా! ఆధునిక భాషాశాస్త్ర నిర్ధారణలనే ప్రామాణికంగా తీసుకుంటే, ప్రోటో–ఇండో–యూరోపియన్ మూలరూపమైన 'రెగ్' అనే మాటే సంస్కృతంలో రాజశబ్దంగానూ, ఇతర ఇండో–యూరోపియన్ భాషల్లో దానికి దగ్గరగా ధ్వనించే 'రెక్స్' (లాటిన్) వంటి శబ్దాలుగానూ మారింది. 'సరళరేఖలా తిన్నగా నడిచేది, నడిపించే' దనే అర్థం కలిగిన 'రెగ్' అనే మాట నుంచే నేటి రెగ్యులేషన్, రెగ్యులర్, రైట్, రీజన్, రెజీమ్ మొదలైన మాటలు వచ్చాయని భాషావేత్తలు అంటారు. రాజశబ్దం ఎంత ప్రాచీనమో, కొద్దిరోజులుగా ప్రచారంలో ఉన్న రాజదండం కూడా అంతే ప్రాచీనమూ, సార్వత్రికమూ కూడా!

మన పురాణ, ఇతిహాసాలలో రాచరికానికీ, రాజుల నియామకానికీ ఇంద్రుడు బాధ్యుడిగా కనిపిస్తాడు. చేది దేశాన్ని పాలించే వసురాజు విరక్తుడై అడవిలో తపస్సు చేసుకుంటున్నప్పుడు ఇంద్రుడు అతణ్ణి తిరిగి రాజ్యపాలనకు ప్రోత్సహించి ఇతర రాజోచిత పురస్కారాలతోపాటు, ఒక రాజదండాన్నీ చేతికిచ్చాడని మహాభారతం చెబుతోంది. ఇలాగే ఇంద్రుడు రాజ్యపాలనకు ప్రోత్సహించిన మరో రాజు – మాంధాత. ధర్మరక్షణను రాజుకు నిత్యం గుర్తు చేస్తూ ఉంటుంది కనుక రాజదండాన్ని ధర్మదండంగా కూడా అన్వయించారు. పట్టాభిషేక సమయంలో రాజుకీ, గురువుకీ మధ్య నడిచే ఒక సంభాషణ ప్రకారం, 'నన్ను ఎవరూ శిక్షించలే'రని రాజు అంటాడు; అప్పుడు, 'ధర్మం నిన్ను శిక్షిస్తుంది' అంటూ గురువు మూడుసార్లు ధర్మదండంతో అతని శిరసు మీద కొడతాడు.

ఈ రాజదండం ఆనవాయితీ రోమన్లకూ సంక్రమించింది. వారిలో మొదట్లో వ్యక్తికేంద్రిత పాలన కాక, పౌరకేంద్రిత పాలన– అంటే గణతంత్ర వ్యవస్థ ఉండేది. రాచరికాన్నీ, రాజు అనే మాటనూ కూడా వారు ఏవగించుకునేవారు. ఒక దశలో రోమ్ సైనిక నియంతగా ఉన్న జూలియస్ సీజర్ ఈజిప్టు రాణి క్లియోపాత్రా ప్రేమలో పడిన తర్వాత, అక్కడున్న వ్యవస్థ ప్రభావంతో సింహాసనాన్నీ, రాజదండాన్నీ స్వీకరించాడు. అదే చివరికి అతని హత్యకు దారితీసింది.

అధికారమంతా రాజు దగ్గరే పోగుబడే ప్రమాదం తలెత్తినప్పుడు అతణ్ణి అదుపు చేసే సంకేత పాత్రను రాజదండం నిర్వహించి ఉండవచ్చు. ఆధునిక ప్రజాస్వామ్యంలో అధికార వికేంద్రీకరణ ద్వారా ఆ ప్రమాదాన్ని అరికట్టేందుకు ఆయా వ్యవస్థలు ఏర్పడ్డాయి. ఏ వ్యవస్థ ఏ హద్దుల్లో ఉండాలో చెప్పే రాజ్యాంగమూ వచ్చింది. అదే నేటి అసలు సిసలు రాజదండం!

దేశానికి అవసరమైన విజయం!

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

కీలకమైన ఎన్నికల్లో విజయం సాధించి కర్ణాటక ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య రెండోసారి ఎన్నికవడం శుభవార్త అనే చెప్పాలి. ప్రజా సంక్షేమ రాజకీయాలకూ, మత రాజకీయాలకూ మధ్య జరిగిన ఎన్నిక ఇది. క్షేత్రస్థాయిలో ఉన్న ప్రజాదరణ, స్థిరమైన లౌకిక ప్రజాస్వామ్య వ్యూహాలు సిద్ధరామయ్యను నిజమైన మాస్ లీడర్‌గా మార్చాయి. దేశం మతతత్వం నుండి ప్రజాస్వామ్య సంక్షేమం వైపు మళ్లాల్సిన అవసరం ఉన్నందున, కర్ణాటక ఎన్నికలు దేశానికి చాలా ముఖ్యమైనవి. మహాత్మా ఫూలే, బి.ఆర్. అంబేడ్కర్, పెరియార్‌లు రాజకీయాలలో మతం ప్రమేయం లేకుండా సానుకూల ప్రజాస్వామ్యాన్ని కోరుకున్నారు. సిద్ధరామయ్య మతపరమైన భావజాలానికి చోటివ్వకుండా లౌకికవాద భావజాలానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర వల్లే కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిందన్న కథనం ఢిల్లీ నుంచి వినిపిస్తోంది. ఇది ఒక పాత్ర పోషించిందనడంలో సందేహం లేదు. కానీ రాష్ట్ర స్థాయిలో ఒక బలమైన మాస్ లీడర్ లేకుండా ఏ జాతీయ పార్టీ కూడా రాష్ట్ర ఎన్నికల్లో గెలవలేదు. శూద్ర ఓబీసీల కోసం నిబద్ధత కలిగి, మంచి పరిపాలనాదక్షుడిగా, చిల్లర అవినీతి రాజకీయాలకు అతీతంగా తనను తాను నిరూపించుకున్న సిద్ధరామయ్య లాంటి బలమైన లీడర్ లేకుండా కాంగ్రెస్ గెలవలేక పోయేది. అవినీతికి వ్యతిరేకంగా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతున్నప్పటికీ, ఆయన పార్టీకి చెందిన కర్ణాటక నేతలు మాత్రం ఆయన మాట తప్పని నిరూపించారు. కేపీసీసీ అధ్యక్షుడిగా డీకే శివకుమార్ కాంగ్రెస్ గెలుపులో మంచి పాత్ర పోషించినప్పటికీ, సిద్ధరామయ్యకు ఉన్న ప్రజాపునాది, క్లీన్ ఇమేజ్ ఆయనకు లేదు.

కర్ణాటక ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య రెండోసారి ఎన్నికవడం యావత్ భారతదేశానికి శుభవార్త అనే చెప్పాలి. అయినప్పటికీ, ఆయన రెండవ టర్మ్... మోసపూరిత బీజేపీని అదుపులో ఉంచడం, శివ కుమార్ తక్కువ స్థాయి ఆకాంక్షలను నియంత్రించడంతోపాటు మోదీని ఓడించిన ప్రజలను మాత్రమే కాకుండా స్థానిక నాయకులను సంతృప్తిపరిచేలా పరిపాలనను నడపడం వంటి సవాళ్లను కలిగి ఉంది.

ఇది ఆర్ఎస్ఎస్ తదుపరి సర్‌సంచాలక్ దత్తాత్రేయ హొసబలే సొంత రాష్ట్రం. బహుశా ఈయన కూడా ఢిల్లీలోని మొత్తం బలాన్ని ఉపయోగించి, అన్ని విధాలుగా రాష్ట్రంలో అధికారాన్ని నిలుపుకోవాలనుకున్నారు. హొసబలే బ్రాహ్మణ నాయకుడు. అంతేకాకుండా మోదీకి బలమైన మద్దతుదారు. 2013లో మోదీని ప్రధాని అభ్యర్థిగా తీసుకురావడానికి హొసబలే కారణమని చెబుతున్నారు. అందుకే మోదీ ఓబీసీ కార్డ్‌ని, మతతత్వాన్ని ఉపయోగించి కర్ణాటకను గెలవడానికి తన ప్రభుత్వ బలాన్ని, తన సమయాన్ని, తన శక్తిని ఉపయోగించినట్లనిపించింది.

ప్రతి గ్రామ వ్యవసాయ సమాజాన్నీ, చేతివృత్తుల సంఘాన్నీ కలిసిన సిద్ధరామయ్య... మోదీ కంటే భిన్నమైన ఓబీసీ నాయకుడని తెలియజేస్తోంది. సిద్ధరామయ్య 75వ జన్మదినోత్సవానికి 16 లక్షల మంది హాజరైనట్లు 'వికీపీడియా' రాసింది. ''సిద్ధరామయ్య తన 75వ పుట్టినరోజును 2022 ఆగస్టు 3న దావణగెరెలో జరుపుకొన్నారు. జనం దాన్ని సిద్ధరామోత్సవ అని పిలిచారు. సిద్ధరామయ్య అనుయాయులైన 16 లక్షల మంది ఆనాటి కార్యక్రమానికి హాజరయ్యారు''. రాహుల్ గాంధీ కూడా హాజరైన ఈ జన్మదిన వేడుకల్లో, పైన చెప్పిన సంఖ్యలో సగం మంది హాజరైనా కూడా, లక్షలాది మంది జనం ఒక నాయకుడి చుట్టూ గుమికూడటం భారతీయ చరిత్రలోనే అపూర్వం.



ఆయన పెద్ద లేదా చిన్న పట్టణ వ్యాపార నేపథ్యం నుండి కానీ, కొత్తగా చేర్చబడిన ఓబీసీ నేపథ్యం నుండి కానీ రాజకీయ అధికారానికి రాలేదు. ఆయన ఋుగ్వేదం రాసిన రోజుల నుండి విద్య, ప్రభుత్వోద్యోగం, మానవ గౌరవ హక్కుల నిరాకరణకు గురైన చారిత్రక శూద్ర గొర్రెల కాపరి కుటుంబానికి చెందిన ఓబీసీ. ఢిల్లీలో అధికారాన్ని ఓబీసీ ఓటు నిర్ణయిస్తుందని గ్రహించిన ఆరెస్సెస్–బీజేపీ శక్తులు, చాలా మంది శూద్రేతర నాయకులను ఓబీసీలుగా ప్రచారం చేస్తున్నాయి. మండల్ రిజర్వేషన్‌ను వ్యతిరేకించిన తర్వాత ఓబీసీ ఓట్లు లేకుండా ఢిల్లీని చేజిక్కించుకోలేమని వారు గ్రహించడమే దీనికి కారణం. మోదీ, సుశీల్ మోదీ తరహాలో ఇప్పుడు ఓబీసీ కార్డు వాడుతున్న బీజేపీ నాయకులు ఆనాడు మండల్ రిజర్వేషన్‌ను వ్యతిరేకిస్తూ మిలిటెంట్ కమండల్ ఉద్యమ నాయకులుగా పనిచేశారు.

సిద్ధరామయ్య బలమైన మండల్ ఉద్యమ నాయకుడు. గొర్రెల కాపరి కుటుంబం నుండి వచ్చి, బీఎస్సీ, ఎల్ఎల్‌బీ డిగ్రీలు పొందారు. ఆ రోజుల్లో ఇది ఒక కురుబ బాలుడు ఊహించనిది. ఎల్ఎల్‌బి పూర్తి చేసిన తర్వాత మైసూర్ ప్రాంతంలో సామాజిక కార్యకర్తగా పని చేస్తున్నప్పుడు లా ప్రాక్టీస్‌లోకి ప్రవేశించారు. ఈ అసాధారణ యువ కురుబ న్యాయవాది 1980వ దశకం ప్రారంభంలో రైతు ఉద్యమంలో సుప్రసిద్ధ నాయకుడైన ఎం.డీ. నంజుండస్వామి దృష్టిని ఆకర్షించారు. ఆయనే సిద్ధరామయ్యను రాజ్య రైతు సంఘం ప్రతినిధిగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయించారు. అలా 1983లో గెలిచి అసెంబ్లీకి వెళ్ళారు. తరువాత జనతా పార్టీలో చేరారు. వరుసగా ఎన్నికల్లో గెలుస్తూ మంత్రి కాగలిగారు.

దేవెగౌడ పదవీ విరమణ చేసిన తర్వాత తాను ముఖ్యమంత్రి కావాలనే ఆశతో, పేదల అనుకూలత, నిబద్ధత కలిగిన ఓబీసీ, ఎస్సీ, ఆదివాసీ ప్రతినిధిగా జేడీ (యూ)లో చేరారు. ఆయన మంత్రివర్గంలో డిప్యూటీ సీఎంగా పనిచేశారు. కానీ సిద్ధరామయ్యను పట్టించుకోకుండా దేవెగౌడ తన కుమారుడిని ముఖ్యమంత్రిని చేశారు. దేవెగౌడ సంప్రదాయవాద అర్ధ–హిందుత్వ నాయకుడు. కాగా, సిద్ధరామయ్య శూద్ర ఆధ్యాత్మిక భావజాలం కలిగిన హేతువాది.

ఆ తర్వాత జేడీ (యూ)ను విడిచిపెట్టి 'అహిందా' పార్టీని స్థాపించారు. అంటే 'అల్పసంఖ్యాక, హిందూళిద, దళిత' అని! హిందూళిద అంటే కన్నడంలో వెనుకబడినది అని అర్థం. వాస్తవానికి ప్రధాన స్రవంతి మీడియా సిద్ధరామయ్య నాటి దశను ఆయన రాజకీయ జీవితానికి ముగింపుగా చూసింది. మాస్ లీడర్ లేని సమయంలో ఆయన కాంగ్రెస్ లోకి వచ్చారు. ఓబీసీ ఎజెండా, లౌకికవాదం, హేతువాదంపై తనకున్న బలమైన నిబద్ధతను వదలకుండా కాంగ్రెస్‌లోకి ప్రవేశించారు. ఢిల్లీలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన చేసిన అన్ని ప్రకటనల్లో కుల వ్యతిరేకత, సెక్యులరిజం, హేతువాదం పట్ల ఆయన నిబద్ధతను చూడవచ్చు. ఎల్లప్పుడూ తన మణికట్టుకు కాషాయ దారాలను ధరించే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డీకే శివ కుమార్ శైలితో దీన్ని పోల్చి చూడవచ్చు. కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ విచిత్రంగా దేవాలయాలకు వెళ్తూ శివుడు (రాహుల్), హనుమంతుడి (ప్రియాంక) పూజలు చేస్తున్నారు. కానీ సిద్ధరామయ్య అలా చేయలేదు. తన ఆధ్యాత్మిక నాయకుల సంప్రదాయంగా బసవ, అక్క మహాదేవిలను ఉదాహరిస్తారు. దేవాలయాల చుట్టూ తిరగరు.

సిద్ధరామయ్య, పినరయి విజయన్, ఎం.కె.స్టాలిన్, కె.చంద్రశేఖరరావు, జగన్‌మోహన్ రెడ్డి– దక్షిణాదిలోని ముఖ్యమంత్రులందరూ శూద్ర వ్యవసాయ, చేతివృత్తుల నేపథ్యం ఉన్నవారే. ఉత్తరాదిలో అఖిలేశ్ యాదవ్, తేజస్వీ యాదవ్, నితీశ్ కుమార్, భూపేశ్ బఘేల్, అశోక్ గెహ్లోత్ కూడా శూద్ర వ్యవసాయ నేపథ్యం నుండి వచ్చినవారే. వీరందరూ 2024లో మెజారిటీ పార్లమెంటు స్థానాలు గెలిస్తే బీజేపీ ఓడిపోతుంది.

జాతీయ శూద్ర–ఓబీసీ నాయకులు ఏకమై సానుకూల ప్రజాస్వామ్య సంక్షేమం దిశగా దేశాన్ని నడిపించాల్సిన సమయం ఇది. ఓబీసీ రాజకీయాల పేరుతో జరుగుతున్న మతతత్వాన్ని అంతమొందించాలి. వ్యవసాయాధారిత జాతీయవాదాన్ని అగ్రపీఠిన ఉంచడం; ఓబీసీలు, దళితులు, ఆదివాసీలు కానివారు భారీ మొత్తంలో కూడగట్టిన క్రోనీ క్యాపిటల్ సమీకరణను తనిఖీ చేయడం ప్రస్తుతం చాలా ముఖ్యం. తమకు భాగస్వామ్యం లేని క్రోనీ క్యాపిటలిజానికి ఓబీసీలు మద్దతు ప్రకటిస్తే, అది భారతదేశ ప్రజాస్వామ్య పెట్టుబడిదారీ మార్గాన్ని నాశనం చేస్తుంది. మహాత్మా ఫూలే, అంబేడ్కర్, పెరియార్‌లు రాజకీయాలలో మతం ప్రమేయం లేకుండా సానుకూల ప్రజాస్వామ్యాన్ని కోరుకున్నారు. సిద్ధరామయ్య తన జీవితంలో ఏ సమయంలోనైనా మతపరమైన భావజాలానికి చోటివ్వకుండా లౌకికవాద భావజాలానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

దిగేవరకు ఆగలేదు



భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూకు స్వాగతం పలికేందుకు అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్. కెన్నెడీ అన్ని ప్రొటోకాల్స్‌నూ ఉల్లంఘించి విమానంలోకి ప్రవేశించారు! స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే నెహ్రూ వహించిన గొప్ప నాయకత్వం వల్ల భారతదేశానికి లభించిన గౌరవం అది. (మొన్నటి నెహ్రూ వర్ధంతి సందర్భంగా)

– అన్షుమాన్ సాయిల్, ట్విటిజెన్

ప్రారంభానికి ముందే!



మహత్తు గల గొప్ప వాస్తుశిల్పానికీ, వాస్తుశాస్త్రానికీ.. తిరుగులేని నిదర్శనం మన కొత్త పార్లమెంటు భవనం. ఇందుకు రుజువు కావాలా?! ప్రతికూల శక్తులు భవనంలోకి ప్రవేశించడానికి మొదటే స్వచ్ఛందంగా ఎలా నిరాకరించాయో చూడండి.

– అమితాబ్ చౌదరి, సనాతన ధర్మ కార్యకర్త

ప్రేమ వెలసింది



తొమ్మిదేళ్లుగా మోదీ చేతుల్లో ధ్వంసమైన ఈ దేశాన్ని రాహుల్ తొమ్మిది నెలల్లో పునర్నిర్మించారు. భారత్ జోడో యాత్ర దేశమంతటా ప్రేమను రేకెత్తించింది.

– అర్మాన్, గాంధీ ఫాలోవర్

ఎన్నని చెప్పడం?!



నేను మోదీజీకి మళ్లీ ఎందుకు ఓటేస్తానంటే : 5వ అతి పెద్ద జీడీపీ, ఆర్టికల్ 370 రద్దు, టీకాలు, విదేశీ విధానం, నీరు, ఉజ్వల పథకం, మరుగుదొడ్లు, ఆలయాల పునర్నిర్మాణం, మౌలిక సదుపాయాలు, పీఎల్ఐ, యూపీఐ.. ఇంకా డిజిటైజేషన్!

– రవిసుతంజని, ఇన్‌ఫ్లుయెన్సర్

జర్నలిజం 'టుడే'



రాజ్‌దీప్ : సీఎంని విమర్శించినందుకు ఒక ప్రభుత్వ టీచర్‌ని సస్పెండ్ చేశారు.

సాగరిక : ఈ నియంతృత్వంపై ఆర్టికల్ రాస్తాను. యూపీలోనే కదా జరిగింది?!

రాజ్‌దీప్ : కాదు.. కర్ణాటకలో.

సాగరిక : సరే, ఈ సమ్మర్‌లో మనం ఎక్కడికి వెళుతున్నాం?

– వరుణ్ కుమార్ రాణా, పొలిటికల్ ఎనలిస్ట్

అక్షరాలకు కొత్త పరిమళాలు అద్ది...

సందర్భం



రామా చంద్రమౌళి

'సముద్రం నా పేరు' అన్న మకుటంతో ఒక రసవత్తర కావ్యాన్ని వెలయించి తనవే అయిన, అప్పటిదాకా ఎవరూ ఉపయోగించని రూపకాలూ, ప్రతీకలూ, బింబ ప్రతిబింబాలనూ, ఉపమానాలనూ విలక్షణ రీతిలో అక్షరాలలో పొదిగి అక్షరాలకు కొత్త జ్ఞాన పరిమళాన్ని అద్ది జగద్వ్యాప్తం చేశారు శేషేంద్ర. 'సూర్యుడు సముద్రాల మీద వంగి/ నీళ్ళు తాగే గుఱ్ఱం/ ఆకాశం నగరాల మీద వంగి గర్జించే/ సింహం/ భూమి ఒక శూన్యంలో తిరిగే/ బొంగరం/ జీవితం మనం అడక్కుండా వచ్చిన / ఒక సంగరం' అని ఆయనంటారు. అతి నూతన మెటఫర్లతో కొత్త కవిత్వ కిటికీలను తెరిచిన శేషేంద్ర శర్మ ముప్పై నలభై ఏళ్ళ క్రితపు జిజ్ఞాసువులైన యువకవులకు ఒక ప్రేరకుడైనారు. దాదాపు రెండు తరాలను తన మాయా మోహ మహత్తులో ముంచి 'కవిసేన'ను స్థాపించి, ప్రజల పక్షాన... ప్రధానంగా దేశానికి అన్నాన్ని దానం చేసే రైతు పక్షాన క్షితిజ రేఖపై నిలబడి 'మండే సూర్యుడై' విస్ఫోటించారు.

గుంటూరు శేషేంద్ర శర్మ పురాణాలు, ఇతిహాసాలు, ప్రబంధాల నుండి స్వీకరించిన విలువైన మూలవిలువలతో పాటు విస్తృతంగా యూరోపియన్, ప్రధానంగా ఫ్రెంచ్, పర్షియన్ కవిత్వాన్ని లోతుగా అధ్యయనం చేసి తనను తాను ఒకానొక విచిత్రమైన శైలీనిర్మాతగా తీర్చి దిద్దుకున్నారు. అందువల్లనే ఆయన తన సమకాలికులైన విశ్వనాథ, శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, జాషువాల కంటే భిన్నమైన, విశిష్టమైన కవిగా కూడా ఎదిగారు.

శేషేంద్ర శర్మ వచనం కూడా అసాధారణంగా కొత్త కొత్త పదబంధాలతో సంభరితమై ఉంటుంది. ఇది చూడండి.. 'పక్షుల గొంతు శబ్దాల గొంతు కంటె గొప్పది. పక్షుల గొంతు కంటె పూల గొంతు గొప్పది. పూల భాష, పక్షుల భాష, ఉషస్సుల భాష, అస్తమయాల భాష, అడవుల, సెలయేళ్ళ, సముద్రాల, ఆకాశాల భాష.. ఈ విశ్వం బహుభాషల పర్ణశాల! అది చేరుకోవాలె కవి.' (నా డైరీ– రక్తరేఖ–పుట 33).

1974 ప్రాంతం నుండే శర్మకి 'కవులుకాని అకవుల' గురించి చాలా ఈసడింపుతో కూడిన ఆవేదన ఉండేది. ఈ మౌన వేదన నుండి నిజమైన, హృదయాన్ని పరివర్తింపజేయగల, సాహిత్య సాంస్కృతిక సైన్యాన్ని ఒకటి నిర్మించాలని 1975 నుండి తపించడం నాకు తెలుసు. దాని ఫలితంగా శేషేంద్ర మానస పుత్రికగా 'కవిసేన' అన్న సంస్థ రూపుదిద్దుకుంది. దాని సిద్ధాంతాలను డాక్యుమెంట్ చేస్తూ 1977లో 'కవిసేన మేనిఫెస్టో' విడుదలైంది.

కవిసేన మేనిఫెస్టోను శేషేంద్ర 'ఆధునిక కావ్య శాస్త్రం' అని పిలిచారు. ఇది ఏ రాజకీయ పార్టీకి సంబంధించింది కాదు. కవులు రాజకీయ పార్టీల కోసం కాకుండా కేవలం ప్రజల కోసమే సాంస్కృతిక సేనానులుగా వ్యవహరించాలని స్వప్నించారు. కవి ఏం రాయాలి, ఎలా రాయాలి, ఎందుకు రాయాలి, ఎవరి కోసం రాయాలి అన్న స్పృహతో బాధ్యతగల సామాజిక నిర్మాతగా అవతరించాలని లక్షించారు. మేనిఫెస్టో ఆశయాలు నియమాలుగా.. మనిషిని 'ఆలోచించే జంతువ'ని శాస్త్రజ్ఞులు నిర్వచిస్తే కవిసేన మనిషిని 'కన్నీరు కార్చే జంతువ'ని పునర్నిర్వచించింది. మనిషిని బెంజమిన్ ఫ్రాంక్లిన్ 'పనిముట్లు చేసే జంతువ'న్నాడు. కవిసేన మనిషిని 'ఆయుధాలను చేసే జంతువు' అది. 'ఆకాశంలో మెరిసే విద్యుత్తును భూమండలానికి' బెంజమిన్ ఫ్రాంక్లిన్ తెస్తే, కవిసేన 'మెరిసే కన్నీటిని నక్షత్ర లోకాలకెత్తుదామని' ప్రతినబూనాలంది. ఈ రకమైన దాదాపు పది ఆశయాల్ని స్థిరీకరిస్తూ మేనిఫెస్టోలో ఒక డాక్యుమెంట్ ఉంది. ఈ లక్ష్యాల వైపు అడుగులు వేస్తూ కొన్ని కవితా సంపుటాలను కవిసేన తదనంతర కాలంలో ప్రచురించి విడుదల చేసింది.



గుంటూరు శేషేంద్రశర్మ

సాహిత్య ఉద్యమ స్ఫూర్తితో కొంతమంది నిబద్ధతతో 'కవిసేన'లో ముందుకు సాగుతూండగానే... గొప్ప ఉద్వేగభరితమైన కవితా సామగ్రితో క్రొంగొత్త ప్రతీకలతో, ఉపమలతో ఒక పరంపరగా 1970 నుండి 1986 వరకు వెలువడిన శేషేంద్ర ఎనిమిది కవిత్వ సంపుటాలను సమీకృతపర్చి 'ఆధునిక మహాభారతం' వెలువరించబడింది. 1985లో ప్రథమ ముద్రణగా వెలువడి 2016 నాటికి నాలుగు ముద్రణలను పూర్తి చేసుకుని బహుళ పాఠకాదరణకు పాత్రమయ్యింది.

శేషేంద్రశర్మ రాసిన విలువైన సాహిత్య తులనాత్మక వ్యాసాల పుస్తకం 'కాలరేఖ' 1994లో ప్రతిష్ఠాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని సంపాదించి పెట్టింది. దీంట్లో తెలుగు సంప్రదాయ సాహిత్య పురాణాలు, ప్రబంధాలపై రాసిన వాల్మీకి కవిత, 'మేఘ సందేశం', 'అరవింద సావిత్రి', 'వ్యాసుడెవరు?', 'విక్రమోర్వశీయం' నుండి 'గజల్ ఒక అగ్ని', 'కవిత్వం– ఒక అవగాహన', 'ఛందస్సు– కవిత్వం', 'వచన కవిత పుట్టు పూర్వోత్తరాలు'; అలాగే ప్రసిద్ధ తెలుగు కవులు రాయప్రోలు, గురజాడ, పానుగంటి లక్ష్మీనరసింహారావు, తిరుపతి వేంకట కవులు, చిలకమర్తి లక్ష్మీనరసింహారావు... ఇట్లా ఈ తరానికి తెలియని అనేక ఉపయుక్త విశేషాలున్నాయి.

జీవితంలో, రచనల్లో అనేక వివాదాలనూ, ప్రతిఘటనలనూ ఎదుర్కొని నిలిచారు శేషేంద్ర. ఇప్పటి తరానికి శేషేంద్ర జీవితం... ప్రేరణనూ, స్ఫూర్తినీ, కొత్త చేవనూ ఇస్తుంది.

వ్యాసకర్త ప్రముఖ కవి । 93901 09993

(రేపు గుంటూరు శేషేంద్రశర్మ 16వ వర్ధంతి. హైదరాబాద్ జీఎస్‌టీయూలో సాహిత్య సదస్సు)

అవధాన కళను రక్షించుకోవాలి!

అభిప్రాయం



వనం జ్వాలా నరసింహారావు

అనుకోకుండా అవకాశం, అదృష్టం లభించడం అంటే ఇదేనేమో! చిరకాల మిత్రుడు మరుమాముల దత్తాత్రేయ శర్మ వ్యవస్థాపక అధ్యక్షులుగా ఏర్పాటైన 'అవధాన విద్యా వికాస పరిషత్' ఆధ్వర్యంలో మే 14న నిర్వహించిన రెండవ అవధాన శిక్షణా శిబిరం విజయోత్సవ సభలో పాల్గొనడం ఒక అదృష్టం. ముఖ్య అతిథిగా పాల్గొన్న పంచ సహస్రావధాని, తిరుమల తిరుపతి అన్నమాచార్య ప్రాజెక్ట్ మాజీ సంచాలకులు డాక్టర్ మేడసాని మోహన్ ఉపన్యాసం ఎన్నో విషయాలు చెబుతూ సాగింది. సభలో మాట్లాడిన వక్తలందరూ అవధాన ప్రక్రియ తెలుగు భాషకే గర్వకారణమనీ, తెలుగుభాషలో ఉన్న ఈ అద్భుత ప్రక్రియ ప్రపంచంలో మరేభాషలో లేదనీ, ఇది ఒక మనోవైజ్ఞానిక ధారణతో కూడుకున్న తెలుగుజాతి తరగని ఆస్తి అనీ అన్నారు. మేడసాని ఉపన్యాసం ఆసాంతం 'అవధానంలో ఏకాగ్రత' గురించి నొక్కి వక్కాణించింది.

మేడసాని తన ఉపన్యాసంలో కొంత మేరకు తన జీవనయానాన్ని కూడా ఆవిష్కరించారని అనాలి. ఒక మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన తాను చిన్నతనంలో సుదీర్ఘకాలం కడుపునొప్పితో బాధపడ్డాననీ, ఒక అవధూత ఒక పరమౌషధం ఇచ్చారనీ, దాంతో తనకు బాధ తగ్గిందనీ, ఆయన సలహా మేరకే ఆశ్రమానికి దగ్గరలో ఒక పాఠశాలలో చేరాను అని చెప్పారు.

తనకు దేవీ దర్శనం, అనుగ్రహం కలిగిందనీ, ఫలితంగా తొమ్మిదవ తరగతిలోనే పద్యం రాయడం ఆరంభించానని మేడసాని అన్నారు. తన గురువుగారు తన పద్యాలలోని ఛందస్సు తప్పొప్పులు సరిచేసే వారని పెప్పారు. పదవ తరగతి చదువుతున్నప్పుడే అవధానం చేయడం మొదలు పెట్టాననీ, భగవదనుగ్రహం వల్ల అది నిరంతరాయంగా కొనసాగిందనీ, ఇప్పటికీ ఖండాంతరాలలో చేసిన 300కు పైగా అవధానాలను కలుపుకొని, మొత్తం 1,200 పైగా అవధానాలు చేశాననీ చెప్పారు.

ఒకప్పటికీ, ఇప్పటికీ అవధానాల తీరుతెన్నులలో, పృచ్ఛకుల నుండి ఎదుర్కొంటున్న ప్రశ్నల సవాళ్ల విధానంలో చాలా మార్పులు వచ్చాయనీ, తెలుగుభాషలో ఇంగ్లీష్, ఉర్దూ, సంస్కృతం... ఆ మాటకొస్తే కొన్ని సందర్భాలలో మరెన్నో పరాయి భాషల పదాలు ఛందోబద్ధంగా వాడాల్సిన అవసరం, ఆగత్యం, ఏర్పడిందనీ అన్నారు. అవధాని చేసే అపురూపమైన సాహితీ విన్యాసంలో కాలానుగుణంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా నేటి తరం అవధాని కూడా ఏకాగ్రతతో మారాల్సి వస్తున్నదని అన్నారు.



ఇప్పుడు నలుగురు సినిమా నటీమణుల పేర్లు చెప్పి సరస్వతీ స్తోత్రం చేయమనో; నాలుగు ఆంగ్లపదాలు ఇచ్చి విష్ణుమూర్తిని వర్ణించమనో; పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, కజకిస్తాన్ లాంటి ఉర్దూ పదాలు ఇచ్చి వెంకటేశ్వర స్వామిని స్తుతించమనో... ఇలా ఏమేమో అడుగుతున్నారనీ, వారి ప్రశ్నలకు అనుగుణంగా సమస్యాపూరణ చేయాల్సి వస్తున్నదనీ అన్నారు. అలా ఆయన ఉపన్యాసం ఆసాంతం ఆసక్తికరంగా, ఎన్నో విషయాలు నేర్చుకునే విధంగా కొనసాగింది. ఏదేమైనా 'ఏకాగ్రత' ఉంటే అన్ని సమస్యలూ తొలగిపోతాయని, అదిలేని నాడు అవధానం కష్టమని ఆయన స్పష్టం చేశారు.

అవధానాలు చేయగలవారు అతికొద్ది మందే ఉంటారు. అమెరికాకు చెందిన 'ఆదిత్య' అతి పిన్న వయస్సులోనే, సొంతంగా ఆన్‌లైన్‌లో శిక్షణ పొంది ద్విభాషావధానం అద్వితీయంగా చేయడమే కాకుండా రికార్డ్ సమయంలో అష్టావధానం చేయగలిగారు. అలా ఎందరో ఇటీవలి కాలంలో అవధానాలు చేస్తున్నారు. అయితే ఇంకా, ఇంకా ఎంతోమంది కొత్తవారు చేయాలి. చేస్తున్నవారిలో పరిపక్వత రావాలి.

సాహిత్యంలో ఒక విశిష్ట ప్రక్రియ అయిన అవధానం... కవి ఆశుకవిత్వ గరిమకూ, సాహితీ పటిమకూ, ధారణా శక్తికీ, పాండితీ ప్రకర్షకూ అత్యున్నత పరీక్ష. పద్యాలన్నిటినీ ధారణ చేసి అదే క్రమంలో ఏకధాటిగా చివరలో వాటిని అప్పగించడం మామూలు విషయం కాదు. ఈ యావత్ ప్రక్రియ కొందరికి అభ్యాసం ద్వారా కూడా సిద్ధిస్తుంది. నేర్చుకుంటే రానిదేదీ లేదు. అయితే, నేర్పేవారు ఉండాలి. కాలం గడిచిపోతున్న కొద్దీ అవధానాలు చేసేవారు తగ్గిపోతున్నారు. ఆస్వాదించే వారూ తగ్గిపోతున్నారు.

మరుమాముల నిర్వహించిన శిక్షణా శిబిరాలకు హాజరైన వారిలో పదేళ్ల అమ్మాయి నుండి ఎంబీబీఎస్ చదువుతున్న వారూ, వయసు మీరినవారూ, సుదూరం నుండి వచ్చినవారూ ఉన్నారు. మన తెలుగు భాషకే సొంతమైన ఈ అవధాన పరంపర నిర్విరామంగా ఆచంద్రతారార్కం కొనసాగాలి. అవధాన పండుగలు నిర్వహించుకునే రోజులు మళ్లీ మళ్లీ రావాలి.

వ్యాసకర్త తెలంగాణ సీఎంఓ ప్రధాన ప్రజా సంబంధాల అధికారి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.నవమి ఉ.8.47 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** ఉత్తర రా.1.57 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** ఉ.7.43 నుండి 9.29 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.22 నుండి 1.14 వరకు, తదుపరి ప.2.57 నుండి 3.51 వరకు, **అమృతఘడియలు:** సా.6.10 నుండి 7.34 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.29, **సూర్యాస్తమయం:** 6.26.

16 మంది 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్ట్

- 23 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న ఎర్రచందనం దుంగలు, స్మగ్లర్లు

తిరుపతి మంగళం: వైఎస్సార్ జిల్లా మైదుకూరు, అన్నమయ్య జిల్లా తుమ్మలబైలు ప్రాంతాల్లో వేర్వేరు ఘటనల్లో 23 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, 16 మంది స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ డీఎస్పీలు మురళీధర్, చెంచుబాబు తెలిపారు. తిరుపతి టాస్క్ ఫోర్స్ కార్యాలయంలో ఆదివారం వివరాలు వెల్లడించారు. టాస్క్‌ఫోర్స్ డీఐజీ సెంథిల్‌కుమార్ ఆదేశాల మేరకు రెండు టీమ్‌లు శనివారం రాత్రి నుంచి కూంబింగ్ చేపట్టాయి. ఆర్ఐ చిరంజీవికి చెందిన ఆర్ఎస్ఐ నరేష్ బృందానికి జోరగోడ్లు ప్రాంతంలో కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకొస్తూ తారసపడ్డారు. ఘటనలో 14 మందిని అరెస్టు చేసి వారి నుంచి 17 ఎర్రచందనం దుంగలు, ఒక లగేజీ ఆటో, రెండు మోటారు సైకిళ్లు, 13 ఇనుపగొడ్డళ్లు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డి బృందానికి అన్నమయ్య జిల్లా రాజంపేట రేంజిలోని చిప్పగొందిదొన వద్ద కొందరు ఎర్రచందనం దుంగలు మోసుకుని వస్తూ కనిపించారు. వారిలో కొందరు పారిపోగా, ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. 23 ఎర్రచందనం దుంగల విలువ రూ.40 లక్షలు ఉంటుంది.

తిరుమలలో వేడుకగా ప్రత్యేక సహస్రకలశాభిషేకం



రింగ్ రోడ్ లో క్యూలైన్ లో వేచి ఉన్న భక్తులు

తిరుమల: శ్రీవారి పంచ బేరాలలో ఒకటైన శ్రీ భోగ శ్రీనివాసమూర్తిని శ్రీవారి ఆలయంలో పల్లవరాణి సామవై ప్రతిష్ఠించిన రోజును పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక సహస్రకలశాభిషేకాన్ని నిర్వహించారు. ఉదయం శ్రీవారి ఆలయంలోని గరుడాళ్వార్ సన్నిధిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు, శ్రీ భోగ శ్రీనివాస మూర్తి, శ్రీ విష్వక్సేనులవారిని వేంచేపు చేశారు. శ్రీవారి మూలమూర్తికి ముందు గరుడాళ్వార్ సన్నిధిలో కౌతుకమూర్తి అయిన శ్రీ మనవాళపెరుమాళ్(శ్రీ భోగ శ్రీనివాస మూర్తి)ను, ఆయనకు అభిముఖంగా శ్రీ విష్వక్సేనులవారిని ఉంచారు. తర్వాత శ్రీవారి మూలమూర్తిని శ్రీ భోగ శ్రీనివాసమూర్తికి కలుపుతూ దారం కట్టి అనుసంధానం చేశారు. అనంతరం వేద పండితులు వేద పారాయణం చేయగా, అర్చకస్వాములు ప్రత్యేక సహస్ర కలశాభిషేకం చేశారు.

సర్వ దర్శనానికి 24 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం ఔటర్ రింగ్ రోడ్డు, కృష్ణ తేజ గెస్ట్ హౌస్ వరకు క్యూలైన్లు చేరాయి. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు 55,000 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెన్లు, ఎస్ఎస్డీ టోకెన్లు, దివ్య దర్శనం టోకెన్లు కలిగిన భక్తులు మాత్రమే తిరుమలకు రావాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. మరోవైపు అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది.కాగా, శనివారం శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.53 కోట్లు వచ్చినట్లు టీటీడీ తెలిపింది.

ఉద్యోగ సంఘాల్లో చీలికలకు ఆద్యుడు బొప్పరాజే

రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు రవీంద్రరాజు

సాక్షి, అమరావతి/ఏలూరు(మెట్రో) : ఉద్యోగ సంఘాలను ప్రభుత్వం చీల్చుతోందని రెవెన్యూ సంఘం అధ్యక్షుడు బొప్పరాజు చెప్పడం తీవ్ర అభ్యంతరకరమని, అసలు ఉద్యోగ సంఘాల్లో చీలికలకు ఆద్యుడు ఆయనేనని ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు తెలిపారు. గతంలో రాష్ట్రంలో అతి పెద్ద జేఏసీగా ఉన్న ఏపీ ఎన్జీవోల సంఘంలో చీలిక తెచ్చి ఏపీ జేఏసీ అమరావతిని పెట్టింది బొప్పరాజేనన్నారు. తన దగ్గరే మొత్తం సంఘాలున్నట్టు చెప్పుకొంటున్నారని ఆరోపించారు. రెవెన్యూ అసోసియేషన్‌లో ఉన్న వారి గురించి పట్టించుకోకపోవడం వల్లే రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నుంచి వీఆర్ఏలు, వీఆర్వోలు విడిపోయి వేర్వేరు సంఘాలు పెట్టుకోవాల్సి వచ్చిందని తెలిపారు. బొప్పరాజు చేసే ఉద్యమంపై నమ్మకం లేక ఆయన సభలకు జనం వెళ్లడం లేదని, అందుకే కొందరు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లతో వీఆర్వోలను, వీఆర్ఏలను బెదిరించి సమావేశానికి రప్పించుకుంటున్నారని ఆరోపించారు. శనివారం ఏలూరులో జరిగిన ప్రాంతీయ సదస్సుకు వీఆర్ఏలను సొంత ఖర్చులతో రావాలని చెప్పారన్నారు. ఈ విషయాలను ప్రభుత్వానికి, ప్రభుత్వ ఉన్నత అధికారుల దృష్టికి ఆధారాలతో సహా తీసుకెళతామన్నారు. ఏపీజేఏసీ అమరావతి చేసే ఉద్యమాలకు వెళ్లాలని, లేకుంటే ఏదో రకంగా ఇబ్బంది పెడతామని కొందరు డిప్యూటీ తహసీల్దార్లు, తహసీల్దార్లు బెదిరించి వీఆర్వోలు, వీఆర్ఏలను బొప్పరాజు సదస్సులు, ఆందోళనకు పంపుతున్నారని తెలిపారు.

సారీ.. సారా

సర్కారు తోడ్పాటుతో బాగుపడుతున్న బతుకులు

- సామాజిక రుగ్మతపై సంక్షేమాస్త్రం
- మూడు దశాబ్దాల పూర్వం నుంచి 'తూర్పు'న సారా ప్రవాహం
- కానీ, గత మూడున్నరేళ్లలో గణనీయమైన మార్పు
- సారా తయారీ, విక్రయదారులను సంస్కరించిన రాష్ట్ర ప్రభుత్వం
- నవరత్నాలతోపాటు డీఆర్‌డీఏ, మెప్మా, పరిశ్రమల శాఖ ఆర్థిక తోడ్పాటు
- ఫలితంగా సారాకు స్వస్తిచెప్పి స్వయం ఉపాధి బాటపట్టిన అనేక కుటుంబాలు

తూర్పుగోదావరి నుంచి సాక్షి ప్రతినిధి యిర్రింకి ఉమామహేశ్వరరావు



కొంతమూరుకు చెందిన సాలా జోగమ్మ కుటుంబం పదేళ్లకు పైగా సారా తయారీ, విక్రయాలపైనే ఆధారపడి బతికేది. ఆమె పెద్ద కొడుకు బలరామ్‌పై ఏడు కేసులు, చిన్న కొడుకు వెంకన్నపై నాలుగు కేసులు ఉండేవి. సారా తయారీపై వచ్చిన డబ్బులు కేసులు, బెయిల్ ఖర్చులకే సరిపోయేవి. చివరకు ఆ కుటుంబం అప్పులపాలైంది. ప్రభుత్వం ఏర్పాటుచేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అధికారుల కౌన్సెలింగ్‌లో సారాకు స్వస్తిపలికి చిన్నబడ్డీ పెట్టుకుని జోగమ్మ జీవిస్తోంది. భర్త శ్రీను, కొడుకు బలరామ్‌లు పందుల పెంపకంతో కుటుంబాన్ని పోషిస్తున్నారు. వారిపై ఉన్న సారా కేసులను ఒక్కొక్కటిగా ఎత్తేస్తున్నారు. డ్వాక్రా ద్వారా సాయం అందింది. సారా విక్రయాలు ఆపేసిన తనకు బతుకుదెరువు కోసం అధికారులు రూ.3 లక్షల సాయం అందించేందుకు ప్రతిపాదనలు చేసినట్లు జోగమ్మ చెప్పింది.



ప్రభుత్వ సాయంతో టిఫిన్ బండి పెట్టుకున్న శ్రీనివాస్



కవలగొయ్యికి చెందిన తీగిరెడ్డి శ్రీనివాస్ చిన్నప్పటి నుంచి సారా విక్రయించేవాడు. చదువుకు స్వస్తిచెప్పి సారా తయారీనే ఉపాధిగా ఎంచుకున్నాడు. అతనిపై ఎనిమిది కేసులు నమోదయ్యాయి. పోలీసులు ఎన్నిసార్లు పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చినా మార్పులేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సారాపై ప్రధాన దృష్టిసారించి 'పరివర్తన' కోసం చేసిన ప్రయత్నాలు ఫలించాయి. దీంతో సారా తయారీ, విక్రయాలకు శ్రీనివాస్ స్వస్తి పలికాడు. ప్రభుత్వం అందించిన రూ.50వేల సాయంతో టిఫిన్ బండి పెట్టుకుని గౌరవంగా జీవిస్తున్నాడు. అతని భార్య గంగాభవానీకి ప్రభుత్వం రూ.5 లక్షలు (రూ.1.50లక్షలు సబ్సిడీ) లోను ఇవ్వడంతో టైలరింగ్ చేసుకుంటోంది. అంతేకాదు.. డ్వాక్రాలో ఉన్న ఆమెకు ఏటా రూ.10వేలు ప్రభుత్వ సాయంతోపాటు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏటా రూ.18,750 చొప్పున అందుకుంటోంది. వీరి కుమారులకు జగనన్న విద్యా దీవెన, విద్యా కానుకలు మూడేళ్లుగా అందుతున్నాయి. ఇలా.. సర్కారు అందిస్తున్న సంక్షేమంతో శ్రీనివాస్ సారాకు సారీ చెప్పేశాడు.



నాటుసారా రహిత గ్రామం వెంకటనగరం

వీరే కాదు.. వెంకటనగరం గ్రామానికి చెందిన గుమ్మడి నాగరాజు (నాని) పది గేదెలను పెంచుతూ పాలవ్యాపారం చేస్తున్నాడు..

- అదే గ్రామానికి చెందిన మగ్గం రాంబాబు తాపీ పనికి, వెళ్తున్నాడు..
- రాజమండ్రి రాజీవ్ గృహకల్ప శాటిలైట్ సిటీకి చెందిన మార్గాని వీర్రాజు హోటల్ నిర్వహించి కుటుంబాన్ని పోషిస్తున్నాడు..
- శాటిలైట్ సిటీ 'బీ-బ్లాక్'కు చెందిన బచ్చు అంజిబాబు కిరాణా, కిళ్లీ షాపుతోపాటు కోళ్ల పెంపకం చేపట్టి స్వయం ఉపాధి పొందుతున్నాడు..
- లాలా చెరువు కాలనీకి చెందిన గరుగుమిల్లి శ్రీనివాసరావు రెండు గేదెలు, ఆవులు, 40 కోళ్లను పెంచుతూ నెలకు దాదాపు రూ.40వేలు సంపాదిస్తున్నాడు..
- రాజీవ్ గృహకల్ప నివాసి పసల సూర్యచంద్రరావు పాన్‌షాపు నిర్వహిస్తూ గౌరవంగా జీవిస్తున్నాడు.
- ఇలా అనేకమంది నాటుసారా విష వలయం నుంచి బయటకొచ్చి స్వయం ఉపాధితో ఆనందంగా జీవిస్తున్నారు.

వెంకటనగరం వంటి ఆదర్శ గ్రామాలెన్నో..

ప్రభుత్వ యంత్రాంగం కృషితో రాజమండ్రి సమీపంలోని వెంకటనగరం గ్రామం పూర్తి సారా రహిత గ్రామంగా మారింది. ఈ గ్రామం ఒకప్పుడు నాటుసారాకు అడ్డాగా ఉండేది. 741 కుటుంబాలున్న ఆ గ్రామంలో 55 కుటుంబాలు నాటుసారా తయారీనే ఉపాధి మార్గంగా ఎంచుకున్నాయి. 30 ఏళ్లకు పైగా సారా తయారీ, విక్రయాలు చేసిన వీరిలో మూడున్నరేళ్లుగా మార్పు మొదలైంది. ఎస్ఈబీ పరివర్తన-2 కార్యక్రమంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు తోడుకావడంతో గతేడాది ఏప్రిల్ నుంచి సారా రహిత గ్రామంగా మార్పుచెందింది. నిజానికి.. రాష్ట్రంలో నాటుసారా స్థావరాలకు తూర్పుగోదావరి జిల్లా పెట్టింది పేరు. గోకవరం, రాజానగరం, గండేపల్లి, కాతేరు, రామవరం, శాటిలైట్ సిటీ, కోరుకొండ, సీతానగరం వంటి 240 గ్రామాల్లో నాటుసారా ఏరులై పారేది. దీని నియంత్రణకు ప్రభుత్వం 'పరివర్తన 2.0' కార్యక్రమాన్ని పటిష్టంగా అమలుచేసింది. దీంతో పది గ్రామాలు మినహా 230 గ్రామాలు ఇప్పుడు సారాకు టాటా చెప్పి సంక్షేమబాట పట్టాయి.

ప్రభుత్వ తోడ్పాటుతో స్వయం ఉపాధి

మరోవైపు.. సామాజిక రుగ్మతగా మారిన సారాపై ప్రభుత్వం సంధించిన సంక్షేమాస్త్రం మంచి ఫలితాలిస్తోంది. మూడు దశాబ్దాల పూర్వం నుంచి 'తూర్పు'న సాగిన సారా ప్రవాహానికి మూడున్నరేళ్లలో అడ్డుకట్ట పడటంతో ఆ గ్రామాల్లో గణనీయమైన మార్పు కన్పిస్తోంది. సారా మహమ్మారి నుంచి బయటపడిన అనేక కుటుంబాల స్వయం ఉపాధికి ప్రభుత్వం ఊతమిస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న 'నవరత్నాలు' ప్రతి ఇంటికీ ఏదో ఒక రూపంలో అందుతున్నాయి. దీనికితోడు డీఆర్‌డీఏ, మెప్మా, పరిశ్రమల శాఖలు కూడా అనేక కార్యక్రమాల ద్వారా వారిని ఆదుకుంటున్నాయి. ఇటీవల తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మాధవీలత పలు శాఖలను సమన్వయంతో వారి జీవనోపాధికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా 128 కుటుంబాలకు రూ.1.47 కోట్ల సబ్సిడీ రుణాలు అందించారు. ఫలితంగా.. వారు గేదెలు, కోళ్ల పెంపకం, కిరాణా, పాన్‌షాప్, హోటల్ వంటి వ్యాపారాలు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. పరిశ్రమల శాఖ ద్వారా చిన్న తరహా యూనిట్ల ఏర్పాటు నిమిత్తం 27 మంది లబ్ధిదారులకు రూ.1.01కోట్లు మంజూరు చేశారు. వారంతా పేపర్ ప్లేట్లు, అప్పడాల తయారీ, ఎంబ్రాయిడరీ వర్క్, సెంట్రింగ్ వర్క్, టెంట్‌హౌస్, జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేసుకున్నారు.

ప్రభుత్వ సహకారంతో స్వీటు కొట్టు పెట్టుకున్నా..



ప్రభుత్వం నాకు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని మంజూరు చేసింది. ఆ డబ్బుతో స్వీటు కొట్టు పెట్టుకుని పూతరేకులు విక్రయిస్తు కుటుంబాన్ని పోషిస్తున్నాను. నా భార్య ప్రమోదకు ప్రభుత్వం డ్వాక్రా రుణమాఫీ, సున్నా వడ్డీ ఇస్తోంది. అమ్మఒడి కూడా వస్తోంది. నన్ను ఆర్థికంగా ఆదుకుని నా కుటుంబానికి భరోసా ఇచ్చిన సీఎం వైఎస్ జగన్ మేలు ఎప్పటికీ మరిచిపోం.

– పల్లి అంబేడ్కర్, మద్దూరులంక గ్రామం

కులవాదుల గుండెల్లో రైళ్లు

973వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రాజధానిలో పేదలకు పట్టాల పండుగ జరుగుతుండడం చూసి కులవాదుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 973వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో ఆదివారం పలువురు మాట్లాడారు. కోర్టుల్లో పెండింగ్ ఉన్నప్పుడు స్థలాలు పంపిణీ చేస్తున్నారని, ఇవి చెల్లుబాటు కావంటూ తప్పుడు ప్రచారం చేస్తున్న బాబు ఆయన ఎల్లో మీడియా మరి చెల్లని పట్టాల కోసం ఎందుకు కలవరపడుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే నేడు ఏపీలో సీఆర్డీఏ చట్టాలకు అనుగుణంగా పేదల పట్టాల పంపిణీ జరిగిందని, బాబు తప్పుడు ప్రచారాలు మానుకోపోతే వెంటపడి తరమడం ఖాయమని హెచ్చరించారు. మామకు వెన్నుపోటు పొడిచి మరణానికి కారణమైన బాబు మహానాడు పేరుతో చేస్తున్న డ్రామాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. బాబుకు సిగ్గు, శరం ఉంటే సొంత పార్టీ పెట్టుకుని ఎమ్మెల్యేగా గెలిచి ప్రజాక్షేత్రంలోకి వస్తే బండారం బయటపడుతుందని చెప్పారు. రాజధాని సాక్షిగా జరిగిన అమరావతి శంకుస్థాపన శిలాఫలకంలో తన పేరు లేకుండా చేసినా శ్రావణ్ కుమార్ కులవాదులకు వత్తాసు పలకడం సిగ్గుచేటని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు, పల్లె బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మోస్తరు వర్షాలు!

- కొన్ని ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం, ద్రోణిల ప్రభావం
- మరికొన్ని ప్రాంతాల్లో కొనసాగనున్న ఉష్ణోగ్రతలు
- అనంతపురం జిల్లాలో పిడుగుపడి ఇద్దరు మృతి

సాక్షి, విశాఖపట్నం/శింగనమల: ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో సోమవారం నుంచి కోస్తాంధ్ర, రాయలసీమలోని కొన్ని చోట్ల మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. రోహిణి కార్తె కావడంతో కొన్ని ప్రాంతాల్లో మాత్రం ఎండలు, వడగాడ్పుల తీవ్రత ఎక్కువగానే ఉంటుంది. ప్రస్తుతం తెలంగాణ పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం సగటున సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉంది. మరోవైపు ఉత్తర-దక్షిణ ద్రోణి ఆగ్నేయ మధ్యప్రదేశ్ నుంచి తెలంగాణ, రాయలసీమ, ఉత్తర తమిళనాడు మీదుగా దక్షిణ తమిళనాడు వరకు సగటున సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఉపరితల ఆవర్తనం మీదుగా వెళుతోంది. వీటి ఫలితంగా సోమవారం కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఒకటి, రెండుచోట్ల, బుధ, గురువారాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఉరుములు, మెరుపులతోపాటు అక్కడక్కడా పిడుగులు పడే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది.

నేడు వైఎస్సార్ జిల్లాలో వడగాడ్పులు

వైఎస్సార్ జిల్లాలోని చాపాడు, కమలాపురం, ప్రొద్దుటూరు, వల్లూరు, వీరపునాయుడుపల్లె, ఎర్రగుంట్ల మండలాల్లో సోమవారం వడగాడ్పులు వీచే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మిగిలిన ప్రాంతాల్లో కొన్ని చోట్ల ఎండ తీవ్రత ఉంటుందని పేర్కొంది. ఆదివారం ప్రకాశం జిల్లా కురిచేడులో 45.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. నెల్లూరు జిల్లా వెంకటాచలంలో 45.2, పల్నాడు జిల్లా రొంపిచర్ల లో 44.8, గుంటూరు జిల్లా వట్టిచెరుకూరులో 44.7 డిగ్రీలు చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో ఆదివారం 24 మండలాల్లో వడగాడ్పులు వీచాయి.

పిడుగుపడి ఇద్దరు మృతి



బాలకృష్ణ



గౌరీశంకర్

అనంతపురం జిల్లా శింగనమల మండలం ఉల్లి కల్లు గ్రామంలో ఆదివారం సాయంత్రం పిడుగు పడి ఇద్దరు మృతిచెందారు. ఉల్లికల్లుకు చెందిన వడ్డే బాలకృష్ణ (35), గౌరీశంకర్(19), వారి బంధువు తరుణ్‌కుమార్ కలిసి పొలం నుంచి బైక్‌పై ఇంటికి వస్తుండగా, పెద్ద వర్షం కురవడంతో మార్గమధ్యంలోని ఓ చెట్టు కింద ఆగారు. ఆ చెట్టుపై పిడుగుపడటంతో బాలకృష్ణ, గౌరీశంకర్ అక్కడికక్కడే మృతిచెందారు. తరుణ్‌కుమార్ ప్రాణాలతో బయటపడ్డాడు. బాలకృష్ణకు భార్య, కుమార్తె ఉన్నారు. గౌరీశంకర్‌కు వివాహం కాలేదు. మరోవైపు అల్లూరి సీతారామరాజు జిల్లా పెద్ద అగ్రహారంలో ఆదివారం సాయంత్రం పిడుగుపడి ఇద్దరు మహిళలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.

సంక్షేమ చరితం.. సువర్ణ లిఖితం

- సీఎం వైఎస్ జగన్ అద్భుత పాలన శ్లాఘనీయం
- భజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ



కొరిటెపాడు (గుంటూరు): సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం దిగ్విజయంగా నాలుగేళ్లు పూర్తి చేసుకుని ఐదో ఏడాదిలోకి అడుగుపెడుతున్న సందర్భంగా గుంటూరులోని భజరంగ్ ఫౌండేషన్ కార్యాలయంలో ఆ సంస్థ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ ఉత్సవాలను ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. వైఎస్ జగన్ విద్య, వైద్యం కోసం నాలుగేళ్లలో రూ.వేల కోట్లు వ్యయం చేశారని గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ పథకంలో గతంలో కేవలం 1,059 రకాల వ్యాధులకు మాత్రమే చికిత్స అందించగా.. మూడింతలు పెంచిన ప్రభుత్వం ఇప్పుడు 3,136 వ్యాధులకు చికిత్స అందించడం దేశ చరిత్రలో ఒక రికార్డుగా అభివర్ణించారు. సీఆర్డీఏ పరిధిలోని గ్రామాల్లో పేదలకు 50,793 ఇళ్ల పట్టాల పంపిణీ చేయడం, 5,024 టిడ్కో ఇళ్లు అందజేసి దేశ చరిత్రలో సువర్ణాధ్యాయాన్ని లిఖించిన ఘనత కూడా సీఎం జగన్‌కి దక్కిందని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 32 లక్షల ఇళ్ల పట్టాల పంపిణీ జరిగిందని, ఇది పేదలకు జరుగుతున్న పట్టాభిషేకమన్నారు. ఈ నాలుగేళ్లలో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా రూ.2.10 లక్షల కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడం పేదలపై ఆయనకు ఉన్న ప్రేమకు నిదర్శనమని వివరించారు. సీఎం జగన్ సేవాస్ఫూర్తిని క్షేత్రస్థాయిలోకి బలంగా తీసుకెళ్లేందుకు భజరంగ్ ఫౌండేషన్ పాటుపడుతోందని తెలిపారు. ఇప్పటికే జగన్నామ సంక్షేమ సంవత్సరం పేరిట ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

కోటిపల్లి రైల్వేలైన్‌కు కదలిక

గౌతమి గోదావరిపై వంతెన, ట్రాక్, మౌలిక వసతులకు రూ.296.51 కోట్లు

- టెండర్ల దాఖలుకు గడువు జూన్ 26
- ఫలించిన రాష్ట్రప్రభుత్వ యత్నాలు



కోటిపల్లి - నర్సాపురం రైల్వే లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా గౌతమీ గోదావరి నదిపై పూర్తయిన పియర్స్ నిర్మాణం

సాక్షి అమలాపురం: కోటిపల్లి–నరసాపురం రైల్వేలైన్ నిర్మాణంలో ముందడుగు పడింది. కొన్ని పనులకు రైల్వేశాఖ రూ.296.51 కోట్లు కేటాయించింది. గౌతమి నదిపై దాదాపు రెండేళ్లుగా నిలిచిపోయిన వంతెన నిర్మాణ పనులు పూర్తిచేసేందుకు రైల్వేశాఖ టెండర్లు పిలిచింది. ఇప్పటికే పిల్లర్ల నిర్మాణం పూర్తయిన ఈ వంతెన పైభాగంలో ఐరన్ రెయిల్స్, బాక్స్ గడ్డర్లు, ఇతర పనులు చేపట్టనున్నారు. కోటిపల్లి–నరసాపురం మధ్య 57.21 కిలోమీటర్ల రైల్వేలైన్ నిర్మాణ అంచనా రూ.2,120.16 కోట్లు. ఈ ప్రాజెక్టులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని గోదావరి నది పాయలపై మూడు వంతెనల నిర్మాణం కీలకం. ఈ పనులు పూర్తయితే ప్రాజెక్టు నిర్మాణం దాదాపు కొలిక్కి వచ్చినట్టే. తొలుత డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలో కోటిపల్లి–శానపల్లిలంక మధ్య గౌతమి గోదావరి నదిపై 3.50 కిలోమీటర్ల వంతెన నిర్మాణం చేపట్టారు. దీనికి సంబంధించి మొత్తం 44 పిల్లర్ల నిర్మాణం పూర్తయింది. వైనతేయ గోదావరి పాయపై బోడసకుర్రు–పాశర్లపూడి మధ్య 21 పిల్లర్లకుగాను 16 పూర్తయ్యాయి. ఐదు నిర్మాణదశలో ఉన్నాయి. వశిష్ట గోదావరి నదిపై జిల్లాలోని దిండి, పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని చించినాడ మధ్య వంతెన నిర్మాణానికి 20 పిల్లర్లకుగాను 18 పూర్తయ్యాయి. గౌతమి నదిపై పిల్లర్ల నిర్మాణం పూర్తయి రెండేళ్లవుతున్నా మిగిలిన వంతెన నిర్మాణ పనులు చేపట్టలేదు. వరదలు, ఇతర కారణాల వల్ల వశిష్ట, వైనతేయ పిల్లర్ల నిర్మాణాలకు అవాంతరాలు ఏర్పడినా ఇటీవల పనులు జోరందుకున్నాయి.

ఇక పనులు చకచకా..

గౌతమి నదిపై వంతెన నిర్మాణం పూర్తిచేయడంతోపాటు ట్రాక్ నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు రైల్వేశాఖ రూ.296.51 కోట్లు కేటాయించడంతో పనులు చకచకా సాగనున్నాయి. ఈ నిధులతో వంతెన నిర్మాణం పూర్తిచేయడంతోపాటు కోటిపల్లి వైపు 30 మీటర్లు, శానపల్లిలంక వైపు 100 మీటర్ల మేర ఎర్త్‌వర్క్ చేసి, కోటిపల్లి నుంచి శానపల్లిలంక వరకు ట్రాక్ నిర్మిస్తారు. ఈ పనులకు సంబంధించి ఈ నెల 11న టెండర్లు పిలిచారు. వచ్చేనెల 26వ తేదీ వరకు టెండర్ల దాఖలుకు అవకాశం ఇచ్చారు.

చాలా సంతోషం



కోటిపల్లి–నరసాపురం రైల్వే ప్రాజెక్టులో గౌతమి నదిపై వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించడంతో చాలా సంతోషంగా ఉంది. ఆగిపోయిన పనులు మొదలు కావడంతో ఈ ప్రాజెక్టుపై స్థానికులకు ఉన్న బెంగ వీడింది. ఇందుకు సహకరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు.

– బండారు రామ్మోహనరావు, కోనసీమ జేఏసీ కన్వీనర్

దుష్ప్రచారాలకు తెర

దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కోటిపల్లి–నరసాపురం రైల్వే ప్రాజెక్టులో 25 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వ వాటాగా భరిస్తామని హామీ ఇచ్చారు. గత చంద్రబాబు ప్రభుత్వం కేవలం రూ.2 కోట్లు ఇస్తున్నట్టు ఉత్తర్వులు జారీచేసి చేతులు దులుపుకొంది. నిధులు విడుదల చేయలేదు. భూసేకరణ భారం రాష్ట్ర ప్రభుత్వం మోస్తున్నందున ఇవ్వాల్సిన వాటాను మినహాయించాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చింది. ఈ యత్నాలు ఫలించాయి. దీంతో రైల్వేశాఖ గౌతమి వంతెన నిర్మాణ పనులకు టెండర్లు పిలిచింది. ప్రభుత్వం ఈ ప్రయత్నాల్లో ఉండగా ఇదే అదనుగా టీడీపీ సహా విపక్షాలు వంతెన నిర్మాణ పనులు నిలిచిపోయినట్టు దుష్ప్రచారానికి దిగాయి. గౌతమి నదిపై వంతెన పనులు ఆగినా.. వైనతేయ, వశిష్ట నదులపై వంతెనల పనులు జరుగుతున్నా విషప్రచారం ఆపకపోవడం గమనార్హం. తాజాగా గౌతమి నదిపై వంతెన పనులు కూడా మొదలు కానున్నాయి. గౌతమి నదిపై వంతెన నిర్మాణ పనులకు టెండరు పిలవడంపై కోనసీమ జేఏసీ చైర్మన్ వి.దివాకర్, కన్వీనర్ బండారు రామ్మోహనరావు అమలాపురంలో ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

ఆపద్బాంధవి 108

- వాహనం కూడా వెళ్లని అటవీప్రాంతంలో గర్భిణికి కాన్పు చేసిన సిబ్బంది
- మగబిడ్డకు జన్మనిచ్చిన వైనం.. తల్లీబిడ్డ క్షేమం



వసంతను అటవీ ప్రాంతం నుంచి 108 వాహనం వద్దకు మోసుకొస్తున్న 108 సిబ్బంది

చౌడేపల్లి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైద్య స్వరూపమే మారిపోయింది. పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేసింది. ఇందులో భాగంగానే 108 వ్యవస్థను మరింతగా బలోపేతం చేసింది. ఫోన్ వస్తే చాలు నిమిషాల్లో ఘటనా స్థలానికి సిబ్బంది చేరిపోతున్నారు. రోగులకు కావాల్సిన సహాయం అందించి మన్ననలు అందుకుంటున్నారు. ఇలాంటిదే చిత్తూరు జిల్లాలో జరిగింది. చౌడేపల్లె మండలం, పందిళ్లపల్లె పంచాయతీ, ముదిరెడ్డిపల్లెకు చెందిన రాజశేఖర్, వసంత దంపతులు సోమల మండలం, పెద్ద ఉప్పరపల్లె సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న మామిడితోటలో కాపలా ఉన్నారు. ఇక్కడకు ఎలాంటి దారి వసతి లేదు. సెల్‌ఫోన్ సిగ్నల్ కూడా అందదు. వసంత నిండు గర్భిణి కావడంతో ఆదివారం ఉదయం పురిటినొప్పులు వచ్చాయి. రాజశేఖర్ సెల్ సిగ్నల్ ఉన్న ప్రాంతానికి వచ్చి 108కు ఫోన్ చేశారు. సమాచారం అందుకొన్న 108 సిబ్బంది గణేష్, ప్రసాద్ అతికష్టం మీద మామిడి తోటకు చేరారు. అక్కడి నుంచి రోడ్డు మార్గానికి కిలోమీటరు దూరం ఉండటంతో స్ట్రెచర్‌పైనే గర్భిణిని మోసుకువచ్చారు. మార్గమధ్యంలో పురిటి నొప్పులు అధికమవడంతో మామిడితోటలోనే సుఖ ప్రసవం చేశారు. వసంత మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను అటవీ ప్రాంతం నుంచి చౌడేపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సిబ్బంది సేవలను గ్రామస్తులు, అధికారులు అభినందించారు.

ప్రారంభోత్సవం సాగింది ఇలా..!

అత్యాధునిక హంగులు, సకల సదుపాయాలతో నిర్మించిన ప్రజాస్వామ్య దేవాలయం పార్లమెంటు కొత్త భవనాన్ని ఆదివారం ఉదయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. అట్టహాసంగా ఒక ఉత్సవంలా సాగిన ఈ వేడుకలో ప్రధాని చారిత్రక ప్రాధాన్యమున్న అధికార మార్పిడికి గుర్తయిన రాజదండం (సెంగోల్)ను లోక్‌సభ ఛాంబర్‌లో ప్రతిష్ఠించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సమక్షంలో పార్లమెంటు భవనాన్ని జాతికి అంకితమిచ్చారు.

- సంప్రదాయ దుస్తులు ధరించిన ప్రధాని మోదీ ఉదయం 7.30 గంటలకి పార్లమెంటుకు వచ్చారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రధానికి ఎదురేగి స్వాగతం పలికారు.
- పార్లమెంటు ఆవరణలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం దగ్గర ప్రధాని మోదీ నివాళులర్పించారు
- అక్కడ నుంచి నేరుగా కొత్త భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన పూజామండపానికి చేరుకున్నారు. అక్కడ ప్రధానికి వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కర్ణాటక శృంగేరి మఠాధిపతులు వేద మంత్రాలు పఠిస్తూ ఉంటే ప్రధాని మోదీ గణపతి హోమం నిర్వహించారు. దీంతో పార్లమెంటు కొత్త భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా సాగింది.
- అనంతరం వేద పండితులు ప్రధానికి శాలువా కప్పి ఆశీర్వాదాలు అందజేశారు.
- అక్కడ నుంచి తమిళనాడు నుంచి వచ్చిన 21 మంది పీఠాధిపతులు వద్దకి వెళ్లారు. వారికి నమస్కరించారు. అప్పటికే పూజలు చేసి సిద్ధంగా అక్కడ ఉంచిన చారిత్రక సెంగోల్ ఎదుట ప్రధాని సాష్టాంగ నమస్కారం చేశారు. వారు అందించిన సెంగోల్‌ను చేత పుచ్చుకున్న ప్రధాని మోదీ వీనుల విందుగా




రూ. 75 స్మారక నాణెం ఆవిష్కరణ దృశ్యం

నాదస్వరం వాయిస్తూ ఉంటే, వేద పండితులు మంత్రాలు పఠిస్తూ ఉంటే స్పీకర్ ఓం బిర్లా వెంటరాగా ఒక ఊరేగింపుగా వెళ్లి సెంగోల్‌ను లోక్‌సభ ఛాంబర్‌లోకి తీసుకువెళ్లి స్పీకర్ కుర్చీకి కుడివైపు ప్రతిష్ఠించారు.

- అనంతరం స్పీకర్ ఆసీనులయ్యే సీటు దగ్గర ప్రధాని జ్యోతి ప్రజ్వలన చేశారు.
- లోక్‌సభ నుంచి తిరిగి ప్రధాని మోదీ పూజాస్థలికి చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని స్పీకర్ ఓం బిర్లా సమక్షంలో ఆవిష్కరించి నూతన పార్లమెంటు భవనాన్ని జాతికి అంకితం చేశారు.
- అనంతరం కొత్త భవన నిర్మాణంలో పాలుపంచుకున్న కొంతమంది కార్మికులకు శాలువాలు కప్పి సత్కరించారు. వారి ప్రతిభకి గుర్తింపుగా జ్ఞాపికలను బహూకరించారు.
- అనంతరం సర్వమత ప్రార్థనలు నిర్వహించారు.
- దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా రూ.75 స్మారక నాణేన్ని ప్రధాని ఆవిష్కరించారు. త్రిభుజాకారంలో ఉన్న కొత్త భవనం ముద్రించి ఉన్న స్టాంపు, కవర్‌ని కూడా ఆవిష్కరించారు.
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పంపించిన సందేశాలను రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ చదివి వినిపించారు.
- కార్యక్రమంలో భాగంగా లోక్‌సభలో నేతల సమక్షంలో జాతీయ గీతం అయిన జనగణమన వినిపించారు.
- ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, ఎస్. జైశంకర్, అశ్వినీ వైష్ణవ్, మన్‌సుఖ్ మాండవీయ, జితేంద్ర సింగ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.
- నూతన భవనం ప్రారంభోత్సవానికి కనీసం 20 విపక్ష పార్టీలు హాజరు కాలేదు.

రాజదండం ప్రతిష్ఠాపన దృశ్యం



శుభోదయం.. నవోదయం

నూతన పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ఉద్ఘాటన



- పార్లమెంట్ కొత్త భవనం ప్రపంచ దేశాల ప్రగతికి స్ఫూర్తి
- ఇక్కడ తీసుకొనే ప్రతి నిర్ణయం దేశ ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేస్తుంది
- అణగారిన వర్గాల సాధికారతకు ఇక్కడే ముందడుగు
- కొత్త భవనంలోని ప్రతి ఇటుక, ప్రతి గోడ పేదల సంక్షేమానికే అంకితం
- పార్లమెంట్‌లో మరికొంత మంది ఎంపీలు చేరుతారు
- 2026 తర్వాత పునర్వ్యవస్థీకరణతో ఎంపీల స్థానాలు పెరుగుతాయి

న్యూఢిల్లీ: పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవం దేశ అభివృద్ధి ప్రయాణంలో చిరస్థాయిగా నిలిచిపోయే ఘట్టమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. స్వావలంబన, అభివృద్ధి భారత్‌కు ఇదొక శుభోదయమని చెప్పారు. మన పార్లమెంట్ కొత్త భవనం ఇతర దేశాల ప్రగతికి సైతం స్ఫూర్తిగా నిలుస్తుందని ఉద్ఘాటించారు. ఆదివారం పార్లమెంట్ కొత్త భవన ప్రారంభోత్సవం సందర్భంగా లోక్‌సభ సభామందిరంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. 'నవ భారత్' ఆశలు ఆకాంక్షలను, నూతన లక్ష్యాలను కొత్త భవనం ప్రతిబింబిస్తోందని అన్నారు. ఇక్కడ తీసుకొనే ప్రతి నిర్ణయం దేశ మహోన్నత భవిష్యత్తుకు పునాది వేస్తుందని చెప్పారు. పేదలు, దళితులు, వెనుకబడిన తరగతులు, గిరిజనులు, దివ్యాంగులు, ఇతర అణగారిన వర్గాల సాధికారతకు ఇక్కడే ముందడుగు పడుతుందని వివరించారు. పార్లమెంట్ కొత్త భవనంలోని ప్రతి ఇటుక, ప్రతి గోడ పేదల సంక్షేమానికే అంకితమని నరేంద్ర మోదీ తేల్చిచెప్పారు. ఆయన ఇంకా ఏం మాట్లాడారంటే...

బానిస మనస్తత్వాన్ని వదిలించుకుంటున్నాం

''75వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని దేశ ప్రజలు అమృత మహోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ప్రజలు పార్లమెంట్ కొత్త భవనాన్ని తమ ప్రజాస్వామ్యానికి కానుకగా ఇచ్చుకున్నారు. దేశ ప్రజలకు అభినందనలు తెలియజేస్తున్నా. మన దేశ వైవిధ్యాన్ని, ఘనమైన సంప్రదాయాన్ని పార్లమెంట్ కొత్త భవన నిర్మాణశైలి చక్కగా ప్రతిబింబిస్తుండడం హర్షణీయం. వందల సంవత్సరాల వలస పాలన వల్ల అణువణువునా పాకిపోయిన బానిస మనస్తత్వాన్ని నవ భారతదేశం వదిలించుకుంటోంది. మహాత్మాగాంధీ చేపట్టిన సహాయ నిరాకరణ ఉద్యమం దేశ ప్రజలను మేల్కొల్పింది. నూతన చైతన్యాన్ని నింపింది. స్వాతంత్ర్య కాంక్షను రగిలించింది. స్వాతంత్ర్య పోరాటానికి అంకితమయ్యేలా ప్రజల్లో ఆత్మవిశ్వాసం కలిగించింది. రాబోయే 25 ఏళ్లలో దేశ అభివృద్ధి కోసం ప్రతి పౌరుడు అదే తరహాలో పనిచేయాలి. సహాయ నిరాకరణ ఉద్యమం 1922లో ముగిసింది. మరో 25 ఏళ్లకు.. 1947లో స్వాతంత్ర్యం వచ్చింది. 2047లో మనం వందో స్వాతంత్ర్య దినోత్సవాలను జరుపుకోబోతున్నాం. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుకోవడానికి మనమంతా కంకణబద్ధులమై పనిచేయాలి.



పార్లమెంట్ నిర్మాణ కార్మికులకు కానుకలు

కొత్త భవనం.. ప్రజాస్వామ్య దేవాలయం

ఇది కేవలం ఒక నిర్మాణం కాదు, 140 కోట్ల మంది ఆకాంక్షలకు, కలలకు ప్రతిరూపం. మన స్వాతంత్ర్య సమర యోధుల కలలను సాకారం చేయడానికి ఇదొక వేదిక. ఇది మన ప్రజాస్వామ్య దేవాలయం. భారతదేశ దృఢసంకల్పం ప్రపంచానికి ఇస్తున్న సందేశమిది. ప్రతి దేశ చరిత్రలో అమరత్వం పొందిన క్షణాలు కొన్ని ఉంటాయి. కాలం ముఖచిత్రంపై కొన్ని తేదీలు చెరిగిపోని సంతకంగా మారుతాయి. 2023 మే 28 కూడా అలాంటి అరుదైన సందర్భమే. పేదల ప్రజల సాధికారత, అభివృద్ధి, పునర్నిర్మాణం కోసం గత తొమ్మిదేళ్లుగా కృషి చేస్తున్నాం. ఇది నాకు సంతృప్తినిస్తున్న క్షణం. పేదలకు 4 కోట్ల ఇళ్లు నిర్మించి ఇచ్చాం. 11 కోట్ల మరుగుదొడ్లు నిర్మించాం. గ్రామాలను అనుసంధానించడానికి 4 లక్షల కిలోమీటర్లకుపైగా రహదారులు నిర్మించాం. 50,000కుపైగా అమృత సరోవరాలు(చెరువులు), 30,000కుపైగా కొత్త పంచాయతీ భవనాలు నిర్మించాం. పంచాయతీ భవనాల నుంచి పార్లమెంట్ కొత్త భవనం దాకా కేవలం ఒకేఒక్క స్ఫూర్తి మమ్మల్ని ముందుకు నడిపించింది. అదే.. దేశ అభివృద్ధి, ప్రజల అభివృద్ధి. కొత్త దారుల్లో నడిస్తేనే కొత్త ఆవిష్కరణలు సాధ్యమవుతాయి. భారత్ ఇప్పుడు కొత్త లక్ష్యాలను నిర్దేశించుకుంది. నూతనోత్సాహం కనిపిస్తోంది. కొత్త ఆలోచన, కొత్త ప్రయాణం. దిశ కొత్తదే, విజన్ కొత్తదే. మన విశ్వాసం, తీర్మానం కూడా కొత్తవే. ఇప్పుడు ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తోంది. భారత్ ముందుకు నడిస్తే ప్రపంచం కూడా ముందుకు నడుస్తుంది.

ఆత్మనిర్భర్ భారత్ ఆవిర్భావానికి సాక్షి

ఇప్పటి అవసరాలకు పాత భవనం సరిపోవడం లేదు. అందుకే కొత్తది నిర్మించాం. కొత్తగా మరికొంత మంది ఎంపీలు చేరనున్నారు. 2026 తర్వాత పునర్వ్యవస్థీకరణతో పార్లమెంట్ స్థానాలు పెరుగుతాయి. సెంగోల్‌కు తగిన గౌరవం దక్కుతుండడం సంతోషకరం. చోళ సామ్రాజ్యంలో సెంగోల్‌ను కర్తవ్య మార్గం, సేవా మార్గం, జాతీయ మార్గానికి గుర్తుగా పరిగణించేవారు. కొత్త భవన నిర్మాణంలో 60,000 మంది కార్మికులు పాల్గొన్నారు. ఇక్కడి డిజిటల్ గ్యాలరీని వారికే అంకితమిస్తున్నాం. ఈ కొత్త భవనం ఆత్మనిర్భర్ భారత్ ఆవిర్భావానికి, వికసిత భారత్ దిశగా మన ప్రయాణానికి ఒక సాక్షిగా నిలుస్తుంది.

భారత్ విజయం ప్రపంచ విజయం

భారత్‌లాంటి పూర్తి వైవిధ్యం, అధిక జనాభా ఉన్న దేశం పరిష్కరించే సవాళ్లు, సాధించే విజయాలు చాలా దేశాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి. రాబోయే రోజుల్లో భారత్ సాధించే ప్రతి విజయం ప్రపంచం సాధించే విజయంగా మారుతుంది. భారత్ కేవలం ఒక ప్రజాస్వామ్య దేశం కాదు, ప్రజాస్వామ్యానికి తల్లి కూడా. మన ప్రజాస్వామ్యమే మనకు స్ఫూర్తి. మన రాజ్యాంగమే మన బలం. ఈ స్ఫూర్తికి, బలానికి ఉత్తమమైన ప్రతీక పార్లమెంట్. పాత కొత్తల కలయికకు పరిపూర్ణ ఉదాహరణ పార్లమెంట్ నూతన భవనం. శతాబ్దాల బానిసత్వం కారణంగా మన ఉజ్వలమైన భవన నిర్మాణ శైలికి, పట్టణ ప్రణాళికకు దూరమయ్యాం. ఇప్పుడు ప్రాచీన వైభవాన్ని పునరుద్ధరించుకుంటున్నాం. పార్లమెంట్ కొత్త భవనాన్ని చూసి ప్రతి ఒక్కరూ గర్వపడుతున్నారు. మన వారసత్వం వైభవం, నైపుణ్యాలు, సంస్కృతితోపాటు రాజ్యాంగ వాణికి సైతం ఈ భవనం ప్రాతినిధ్యం వహిస్తోంది. దేశవ్యాప్తంగా వేర్వేరు ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన సామగ్రితో కొత్త భవనం నిర్మించాం. ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్‌కు ఇదొక గుర్తు.



రాత్రివేళ విద్యుత్ వెలుగుల్లో కొత్త పార్లమెంట్



కొత్త పార్లమెంట్‌లో ఆసీనులైన అమిత్ షా, గడ్కరీ తదితరులు



నూతన పార్లమెంట్‌లో ఏపీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి, నిర్మలా సీతారామన్ తదితరులు



కార్యక్రమంలో పాల్గొన్న దేవెగౌడ, రామ్‌నాథ్ కోవింద్, నడ్డా, గోయల్ తదితరులు



పార్లమెంట్ ప్రాంగణంలో శిలాఫలకం ఆవిష్కరించాక మోదీ అభివాదం



రాజదండాన్ని మోదీకి అందజేస్తున్న మఠాధిపతులు

ప్రారంభోత్సవమా? పట్టాభిషేకమా?

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ట్వీట్

న్యూఢిల్లీ: పార్లమెంట్ అనేది ప్రజల గొంతుక అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్ కొత్త భవనం ప్రారంభోత్సవాన్ని పట్టాభిషేక కార్యక్రమంలా నిర్వహించారని ఆక్షేపించారు. ఈ మేరకు రాహుల్ ట్వీట్ చేశారు. ప్రజాస్వామ్యం మనగలిగేది భవనాల్లో కాదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ట్వీట్ చేశారు. ప్రజల గొంతుకల్లో ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుందని తెలిపారు. ప్రజాస్వామ్యం, జాతీయవాదం, ఆడశిశువుల సంరక్షణపై బీజేపీ–ఆర్‌ఎస్‌ఎస్ పాలకులు చెబుతున్న మాటల్లోని డొల్లతనం బయటపడిందన్నారు. పార్లమెంట్ కొత్త భవన ప్రారంభోత్సవం సందర్భంగా మహిళా రెజ్లర్లపై దాడి చేయడం దారుణమని విమర్శించారు. పార్లమెంట్ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పుడు అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను దూరంగా ఉంచారని, ఇప్పుడు ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును దూరం పెట్టారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మండిపడ్డారు. ఎన్నికల రాజకీయాల కోసం దళితులను, గిరిజనులను పావులుగా వాడుకోవడం ప్రధాని మోదీకి అలవాటేనని దుయ్యబట్టారు. చరిత్రాత్మక సందర్భానికి రాష్ట్రపతిని దూరం పెట్టడం ఏమిటని నిలదీశారు. ఇదిలా ఉండగా, రాహుల్ గాంధీ ట్వీట్‌పై బీజేపీ ఎంపీ సుశీల్‌కుమార్ సింగ్ స్పందించారు. నరేంద్ర మోదీకి దేశ ప్రజలు రెండుసార్లు అధికారం కట్టబెట్టడాన్ని రాహుల్ గాంధీ జీర్ణించుకోలేకపోతున్నారని, అందుకే మోదీపై అసూయ పెంచుకున్నారని విమర్శించారు.

భారీ ప్రచార కార్యక్రమం..

పార్లమెంట్ కొత్త భవనాన్ని ప్రధాని మోదీ ప్రారంభించిన తీరుపై వామపక్షాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఈ కార్యక్రమం చక్రవర్తి పట్టాభిషేక మహోత్సవంలా ఉందని వ్యాఖ్యానించాయి. దేశ ప్రజలను భాగస్వాములుగా చేయలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశాయి. 'న్యూ ఇండియా'అనే ప్రకటనతో భారత రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రతిపక్ష పార్టీలు ఎవరూ లేకుండానే పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించిన మోదీ ప్రభుత్వం దీనిని భారీ ప్రచార కార్యక్రమంగా మార్చుకుందని సీపీఎం జనరల్ సెక్రటరీ సీతారాం ఏచూరి ట్వీట్ చేశారు. ఒక వైపు సెంగోల్‌కు పూజలు చేసిన మోదీ ప్రభుత్వం మరోవైపు రెజ్లర్లపై లాఠీలను ఝళిపించిందని సీపీఐ ఎంపీ బినోయ్ విశ్వమ్ ఆరోపించారు. మున్ముందు నిరంకుశ ఫాసిస్ట్ విధానాలు సాగుతాయనేందుకు ఈ ఘటనలే నిదర్శనమన్నారు. చక్రవర్తి పట్టాభిషేకం మాదిరిగా పార్లమెంట్ కొత్త భవనం ప్రారంభోత్సవం జరుగుతుండగానే మహిళా రెజ్లర్లు, మహిళా పంచాయత్‌కు వచ్చిన మహిళలపై పోలీసు జులుం సాగింది. ఇది ప్రజాస్వామ్యం, రాజ్యాంగ స్ఫూర్తిపై నిరంకుశ దాడి'అని సీపీఐ ఎంఎల్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య పేర్కొన్నారు.

తిరోగమనానికి నిదర్శనం: పవార్

పార్లమెంట్ కొత్త భవనం ప్రారంభం సందర్భంగా ప్రధాని మోదీ వివిధ మతసంబంధ పూజలు చేయడంపై ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దేశం వెనక్కి వెళుతోందనటానికి ఇవే నిదర్శమన్నారు. 'మన సమాజంలో శాస్త్రీయ దృక్పథం పెంపొందాలని భారత ప్రథమ ప్రధాని నెహ్రూ ఆకాంక్షించారు. కొత్త పార్లమెంట్ భవన సముదాయం ప్రారంభం సందర్భంగా నిర్వహించిన మతాచారాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయి'అని పవార్ పుణేలో మీడియాతో పేర్కొన్నారు. మన దేశం కొన్ని దశాబ్దాలు వెనక్కి వెళ్తున్నట్లు భయం కలుగుతోందన్నారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతిని కూడా ఆహ్వానించకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్లమెంట్ సమావేశాలు రాష్ట్రపతి ప్రసంగంతోనే ప్రారంభమవుతున్నప్పుడు వారిని ఆహ్వానించకపోవడమేంటన్నారు. 'పార్లమెంట్ నూతన భవనం ప్రారంభానికి నాకు ఆహ్వానం పంపిందీ లేనిదీ తెలియదు. ఒక వేళ ఢిల్లీలోని నా కార్యాలయానికి ఆహ్వానం వచ్చి ఉంటుందేమో తెలియదు'అని వ్యాఖ్యానించారు.

శవపేటికలా పార్లమెంట్ భవనం: ఆర్‌జేడీ వివాదస్పద ట్వీట్



బిహార్‌లోని అధికార పార్టీ రాష్ట్రీయ జనతాదళ్(ఆర్‌జేడీ)పార్లమెంట్ నూతన భవనాన్ని శవపేటికతో పోల్చింది. పార్లమెంట్ కొత్త భవనం శవపేటిక మాదిరిగా త్రిభుజాకారంలో ఉందంటూ బిహార్ అధికార ఆర్‌జేడీ ఆదివారం ట్వీట్ చేసింది. దీనిపై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఆర్‌జేడీని శవపేటికలోనే సమాధి చేస్తారంటూ వ్యాఖ్యానించింది. 'ఆర్‌జేడీ అధమ స్థితికి దిగజారింది. త్రికోణానికి భారతీయ వ్యవస్థలో ఎంతో ప్రాధాన్యం ఉంది. శవపేటిక షట్కోణంగా గానీ బహుభుజిగా కానీ ఉంటుందని తెలుసుకోవాలి'అని పేర్కొంది. అయితే, ఆర్‌జేడీ తన వ్యాఖ్యలను సమర్థించుకుంది. ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని పాతిపెట్టింది. కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని గానీ, రాజ్యసభాధ్యక్షుడైన ఉపరాష్ట్రపతిని గానీ పిలవలేదు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి జరగవు'అంటూ ఆ పార్టీ ట్వీట్ చేసింది.

దేశానికి గర్వకారణం: రాష్ట్రపతి

న్యూఢిల్లీ: పార్లమెంట్ నూతన భవనం ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభం కావడాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము స్వాగతించారు. 'దేశానికి ఇది గర్వకారణం, సంతోషకరమైన విషయం. దేశ చరిత్రలో పార్లమెంట్ నూతన భవన ప్రారంభం స్వర్ణాక్షరాలతో లిఖించదగ్గ అంశం. పార్లమెంట్‌పై విశ్వాసానికి ప్రతీకగా నిలిచే ప్రధాని మోదీ కొత్త పార్లమెంట్‌ను ప్రారంభించడం చాలా సంతృప్తినిచ్చింది'అని ఆమె అన్నారు. భారత ప్రజాస్వామ్యం గొప్ప సంప్రదాయాలు, ఆదర్శాలకు కొత్త ప్రమాణాలను నెలకొల్పాలని ఆకాంక్షించారు. ఈ మేరకు రాష్ట్రపతి పంపిన సందేశాన్ని పార్లమెంట్ ప్రారంభం సందర్భంగా రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ చదివి వినిపించారు.

దేశ ప్రగతికి సాక్షి : ఉప రాష్ట్రపతి

పార్లమెంట్ కొత్త సౌధం రాజకీయ ఏకాభిప్రాయ సాధనకు, బానిస మనస్తత్వం నుంచి పొందిన స్వేచ్ఛకు ప్రతీకగా ఉపయోగపడాలని ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ఆకాంక్షించారు. కొత్త భవనం ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన ఈ మేరకు సందేశమిచ్చారు. ఈ సందేశాన్ని రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ లోక్‌సభ ఛాంబర్‌లో చదివి వినిపించారు. ప్రజల ఆకాంక్షలను నిజం చేయడానికి, వారి సమస్యలకు పరిష్కారాలు కనుగొనడానికి ఈ భవనం తోడ్పడాలని జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు. అమృతకాలంలో నిర్మించిన ప్రజాస్వామ్య సౌధం ఇప్పుడు మాత్రమే కాదు, భవిష్యత్తులోనూ మన దేశ ప్రగతికి సాక్షిగా నిలుస్తుందని వివరించారు. రాబోయే కాలంలో ఎన్నెన్నో చారిత్రక అధ్యాయాలను లిఖించడానికి ఇదొక వేదిక అవుతుందన్నారు. ప్రధాని మోదీ పార్లమెంట్ కొత్త భవనాన్ని జాతికి అంకితం చేయడం తనకు చాలా ఆనందంగా ఉందని ధన్‌ఖడ్ వెల్లడించారు.

మణిపూర్‌లో మళ్లీ ఘర్షణలు..

ఇంఫాల్: మణిపూర్‌లో మళ్లీ హింసాత్మక ఘర్షణలు మొదలయ్యాయి. సాయుధ కుకి మిలిటెంట్లు ప్రత్యర్థి మైతి వర్గానికి చెందిన ఎనిమిది కొండ ప్రాంత గ్రామాలపై దాడులకు పాల్పడ్డారు. ఈ దాడుల్లో ఇద్దరు చనిపోగా, 10 మంది వరకు గాయపడినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. కక్చింగ్ జిల్లాలో మిలిటెంట్లు శనివారం అర్ధరాత్రి మైతీ వర్గానికి చెందిన వారి 80 ఇళ్లకు నిప్పుపెట్టారు. దీంతో, గ్రామస్తులు భయంతో ఇళ్లు వదిలి తలోదిక్కుకు పారిపోయారు. సుగ్నులో పోలీసులు, మిలిటెంట్ల మధ్య జరిగిన కాల్పుల్లో ఒక పోలీసు చనిపోయారు. సుగ్ను, సెరౌ ప్రాంతాల్లో జరిగిన ఘర్షణల్లో ఒకరు చనిపోగా పది మంది గాయపడ్డారు. బిష్ణుపూర్ జిల్లాలో కుకి మిలిటెంట్లు మైతీ వర్గం ప్రజలకు చెందిన 30 ఇళ్లకు నిప్పుపెట్టారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో అధికారులు నిషేధాజ్ఞల సడలింపు సమయాన్ని 11 గంటల నుంచి 6 గంటలకు కుదించారు. కుకీలు దాడులు చేస్తున్నా భద్రతా బలగాలు పట్టించుకోవడం లేదంటూ ఇంఫాల్ వెస్ట్ జిల్లా ఫయెంగ్ గ్రామానికి చెందిన మహిళలు నిరసనకు దిగారు.

40 మంది తీవ్రవాదులు హతం

రాష్ట్రంలో పౌరులపై కాల్పులకు దిగుతూ, ఇళ్లకు నిప్పుపెడుతున్న 40 మంది తీవ్రవాదులను ఇప్పటి వరకు బలగాలు చంపినట్లు ముఖ్యమంత్రి బిరేన్ సింగ్ తెలిపారు. 'రాష్ట్రంలో జరుగుతున్నది జాతుల మధ్య వైరం కాదు. కుకి మిలటెంట్లు, భద్రతా బలగాలకు మధ్య జరుగుతున్న పోరు'గా ఆయన అభివర్ణించారు. షెడ్యూల్ తెగ(ఎస్టీ) హోదా విషయమై రాష్ట్రంలో ఈ నెల 3వ తేదీ నుంచి కుకి, మైతి వర్గాల మధ్య మొదలైన ఘర్షణల్లో 75 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

నేడు అమెరికాకు రాహుల్


న్యూఢిల్లీ: కోర్టు ఆదేశాల మేరకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆదివారం సాధారణ పాస్‌పోర్టును అందుకున్నారు. పార్లమెంట్ సభ్యత్వం కోల్పోయిన రాహుల్ ఇటీవల తన దౌత్యహోదా పాస్‌పోర్టును అధికారులకు తిరిగి ఇచ్చేశారు. ఆయనకు సాధారణ పాస్‌పోర్టును జారీ చేయడంలో ఎలాంటి అభ్యంతరం లేదంటూ శనివారం ఢిల్లీ కోర్టు తెలిపింది. ఈ మేరకు అధికారులు రాహుల్‌కు ఆదివారం ఉదయం పాస్‌పోర్టును పంపించారు. సోమవారం రాహుల్ శాన్‌ఫ్రాన్సిస్కోకు బయలుదేరి వెళ్తారు. అక్కడ స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ విద్యార్థులు, ఇతర ముఖ్యులను కలుసుకుంటారు.

చైనా స్వదేశీ విమానం సక్సెస్

బీజింగ్: చైనా మొట్టమొదటి సారిగా పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ప్రయాణికుల విమానం సీ919 ఆదివారం విజయవంతంగా ప్రయాణించింది. విమానయాన రంగం మార్కెట్‌లోకి డ్రాగన్ దేశం అధికారికంగా ప్రవేశించింది. పశ్చిమదేశాలకు చెందిన బోయింగ్, ఎయిర్‌బస్ సంస్థలతో పోటీ పడేలా చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే చైనా ఈస్ట్రన్ ఎయిర్‌లైన్స్ ప్రయాణికుల విమానాన్ని తయారు చేసింది. తొలిసారిగా షాంఘై నుంచి బీజింగ్‌కు వెళ్లిన ఈ విమానం రెండున్నర గంటల్లో సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకున్నట్టు జిన్‌హువా న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

సోమవారం ၊ 29 ၊ మే ၊ 2023



భక్తిశ్రద్ధలతో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక కల్యాణార్థం, సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆదివారం దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ నిర్వహించారు.



రెంటచింతల @ 47.2

రెంటచింతల: రెంటచింతలలో ఆదివారం 47.2 డిగ్రీల గరిష్ట, 29.6 కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 8 గంటల నుంచి భానుడు ప్రతాపం చూపాడు. గ్రామస్తులు అల్లాడారు.

నేడు స్పందన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి స్పందన కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీ రావు ఆదివారం తెలిపారు. మండల, డివిజన్ స్థాయిలోనూ కార్యక్రమం కొనసాగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

దుర్గమ్మ సేవలో..



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా.. ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు బహూకరించారు.

నేడు దుర్గగుడి పాలక మండలి సమావేశం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల పాలక మండలి సోమవారం సమావేశం కానుంది. బ్రాహ్మణ వీధిలో జమ్మిదొడ్డి ఆవరణలోని బోర్డు మీటింగ్ హాల్‌లో మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం ప్రారంభమవుతుంది. దేవస్థానానికి చెందిన 25 అంశాలతో పాటు పాలక మండలి పెట్టిన మరో 5 అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబతో పాటు ఆలయ ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమ, ఇతర ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధికారులు సమావేశానికి హాజరుకానున్నారు. మరో వైపున గత వారం ఆలయ ఈవో నియమించిన కొత్త వైదిక కమిటీ సభ్యులు కూడా హాజరుకానున్నట్లు తెలుస్తోంది. దేవస్థానంలో నిర్వహించే ఆర్జిత సేవలు, పూజలు, వైదిక పరమైన అంశాల గురించి పాలక మండలి సభ్యులతో చర్చించే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

21 మంది ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతి

పెడన: సీనియార్టీ జాబితా ప్రకారం అర్హులైన 21 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూలు అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఆదివారం ఉమ్మడి కృష్ణాజిల్లాలోని 40 మంది ఎస్జీటీలను మచిలీపట్నం డీఈవో కార్యాలయానికి హాజరుకావాలని పేర్కొనడంతో వారు హాజరై సర్వీసు రిజిస్టర్లను, ధ్రువీకరణపత్రాలను సమర్పించారు. అధికారులు వాటిని పరిశీలించారు. 40 మందిలో 21 మంది ఉద్యోగోన్నతి కావాలని కోరుకుంటూ విల్లింగ్ ఇవ్వగా మిగిలిన 19 మంది అన్ విల్లింగ్ ఇచ్చారని డీఈవో తాహెరాసుల్తానా, ఏడీ అజీమ్ తెలిపారు. ఈ 21 మందిలో 19 మంది స్కూల్ అసిస్టెంట్లు మ్యాథ్స్‌కు, ఇద్దరు ఫిజికల్ సైన్సుకు విల్లింగ్ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

ముగిసిన అవగాహన సదస్సులు



విజయవాడ స్పోర్ట్స్: గ్లోబల్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో విజయవాడ పీవీపీ మాల్‌లో నిర్వహిస్తున్న చెస్‌పై అవగాహన సదస్సులు ఆదివారం ముగిశాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సుల్లో 250 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. చెస్ గ్రాండ్ మాస్టర్ ఎం. లలిత్‌బాబు, ఇంటర్నేషనల్ మాస్టర్ బాలచంద్ర ప్రసాద్, ఫిడే మాస్టర్ వెంకటకృష్ణకార్తిక్, రాష్ట్ర చాంపియన్ జె.అక్షిత్‌కుమార్ ఈ కార్యక్రమానికి విచ్చేసిన చిన్నారులకు చెస్‌పై అవగాహన కల్పించారు. గ్లోబల్ చెస్ అకాడమీ కార్యదర్శి షేక్ ఖాసీం మాట్లాడుతూ మే నెలలో ప్రతి శని, ఆది వారాల్లో ఈ సదస్సులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ సదస్సుల ద్వారా వెయ్యి మందికి పైగా చెస్‌పై అవగాహన కల్పించామన్నారు.

పార్లమెంట్ భవనం.. అద్భుతం



చిలకలపూడి(మచిలీపట్నం): ఢిల్లీలో ఆదివారం ప్రారంభించిన నూతన పార్లమెంట్ భవనం అద్భుతంగా ఉందని లోక్‌సభ సబార్డినేట్ చైర్మన్, మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గాల పునర్విభజన జరిగి పార్లమెంట్ సీట్లు పెరిగినప్పటికీ కొత్త సభ్యుల రాకకు అనుగుణంగా తీర్చిదిద్దిన తీరును ఆయన కొనియాడారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మంచి దృక్పథం కలిగిన నేత అని, ప్రజాపరిపాలన, సంక్షేమాభివృద్ధి ఫలాలను ప్రజలకు అందించటంలో గొప్ప మనిషి అని పేర్కొన్నారు. తొలిసారిగా నూతన పార్లమెంట్ భవనంలో అడుగుపెట్టడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

బడి తెరిచిన రోజే కానుక

- ఇప్పటికే మండల కేంద్రాలకు చేరిన కానుకలు
- తరగతుల వారీగా కిట్ల విభజన
- జూన్ మొదటి వారంలో ఆయా విద్యాసంస్థలకు చేరే విధంగా ప్రణాళిక

జగనన్న విద్యాకానుక కిట్లు సిద్ధం



విజయవాడ గోడౌన్‌లో విద్యాకానుక వస్తువులను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వేసవి సెలవులు ముగించుకొని పాఠశాలలు తెరిచే సమయానికి విద్యార్థులకు జగనన్న విద్యాకానుకను అందించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని సుమారు 2.22 లక్షల మంది విద్యార్థులకు తొలి రోజే విద్యాకానుకలను అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా అమ్మఒడి, నాడు–నేడు, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన వంటి పథకాలతో పాటుగా జగనన్న విద్యా కానుక విద్యార్థులకు ఎంతో అండగా ఉంటుంది.

రెండు జిల్లాల్లో ఇదీ పరిస్థితి..

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో మొత్తం 2,22,703 మంది విద్యార్థులు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అందులో ఎన్టీఆర్ జిల్లాలో 1,15,674 మంది విద్యార్థులు, కృష్ణాజిల్లాలో 1,07,029 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి సంబంధించి తరగతుల వారీగా వివిధ రకాలుగా పుస్తకాలను, ఇతర స్టేషనరీ, యూనిఫామ్ వంటి వస్తువులను అందించాల్సి ఉంటుంది. ఆయా పాఠశాలల నుంచి ఎంఈవోలు, వారి నుంచి డీఈవోలు అక్కడి సీఎంవోలకు చేరిన లెక్కల ప్రకారం జగనన్న విద్యాకానుకలను విద్యాశాఖ అధికారులు సిద్ధం చేశారు.

ఎనిమిది రకాల వస్తువులు..

ప్రభుత్వ యజమాన్యానికి సంబంధించి వివిధ పేర్లతో నడిచే విద్యా సంస్థల్లోని విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పేరుతో వస్తువులను అందిస్తారు. ప్రభుత్వ విద్యాసంస్థలో అడ్మిషన్ తీసుకునే ప్రతి విద్యార్థి చదువుకు అవసరమైన సామగ్రిని ఉచితంగా అందించేలా ప్రభుత్వం ప్రత్యేకంగా శ్రద్ధ చూపుతోంది. విద్యార్థులకు అందించే జగనన్న విద్యాకానుకలో ఎనిమిది రకాల వస్తువులను ఉంచుతారు. అందులో మూడు జతల యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఇంగ్లిష్ డిక్షనరీ, బెల్ట్, బూట్లు, రెండు జతల సాక్స్, బ్యాగ్‌లో పెట్టి విద్యార్థులందరికీ అందిస్తారు.

జిల్లా	పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
ఎన్టీఆర్	953	1,15,674
కృష్ణా	1371	1,07,029
మొత్తం	2,344	2,22,703

నాణ్యతలో రాజీ పడకుండా..

విద్యార్థులకు అందించే జగనన్న విద్యాకానుకలోని వస్తువుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా అధికారులు కసరత్తు చేశారు. అందులో భాగంగా ఉన్నతాధికారులు వీటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. యూనిఫారం, పుస్తకాలు, బూట్లు తదితర వస్తువుల నాణ్యతలో రాజీ పడకుండా పూర్తి స్థాయిలో వాటిని అందించే ఏర్పాట్లు చేస్తున్నారు.



రెండో తేదీ నుంచి..



జిల్లాలోని 17 మండలాలకు సంబంధించిన విద్యా సంస్థలకు పూర్తి స్థాయిలో జగనన్న విద్యాకానుకలను సిద్ధం చేశాం. వాటిని జూన్ రెండో తేదీ నుంచి ఆయా స్థానిక విద్యాసంస్థలకు చేర వేసేందుకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నాం. పాఠశాలలు తెరిచే సమయానికి పూర్తి స్థాయిలో వస్తువులను అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

– తోట రాంబాబు, చీఫ్ మోనిటరింగ్ ఆఫీసర్, ఎన్టీఆర్ జిల్లా

రెండో వారంలో పంపిణీ..

జూన్ రెండో వారంలో విద్యాసంస్థలు తెరచుకోనున్నాయి. విద్యార్థులు పాఠశాలకు వచ్చిన తొలి రోజే జగనన్న విద్యాకానుకలను అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఆయా విద్యాసంస్థల నుంచి వచ్చిన ఇండెంట్ల ప్రకారం వస్తువులను ఆయా మండల కేంద్రాలకు చేరవేశారు. ఎన్టీఆర్ జిల్లాలోని 17 మండలాలు, కృష్ణా జిల్లాలోని 25 మండల కేంద్రాలకు వీటిని తరలించారు. అక్కడి నుంచి విద్యాసంస్థలకు చేరవేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

చరిత్రను తిరగరాసిన పాలన

- నాలుగేళ్లలో ప్రతి గడపకు సంక్షేమాన్ని అందించిన ప్రభుత్వం
- గూడూరు నుంచి పెడన వరకు మంత్రి జోగి రమేష్ బైక్ ర్యాలీ



వైఎస్సార్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పిస్తున్న మంత్రి జోగి రమేష్

గూడూరు(పెడన): స్వాతంత్ర్య భారతదేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో పరిపాలన అందిస్తున్నారని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం గూడూరు సెంటర్ నుంచి పెడన పట్టణం వరకు పార్టీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. గూడూరులోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ నాలుగేళ్ల పరిపాలనలో ప్రతి గడపకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి అంటే మా వాడు అని అన్ని వర్గాల ప్రజలు చెప్పుకునేలా రాష్ట్రంలో పరిపాలన సాగుతోందన్నారు. మాట ఇస్తే దానిని నిలబెట్టుకునేందుకు ఎందాకైనా వెళ్లే మనసున్న నాయకుడు మన ముఖ్యమంత్రి అన్నారు. అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడాన్ని అడ్డుకున్న పెత్తందార్లకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టు వరకు వెళ్లి పేదల పక్షాన పోరాడి విజయం సాధించిన యోధుడు జగనన్న అన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎన్ని కుయుక్తులు పన్నినా 2024 సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదే విజయమన్నారు. 2019 ఎన్నికలలో సాధించిన 151 స్థానాలకు మించిన సీట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నామన్నారు. పెడన నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ నాయకులు జోగి రాజీవ్, సంగా మధుసూదనరావు, వేముల సురేష్‌రంగబాబు, గొరిపర్తి రవికుమార్, కారుమంచి కామేశ్వరరావు, గరికపాటి రామానాయుడు, బళ్ల గంగయ్య, కొండవీటి నాగబాబు, మహ్మద్ ఖాజా, మైలా రత్నకుమారి పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి జోగి రమేష్

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్ష



విజయవాడలోని సిద్ధార్థ కళాశాల నుంచి పరీక్ష రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు


వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నగరంలో సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. నగరంలోని వివిధ విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షను వివిధ శాఖలు సంయుక్తంగా విజయవంతంగా పూర్తి చేశాయి. నగరంలోని 29 కేంద్రాల్లో 12,358 మంది అభ్యర్థులను యూపీఎస్సీ కేటాయించింది. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకూ పేపర్–1, మధ్యాహ్నం రెండున్నర నుంచి 4.30 గంటల వరకూ పేపర్– 2 పరీక్షలను నిర్వహించారు. ఉదయం పేపర్ –1 పరీక్షకు 12,358 మందికిగాను 6,378 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన పేపర్–2 పరీక్షకు 12,358 మందికిగాను 6,320 మంది అభ్యర్థులు హాజరైనట్లు అధికారులు ప్రకటించారు. అలాగే 58 విభిన్న ప్రతిభావంతులకు పటమటలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ ప్రాంగణాన్ని పరీక్ష కేంద్రంగా కేటాయించారు. అందులో 25 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా పరీక్ష తీరును పర్యవేక్షించారు. రెవెన్యూ, పోలీసు, వైద్యారోగ్య తదితర శాఖల అధికారులు ఈ పరీక్షలు విజయవంతంగా జరిగేందుకు సహకరించారు.

కలెక్టర్, ప్రిన్సిపల్ సెక్రటరీల పరిశీలన..

ప్రిన్సిపల్ సెక్రటరీ బాబు అహ్మద్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ పి. సంపత్‌కుమార్ నగరంలో జరిగిన యూపీఎస్సీ పరీక్ష తీరును ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ నగరంలో యూపీఎస్సీకి సంబంధించి సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించామన్నారు. వివిధ శాఖల సహకారంతో మౌలిక సదుపాయాలను కల్పించి, అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూశామన్నారు.

శాశ్వత మేలు కలిగేట్టు

- చివరి దశకు పులిచింతల గేటు పునర్నిర్మాణ పనులు
- ఆమ్స్‌పైకి రేడియల్ గేటు
- ఎరక్షన్ బ్రాసింగ్ పనులు పూర్తి
- కొనసాగుతున్న వెల్డింగ్ పనులు
- వారంలో అమరిక పూర్తి



పూర్తయిన 16వ నంబర్ రేడియల్‌గేటు నిర్మాణం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు 16వ నంబర్ రేడియల్ గేటు పునర్నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. మరో వారంలో పూర్తవుతాయని ఇంజినీర్లు చెబుతున్నారు. గతంలో వరదల సమయంలో 16 నంబర్ గేటు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. అప్పట్లో వెంటనే స్పందించిన ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతులకు ఆదేశించింది. దీంతో అధికారులు స్టాప్ లాగ్స్ ఎలిమెంట్స్ ఏర్పాటుచేసి గేటును బ్లాక్ చేసి కృష్ణాడెల్టాలో సాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా జలాశయంలో నీటిని నిల్వ ఉంచుతూ వచ్చారు. ఆ తర్వాత శాశ్వత పరిష్కారంగా గేటు పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.18.84 కోట్లు మంజూరు చేసి, పనులను బీకేఎం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ లిమిటెడ్‌కి అప్పగించింది. రెండు నెలలుగా పనులు వేగంగా జరుగుతున్నాయి. నూతన గేటును బిగించేందుకు 100 టన్నుల సామర్థ్యం గల హెవీ లోడెడ్ క్రేన్స్ వినియోగిస్తున్నారు. బీహార్ నుంచి 20 మంది నిపుణులు రోజుకు 10 గంటలకుపైగా శ్రమిస్తున్నారు. కాంక్రీట్ పనులు పూర్తిచేసి ఆమ్స్‌ను జలాశయంపైకి ఎక్కించారు. 300 టన్నుల సామర్థ్యం కలిగిన 16వ నంబర్ రేడియల్ గేటును ఆమ్స్‌పైకి ఎక్కించారు. ప్రస్తుతం వెల్డింగ్ పనులు కొనసాగుతున్నాయి. ఎరక్షన్ అఫ్ ఎంబ్రాసింగ్ పనులు పూర్తిచేసినట్లు ఇంజినీర్లు చెబుతున్నారు. గేటు పునర్నిర్మాణ పనుల వల్ల నిల్వనీరు లీకేజీల ద్వారా వృథా కాకుండా అన్ని గేట్లకు రబ్బరు సీల్స్ వేసే పనులు చేపట్టారు. మొత్తం 24 గేట్లు ఉండగా, ఇప్పటివరకు 8గేట్లకు రబ్బరు సీల్స్ బిగించారు. గేటు నిర్మాణ పనులను ప్రాజెక్టు ఎస్ఈ శ్రీరామకృష్ణ, ఈఈ శ్యాంప్రసాద్, డీఈ అరుణకుమారి, ఏఈలు విక్రమ్, వెంకటరెడ్డి తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

మరో వారం నాలుగుచక్రాల వాహనాలకు నో ఎంట్రీ

భారీ క్రేన్స్‌తో పనులు జరుగుతున్నందున మరో వారం రోజులవరకు ఫోర్ వీలర్ వాహనాలకు ప్రాజెక్టుపై నుంచి వెళ్లేందుకు అనుమతులు లేవని ప్రాజెక్టు ఇంజినీర్లు తెలిపారు. అత్యవసర పరిస్థితులలో అయితే ఉదయం 8 గంటలలోపు ప్రాజెక్టుపై నుంచి తెలంగాణ రాష్ట్రానికి వెళ్లే అవకాశాన్ని కల్పించారు. టూవీలర్ వాహనాలకు ఎలాంటి ఆటంకం లేదని అధికారులు తెలిపారు.

నాడు చెప్పులు.. నేడు దండలు

- టీడీపీ నేతల తీరుతో ఎన్టీఆర్ ఆత్మ క్షోభిస్తోందన్న వక్తలు
- ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్టు, దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ శత జయంతి వేడుక
- భారీగా హాజరైన ఎన్టీఆర్ అభిమానులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పేర్ని నాని. చిత్రంలో ఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని, దర్శకుడు ఆర్జీవీ, ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని, ఎమ్మెల్యే వెలంపల్లి, తెలుగు అకాడమీ అధ్యక్షురాలు లక్ష్మీపార్వతి తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి, పదవిని, పార్టీని లాక్కొని.. ఆయన మరణానికి కారణమైన వారు, ఆ రక్తపు చేతులతోనే నేడు దండలు వేయడం దుర్మార్గమని పలువురు వక్తలు మండిపడ్డారు. అధికారం కోసం చంద్రబాబు ఏమైనా చేస్తాడనేందుకు ఇదే నిదర్శనమని వారు పేర్కొన్నారు. ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్టు, దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ విజయవాడ ఈస్ట్ సమన్వయకర్త దేవినేని అవినాష్ పర్యవేక్షణలో ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బెంజిసర్కిల్ సమీపంలోని ఓ కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఎన్టీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ముఖ్య అతిథిగా హాజరవగా.. తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీపార్వతి, పలువురు సినీ ప్రముఖులు, ఎమ్మెల్యేలు పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు.

మహానాడు కాదు.. మాయనాడు..

ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి, మరణానికి కారణమైన చంద్రబాబు, నేడు ఆయన విగ్రహాలకు దండలు వేస్తుంటే ప్రజలు చూసి నవ్వుకుంటున్నారన్నారు. ఎన్టీఆర్ పేరుతో ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. రాజమండ్రిలో జరిగేది మహానాడు కాదని మాయనాడు అన్నారు. ఆయన మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు.

ఎన్టీఆర్‌కు నిజమైన వారసుడు దేవినేని నెహ్రూ..

ఎన్టీఆర్‌ని అధికారం నుంచి కూలదోసిన చంద్రబాబు నేడు పూల దండలు వేయడం దుర్మార్గమని బందరు ఎమ్మెల్యే పేర్ని నాని అన్నారు. ఎన్టీఆర్ చివరి దశలో కొడుకులు కూడా పట్టించుకోలేదని, దేవినేని నెహ్రూ మాత్రమే ఎన్టీఆర్‌కి అన్నీ తానై నిలిచారన్నారు. ఎన్టీఆర్‌కి నిజమైన వారసుడు నెహ్రూనే అన్నారు. నెహ్రూని మైమరపించేలా అవినాష్ కార్యక్రమాలు చేస్తున్నారని, 2024లో అతని గెలుపును ఆపటం ఎవరి తరం కాదన్నారు.

పాలనా ధోరణి ఒక్కటే..

ఎన్టీఆర్‌కి, సీఎం వైఎస్ జగన్‌కి పాలనలో దగ్గర సంబంధాలు ఉన్నాయని, ఇద్దరూ పేదల గురించే ఆలోచించే వారేనని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. పాలనలో పెనుమార్పులు తీసుకొచ్చిన ఘనత వీరిద్దరిదేనన్నారు. దేవినేని అవినాష్ సమర్థత ఏంటో ఈ సభ ద్వారా అర్థమైందన్నారు.

ఎన్టీఆర్ చివరి కోరిక నెహ్రూ తీర్చారు..

సింహగర్జన విజయవాడలో నిర్వహించాలనేది ఎన్టీఆర్ చివరి కోరికని, ఆయన మరణించిన తర్వాత దానిని విజయవాడలో దేవినేని నెహ్రూ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీపార్వతి పేర్కొన్నారు. ఎన్టీఆర్‌కి అత్యంత నమ్మకస్తుడు దేవినేని నెహ్రూ అని అన్నారు. అధికారాన్ని లాక్కొని, ప్రజల్లోకి వెళ్లకుండా, ఎన్ని అడ్డంకులు సృష్టించారోనని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు.

ఎన్టీఆర్‌ని అవమానించారు..

ఎన్టీఆర్‌కు జరిగిన అవమానం గురించి ప్రజలకు తెలియచెప్పాలనే ఉద్దేశంతోనే తాము ఈ సభ నిర్వహిస్తున్నామని వైఎస్సార్ సీపీ విజయవాడ ఈస్ట్ నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. ఎన్టీఆర్ ఒళ్లో కూర్చుని ఫొటో దిగే అదృష్టం తనకు దక్కిందన్నారు. ఎన్టీఆర్, వైఎస్సార్ సిద్ధాంతాలను అమలు చేస్తున్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. అనంతరం ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోసాని కృష్ణమురళిని సత్కరించారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్క్రీన్‌లలో తొలుత ఎన్టీఆర్ నటించిన చిత్రాల్లోని పాటలు, సన్నివేశాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి. విజయబాబు, నవరత్నాల కమిటీ వైస్ చైర్మన్ నారాయణస్వామి, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్, నాయకులు కడియాల బుచ్చిబాబు, ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు కొరివి చైతన్య, వైద్య విభాగం జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ మెహబూబ్ షేక్, కార్పొరేటర్లు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పోసాని కృష్ణ మురళిని సత్కరిస్తున్న కొమ్మినేని, దేవినేని అవినాష్

కిటకిటలాడిన ఇంద్రకీలాద్రి



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. వేసవి సెలవులు, పెళ్లి ముహూర్తాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఇంద్రకీలాద్రికి వచ్చారు. ఆది దంపతులకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లోనూ ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. ఉదయం 7 గంటల నుంచి రద్దీ కనిపించినప్పటికీ 9 గంటల నుంచి మరింత పెరిగింది. సర్వ దర్శనంతో పాటు రూ. 100, రూ.300, రూ.500 టికెట్ల క్యూలైన్‌లో భక్తులు బారులు తీరి కనిపించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భక్తుల తాకిడి కనిపించడంతో వారికి అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు అరగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. ఎండ వేడితో భక్తులు క్యూలైన్‌లో ఇబ్బందులకు గురి కాకుండా మంచి నీరు, మజ్జిగ పంపిణీ చేశారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత రద్దీ సాధారణంగా కనిపించింది. సాయంత్రం అమ్మవారికి నిర్వహించిన పంచ హారతుల సేవలోనూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంటి ముందు నిలిపిన బైక్ దహనం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):ఇంటి ముందు నిలిపిన తన బైకును గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారని ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదుచేశాడు. బుడమేరు మధ్యకట్ట ప్రాంతానికి చెందిన చల్లా నాగదుర్గామల్లేశ్వరరావు ఆటో మొబైల్ షాపులో పనిచేస్తుంటాడు. ఏడాది క్రితం బైక్ కొనుగోలు చేశాడు. రోజూలానే ఈ నెల 26వ తేదీన తన పనులు ముగించుకొని రాత్రి ఇంటి ముందు బైకు పార్క్ చేశాడు. తిరిగి 27వ తేదీ ఉదయం నిద్రలేచి చూడగా బండి కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతకగా బుడమేరు కాలువ రైల్వే ట్రాక్ పక్కన ఓ బైకు పూర్తిగా కాలిపోయి కనిపించింది. దగ్గరకు వెళ్లి చూడగా తన బైకు నెంబర్ ప్లేట్ సగం కాలి కనిపించింది. దీంతో తన బైకును ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారని గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యాసిడ్ తాగిన యువకుడి మృతి

పెనమలూరు: యాసిడ్ తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు ఆదివారం మృతి చెందాడు. సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ జిల్లా నారాయణపేట నల్లకుంట తండాకు చెందిన ఆగోత్ తుక్యానాయక్ కుమారుడు ఆగోత్ వినోద్ (20) విజయవాడలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. జీతం డబ్బులు కొంత మందికి అప్పుగా ఇచ్చాడు. అప్పు తీసుకున్నా వారు తిరిగి డబ్బులు ఇవ్వలేదు. దీంతో మనస్తాపం చెందిన వినోద్ ఈ నెల 20వ తేదీన యాసిడ్ తాగాడు. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కారు, ట్రాక్టర్ ఢీకొని నలుగురికి గాయాలు

కృత్తివెన్ను:కారు, ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి గాయాలైన ఘటన మండల పరిధిలోని సీతనపల్లి వద్ద 216 జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. తిరుపతి నుంచి మొగల్తూరు వెళుతున్న కారు, రివర్స్‌లో కృత్తివెన్ను వైపు వస్తున్న ట్రాక్టరు ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులో 8 మంది ప్రయాణిస్తున్నారు. అందులోని ముగ్గరితో పాటు ట్రాక్టర్ డ్రైవర్ గాయపడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరుకు చెందిన కుటుంబం పెద్దతిరుపతిలో మొక్కులు తీర్చుకొని వస్తున్నట్లు సమాచారం. ఈ ప్రమాద ఘటనలో ఇద్దరు వ్యక్తుల కాళ్ల చేతులకు ఫ్యాక్చర్ అయినట్లు తెలిసింది. బాధితులను మచిలీపట్నం ఆసుపత్రికి తరలించారు దీనిపై ఎలాంటి కేసు నమోదు కాలేదని కృత్తివెన్ను పోలీసులు తెలిపారు.

స్విమ్మింగ్‌తో మానసిక, శారీరక ఆరోగ్యం



ఈత శిక్షణలో బహుమతులు అందుకున్న చిన్నారులతో కలెక్టర్ ఢిల్లీరావు తదితరులు

కలెక్టర్ ఢిల్లీరావు

విజయవాడ స్పోర్ట్స్/గాంధీనగర్:మానసిక, శారీరక ఆరోగ్యం, ఆత్మ విశ్వాసాన్ని పెంచడంతో పాటు విస్తృతమైన ఉపాధి అవకాశాలు పెంచేందుకు స్విమ్మింగ్ దోహదం చేస్తుందని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. అక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కృష్ణానది కరకట్టపై నెల రోజులుగా నిర్వహిస్తున్న స్విమ్మింగ్ శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ ఏడాదిలోని అన్ని కాలాల్లోనూ ఒకే శీతోష్ణస్థితి ఉండే కృష్ణానది ఎన్టీఆర్ జిల్లాలో ఉండటం జిల్లాకే గర్వకారణమని చెప్పారు. కృష్ణానదిలో స్విమ్మింగ్ పోటీలు నిర్వహణకు అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. స్విమ్మింగ్ పోటీల్లో రాణించిన వారికి నేవీ, వైమానికదళం, మిలటరీతో పాటు అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో అపారమైన ఉద్యోగ అవకాశాలు దక్కుతాయని తెలిపారు. జిల్లాలో అంతర్జాతీయ స్విమ్మర్లను తయారు చేసేందుకు కోచ్‌లు కృషి చేయాలని కోరారు. అక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గోకరాజు గంగరాజు మాట్లాడుతూ ఈ శిబిరం ద్వారా 300 మందికి స్విమ్మింగ్‌లో శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా శిక్షణ కొనసాగించిన కోచ్‌లను ఆయన అభినందించారు. శిక్షణలో ప్రధాన భూమిక పోషించిన కోచ్‌లు, వలంటీర్లకు కలెక్టర్ ఢిల్లీరావు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి మందపాటి లక్ష్మీనరసింహరాజు, కోశాధికారి వీసం వెంకటసుబ్బారావు, ఉపాధ్యక్షుడు లింగిపల్లి రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి ఎం.ఓబుల్‌రెడ్డి, ప్రతినిధులు అప్పలనాయుడు, రామచంద్రరావు, జనార్ధనమూర్తి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వెన్నెముక చికిత్సలపై అవగాహన అవసరం

సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్



జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): వెన్నెముక సమస్యలు, వాటికి నిర్వహించే శస్త్ర చికిత్సలపై పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ అన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్స్ విభాగం జోనల్ సీఎంఈ (కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్) ఆదివారం సిద్ధార్థ వైద్య కళాశాలలో నిర్వహించారు. డాక్టర్ సుధాకర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు స్పైన్ సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతుందని చెప్పారు. వారికి అత్యాధునిక వైద్యం అందించేందుకు పీజీలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ సదస్సులో స్పైన్ ప్రాబ్లమ్స్, డిస్క్ ప్రొలాప్స్‌కు శస్త్ర చికిత్సలు, వెన్నెముకలో కణితులు, టీబీ, వాటి శస్త్ర చికిత్సల గురించి నిపుణులు విశ్లేషణాత్మకంగా వివరించారు. వివిధ అంశాలపై డాక్టర్ సి.శ్యామ్‌కుమార్, డాక్టర్ సి.హనుమంతరావు, డాక్టర్ వీవీ నారాయణరావు, డాక్టర్ నరేష్, డాక్టర్ కౌశిక్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శ్రీకాంత్ అవగాహన కలిగించారు. ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ డి.వెంకటేష్, డాక్టర్ అపర్ణ, డాక్టర్ సోఫియా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో బనాయించిన అక్రమ కేసులు ఎత్తివేయాలి



మాట్లాడుతున్న పాలేటి ఉమామహేశ్వరరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గత టీడీపీ ప్రభుత్వంలో దళితులపై బనాయించిన అక్రమ కేసులు ఎత్తివేయాలని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం తీర్మానించింది. విజయవాడలోని ఐలాపురం హోటల్లో సమతా సైనిక్ దళ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై తీర్మానాలు చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి ఉమామహేశ్వరరావు మీడియాతో మాట్లాడారు. 2014లో టీడీపీ అధికారంలో ఉండగా ఎస్సీ, ఎస్టీలపై అనేక దాడులు జరిగాయని గుర్తుచేశారు. గరగపర్రు, రావూరు, పెదగొట్టిపాడు, ఆగిరిపల్లి ఉద్యమాల్లో ఎస్సీ, ఎస్టీలపై బనాయించిన అక్రమ కేసులు, రౌడీషీట్లు ఎత్తివేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని 41 (ఎ)సీఆర్‌పీసీ నుంచి మినహాయించాలని విన్నవించారు. దళితుల భూములను అక్రమంగా కబ్జా చేస్తున్నారని వస్తున్న ఫిర్యాదులపై రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయిలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్ర, క్రమ శిక్షణా సంఘం చైర్మన్ గొల్ల వరప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి మెండెం శ్రీనివాసరావు, శ్వేతా బదుమూరి, సలహాదారు డాక్టర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీల కోసం 5,994 మంది దరఖాస్తు

- అత్యధికంగా ఎస్‌ఏ మ్యాథ్స్‌లో 515 మంది టీచర్లు బదిలీకి సంసిద్ధత
- 30 వ తేదీ ఒక్క రోజు మాత్రమే అభ్యంతరాలు స్వీకరణ



డీఈవో కార్యాలయం

పెడన: బదిలీలు కోసం 5,994 మంది ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులు 187 మంది ఉన్నారు. లాంగ్వేజ్ పండిట్ హిందీ 29, తెలుగు 56, పీఈటీలు 45, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 242, స్కూలు అసిస్టెంట్లు క్యాడర్‌లో ఇంగ్లిష్ 383, హింది 297, సంస్కృతం 5, తెలుగు 352, ఉర్దూ 6, బయోలాజికల్ సైన్సు 308, గణితం 515, ఫిజికల్ డైరెక్టర్ 142, ఫిజికల్ సైన్సు 310, సోషల్ 347 మంది బదిలీలు కోసం దరఖాస్తు చేశారు. అలాగే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు బదిలీలు కోసం 2,770 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

సీనియార్టీ జాబితాలు సిద్ధం చేసేలా...

విద్యాశాఖలో బదిలీల షెడ్యూల్ ప్రకారం ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాకు రెండు రోజులు సమయం ఇచ్చారు. ఆదివారం రాత్రి గానీ 29న ఉదయం గానీ సీనియార్టీ జాబితాలు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. అప్పీలు చేసుకునే అవకాశం 30వ తేదీ ఒక్క రోజు మాత్రమే ఇచ్చారు. ఈ అప్పీలు కూడా ఆన్‌లైన్‌లోనే చేయాల్సి ఉండటంతో సర్వర్ బిజీగా ఉంటుందనే ఆవేదన ఉపాధ్యాయుల్లో నెలకొంది. ఉపాధ్యాయుల సందేహాలు నివృత్తి చేయడానికి ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ఎన్టీఆర్ డీఈవో కార్యాలయంలో, కృష్ణా డీఈవో మచిలీపట్నం కార్యాలయంలో ప్రత్యేక సెల్‌లను ఏర్పాటు చేశారు. 24 గంటలూ సిబ్బందిని అందుబాటులో ఉంచి ఉపాధ్యాయుల సందేహాలను నివృత్తి చేసేలా పటిష్ఠ చర్యలు తీసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో చంద్రహారిష్ 9398044628, శివశంకర్ 7981456441లను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు. కృష్ణా జిల్లాలో ఎండీ మోమిన్ 9490050226, ఎండీ ఇక్బాల్ 9491727274, ఎండీ హిదయ్‌తుల్లా 9553805060, అశోక్ చక్రవర్తి 9246924250 నంబర్లలో సంప్రదించవచ్చు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ మేనేజ్‌మెంట్లు వారీగా ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లకు సంబంధించి సీనియార్టీ జాబితాలు విడుదలకానున్నాయి.

తప్పనిసరిగా బదిలీ అయ్యేవారు....

ఒకే పాఠశాలలో ఐదు విద్యాసంవత్సరాలు పూర్తి చేసుకున్న గ్రేడ్–2 హెచ్‌ఎంలు, ఎనిమిది విద్యా సంవత్సరాలు ఒకే పాఠశాలలో పూర్తి చేసుకున్న స్కూలు అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు తప్పనిసరిగా బదిలీ కానున్నారు. వీరిలో ఎవరైనా పదవీ విరమణ వయస్సు ఇంకా రెండేళ్లు మాత్రమే ఉంటే వారికి, దివ్యాంగులైన వారికి మాత్రం మినహాయింపు ఇచ్చారు.

పారదర్శకంగా జరిగేలా చర్యలు



సాధారణ బదిలీల ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లో జరుగుతుంది. పారదర్శకంగా షెడ్యూల్ ప్రకారం చేస్తున్నాం. సీనియార్టీ జాబితాలకు రెండు రోజులు సమయం ఇచ్చాం. ఒక పక్క ఉపాధ్యాయుల పదోన్నతులు, హైస్కూలు ప్లస్‌లలో పీజీటీలు నియామకం, సాధారణ బదిలీలకు సంబంధించిన దరఖాస్తులు పరిశీలన వంటి షెడ్యూల్‌తో తలమునకలయ్యాం. బదిలీలకు సంబంధించి ఏమైనా సందేహాలుంటే ప్రత్యేక సెల్ ఏర్పాటుచేశాం. బదిలీలకు సంబంధించి ఏ చిన్న సమాచారం విడుదలైనా తక్షణం వారికి చేరిపోతుంది. అందుకు ఉపాధ్యాయ సంఘ నాయకులు కూడా పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు.

తాహెరాసుల్తానా, నోడల్ అధికారి, కృష్ణా, డీఈవో, మచిలీపట్నం

అగ్ని ప్రమాద ఘటనపై కేసు నమోదు

పెనమలూరు:షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించి రూ.ఐదు లక్షల ఆస్తి నష్టం వాటిల్లిన ఘటన తాడిగడపలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... ఉయ్యూరు టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కౌసర్ జహాన్ అనే మహిళ కానిస్టేబుల్‌గా పని చేస్తోంది. ఆమె కొద్ది నెలల కిందట తాడిగడప పరిధిలో ఇల్లు కొనుగోలు చేసింది. ఆ ఇంట్లో గ్రౌండ్ ఫ్లోర్‌ను కారు డ్రైవర్ షేక్ సుభానికి అద్దెకు ఇచ్చింది. ఈ నెల 26వ తేదీన ఇంటిపై పోర్షన్‌లో అద్దెకు ఉండే వారు కౌసర్ జహాన్‌కు ఫోన్ చేసి సుభాని ఉంటున్న గ్రౌండ్ ఫ్లోర్‌లో పొగలు వస్తున్నాయని తెలిపారు. దీంతో వెంటనే ఆమెతో పాటు భర్త సలీంబాషా వచ్చి చూడగా ఇంట్లో నుంచి మంటలు వచ్చాయి. వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వచ్చి మంటలు ఆర్పారు. ఈ ఘటన పై బాధితురాలు జహార్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అద్దెకు ఉంటున్న సుభాని ఇంటికి తాళం వేసి వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగిందని, ఇంట్లో సీలింగ్, తలుపులు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయి తాను నష్టపోయాయని పేర్కొంది.

బైక్ ఢీకొని యువకుడి దుర్మరణం



తోట్లవల్లూరు:బైక్ ఢీకొన్న ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలైన ఘటన మండలంలోని రొయ్యూరు సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. గన్నవరం మండలం తెంపల్లి గ్రామానికి చెందిన నడ్డి వంశీ (18) చోడవరం ఇసుక ర్యాంపు వద్ద తన బాబాయికి భోజనం క్యారేజీ ఇవ్వటానికి వెళ్లాడు. చోడవరం నంచి బైక్‌పై రొయ్యూరు తిరిగి వస్తుండగా కాలిబాట వంతెన సమీపంలో అవనిగడ్డ వైపు నుంచి కె.ప్రతాప్ అనే వ్యక్తి బైక్‌పై అతి వేగంగా వచ్చి వంశీ ప్రయాణిస్తున్న బైక్‌ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో వంశీ తలకు బలమైన గాయాలయ్యాయి. హుటాహుటిన 108 వాహనంలో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గంలో మృతి చెందాడు. ప్రమాద ప్రాంతాన్ని ఎస్‌ఐ రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



కృష్ణలంక(విజయవాడతూర్పు):ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కృష్ణానదిపై ఉన్న రైల్వే ట్రాక్ కింద ఇసుకలో ఒక మృతదేహం ఉందని ఆదివారం పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని మగ వ్యక్తిగా నిర్ధారించారు. మృతదేహం వద్ద లభించిన ఫోన్ ఆధారంగా మృతుడి వివరాలు సేకరించారు. మృతుడు కోనసీమ జిల్లాలోని పి.గన్నవరం గ్రామానికి చెందిన పందిరి వెంకటరమణ (43)గా గుర్తించారు. రెండు వారాల క్రితం గుంటూరులో నిర్మాణంలో ఉన్న ఒక మిల్లులో కూలీ పనికి వెళ్లాడు. తిరిగి తన గ్రామానికి వెళ్లే క్రమంలో శనివారం రాత్రి గుంటూరు నుంచి రాజమండ్రికి రైలులో బయలుదేరాడు. రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

క్రీడలతో మనిషిలో పోటీతత్వం

జిల్లా ఎస్పీ జాషువా



విజేతలైన సీసీ లెవన్స్ జట్టుతో పోలీస్ అధికారులు

గుడివాడ టౌన్: క్రీడలు మనిషిలో పోటీతత్వాన్ని, శారీర దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని జిల్లా ఎస్పీ పి.జాషువా అన్నారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకుని స్టేడియంలో నిర్వహించిన టి–20 నాక్ అవుట్ ఓపెన్ క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ స్టేడియం క్రీడలను ప్రోత్సహించడానికి చూపుతున్న శ్రద్ధ అభినందనీయమని చెప్పారు. ప్రతి ఏడాది వేల మంది విద్యార్థులకు 15 రకాల క్రీడల్లో శిక్షణ ఇస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేసిన ఘనత స్టేడియం నిర్వాహకులు, కోచ్‌లకే దక్కుతుందని తెలిపారు. ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో కొన్ని క్రీడలకు ప్రాధాన్యం లేదని వాటిని సైతం అభివృద్ధి చేసి అంతర్జాతీయ పోటీలకు క్రీడాకారులను సిద్ధం చేయాలని సూచించారు. మే 10వ తేదీ డీఎస్పీ పి.శ్రీకాంత్ ఈ క్రీడలను ప్రారంభించగా ముగింపు కార్యక్రమంలో ఎస్పీ జాషువా పాల్గొనడం అభినందనీయం అని పాలకవర్గ ఉపాధ్యక్షుడు పాలేటి శివ సుబ్రహ్మణ్యేశ్వరరావు (చంటి) అన్నారు. మొత్తం 32 టీమ్‌లు పాల్గొనగా ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో సీసీ లెవన్స్ విజయవాడ జట్టు వర్సెస్ బాజీ లెవన్స్ గుడివాడ జట్టుతో తలపడగా మొదట బ్యాటింగ్ ప్రారంభించిన బాజీ లెవన్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్‌లలో 117 పరుగులు చేయగా సీసీ లెవన్స్ జట్టు 16 ఓవర్‌లలో 118 పరుగులు చేసి విజేతగా నిలిచారు. విజేతలైన సీసీ లెవన్స్ జట్టుకు రూ.50 వేలు, రన్నర్స్ బాజీ లెవన్స్ జట్టుకు రూ.30 వేలు నగదు బహుమతి అందజేశారు. ఈ క్రీడల్లో మ్యాన్ ఆఫ్ ది ఫైనల్స్ అనంత్ కార్తికేయ, బెస్ట్ బ్యాట్స్‌మెన్ అనంత్ కార్తికేయ, బెస్ట్ బౌలర్ కె. కృష్ణకాంత్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ బండారు అయ్యప్పలు దక్కించుకున్నారు. విజయవాడ సీపీ టీకే రాణా, ఐజీ సునీల్‌కుమార్ నాయక్, డీఎస్పీ శ్రీకాంత్, స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ తెలుగు ప్రజల ఆస్తి



ఎన్టీఆర్ చిత్ర సంచికను ఆవిష్కరిస్తున్న ఎల్‌బీ శ్రీరామ్, తమ్మారెడ్డి భరద్వాజ, గజల్ శ్రీనివాస్ తదితరులు

- సేవా కార్యక్రమాల కోసం ఎన్టీఆర్ ఫౌండేషన్ ఏర్పాటు
- సిద్ధార్థ ఆడిటోరియంలో ఘనంగా ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు



మాట్లాడుతున్న దేవినేని అవినాష్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) తెలుగు ప్రజలందరి ఆస్తి అని పలువురు వక్తలు కొనియాడారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల విజయవాడ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సిద్ధార్థ ఆడిటోరియంలో ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు నిర్వహించారు. సినీ నటుడు ఎల్.బి.శ్రీరామ్ విశిష్ట అతిథిగా హాజరై మాట్లాడారు. తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ ఎప్పటికీ నిలిచి ఉంటారని చెప్పారు. చిన్నతనంలో తాను గోళీలు ఆడుకునే వయస్సులో ఎన్టీఆర్ చిత్రాలను చూశానని, ఇప్పుడు జుట్టు మొత్తం తెల్లబడినా ఆయన సినిమాలే చూస్తున్నానని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ మాట్లాడుతూ ఎన్టీఆర్ ఏ ఒక్క పార్టీకో, కులానికో సంబంధించిన వ్యక్తి కాదని తెలిపారు. తెలుగు ప్రజలందరూ గొప్పగా భావించాల్సిన వ్యక్తి అన్నారు. చిన్నప్పుడు ఎన్టీఆర్ ఒడిలో కూర్చొని ఆడుకునే అదృష్టం తనకు కలిగిందని అవినాష్ గుర్తు చేసుకున్నారు. సినీ డైరెక్టర్ తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ కలిసి ఒకే వేదికపై ఎన్టీఆర్ జయంతి వేడుకలను నిర్వహించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎన్టీఆర్ ఏ రోజు అవార్డుల కోసం తపన పడలేదన్నారు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్‌కు మరణం లేదని, ఆయన నిష్క్రమించారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ గొప్పతనాన్ని వివరిస్తూ గజల్ శ్రీనివాస్ గజల్స్ పాడి వినిపించారు. సభ అనంతరం ప్రముఖ పారిశ్రామిక వేత్త మలినేని నారాయణ ప్రసాద్, మిమిక్రీ ఆర్టిస్ట్ సెల్విస్టర్‌ను సత్కరించారు. ఎన్టీఆర్ ఛాయా చిత్ర సంచికను అతిథులు ఆవిష్కరించారు. సేవా కార్యక్రమాల నిర్వహణ కోసం ఎన్టీఆర్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు ప్రకటించారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. సభ ప్రారంభానికి ముందుగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉడా మాజీ చైర్మన్ తూమాటి ప్రేమ్‌నాథ్ అధ్యక్షతన జరిగిన సభలో మాజీ మంత్రులు వసంత నాగేశ్వరరావు, వడ్డే శోభనాద్రీశ్వరరావు, యేర్నేని సీతాదేవి ఎన్టీఆర్‌తో తమకున్న పరిచయాల గురించి వివరించారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సీపీఎం నాయకుడు సీహెచ్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలాశయంలో మునిగి విద్యార్థి మృతి



సాయిరాఘవరెడ్డి

విజయపురిసౌత్: స్నేహితులతో కలిసి సాగర్ జలాశయంలోకి స్నానానికి వెళ్లిన ఆ యువకుడి కేరింతలు అంతలోనే ఆర్తనాదాలయ్యాయి. చూస్తుండగా నీటి సుడి మృత్యురూపమెత్తి ముంచేసింది. ఈ హృదయ విదారక ఘటన ఆదివారం నాగార్జునసాగర్‌లోని కృష్ణా జలాశయంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం డోకిపర్రుకు చెందిన పురిటిపాటి సాయి రాఘవరెడ్డి(17) మాచర్ల మండలం విజయపురిసౌత్‌లోని ఏపీఆర్‌జేసీ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం సీఈసీ చదువుతున్నాడు. ప్రస్తుతం సెలవులైనా బెటర్‌మెంట్ పరీక్షలు రాసేందుకు కళాశాలకు వచ్చాడు. ఆదివారం మధ్యాహ్నం ఐదుగురు విద్యార్థులతో కలిసి కృష్ణానదికి స్నానానికి వెళ్లాడు. స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు సాయిరాఘవరెడ్డి నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు కాపాడే యత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో సాయి రాఘవరెడ్డి మృతి చెందాడు. మృతుడి తండ్రి కోటిరెడ్డి హైదరాబాద్‌లో ప్రైవేట్ క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలి



ఆటోనగర్(విజయవాడతూర్పు): రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉన్నప్పుడే రౌడీషీట్ ఎత్తివేస్తామని పటమట సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రౌడీషీటర్లు నేరాల్లో పాల్గొని తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. క్షణికావేశంలో చేసిన తప్పును సరిదిద్దుకోవడం మీ చేతుల్లోనే ఉందని చెప్పారు. గొడవలు, అల్లర్లకు దూరంగా ఉండాలన్నారు. ఎక్కడైనా సంఘటనలు చోటు చేసుకుంటే పోలీసులకు తక్షణమే సమాచారం ఇవ్వాలని కోరారు. మంచిగా జీవించి మీ కుటుంబాల అభివృద్ధికి కృషి చేసినప్పుడే మిమ్ములను సమాజం గౌరవిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



ఆటోనగర్(విజయవాడతూర్పు): రామలింగేశ్వరనగర్ పడవల రేవు సెంటర్‌లో వల్లూరి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయడంలో ఆనందం ఉంటుందన్నారు. ఎండలు పెరుగుతుండటంతో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో భీమవరపు సీతామహాలక్ష్మి, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని వినతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఏపీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ స్టాఫ్ నర్సెస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఏ.వి.నాగేశ్వరరావు కోరారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవం భవన్‌లో ఆదివారం ఎన్‌హెచ్‌ఎం స్టాఫ్ నర్సెస్ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సమాన పనికి సమాన వేతనం, మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. లేకుంటే ఉద్యోగులందరూ ఉద్యమం చేపట్టేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ నగర కమిటీ ఎన్నిక

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సమాజంలో పెరుగుతున్న అసమానతలకు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) నాయకుడు వి.శ్రీనివాసరావు చెప్పారు. సున్నపుబట్టీల సెంటర్‌లోని రామనర్సయ్య భవన్‌లో పీడీఎస్‌యూ 12వ నగర మహాసభ ఆదివారం జరిగింది. శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని అలవరచుకోవాలని చెప్పారు. సీపీఐ ఎం.ఎల్ న్యూడెమొక్రసీ నగర కార్యదర్శి పోలారి, పీడీఎస్‌యు నాయకులు ఏ.రవిచంద్ర, ఐ.రాజేష్, పి.మల్లిక్‌తో పాటుగా పీడీఎస్‌యూ నగర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సభ అనంతరం పీడీఎస్‌యూ నగర అధ్యక్షురాలిగా కె.సింధూర, ప్రధాన కార్యదర్శిగా ఎల్‌డి.కృష్ణతో పాటుగా మరో 11 మందితో నూతన నగర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

అంకమ్మతల్లి శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి కుంకుమ, శ్రీచక్రార్చనలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం

పెనమలూరు:గోసాల వైకుంఠపురంలో అమ్మవారి ఆలయ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ నేత, గ్రామ సర్పంచ్ సంగెపు శ్రీనివాసరావు ఆర్థిక సాయం అందించారు. ఆలయ కమిటీ తెలిపిన వివరాల ప్రకారం... వైకుంఠపురంలో నిర్మాణం చేస్తున్న ఆలయానికి సర్పంచ్ శ్రీనివాసరావు రూ.70 వేలు ఆర్థిక సాయం అందించారన్నారు. సర్పంచ్ చొరవతో ఎంబీఎంఆర్ సంస్థ మరో రూ.25 వేలు ఆర్థిక సాయం ఇచ్చిందన్నారు. అమ్మవారి ఆలయ నిర్మాణానికి ఎటువంటి సాయమైన సర్పంచ్ అందిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు ఆకుల సుశీల, ఝాన్సీ, కృష్ణ పలువురు పాల్గొన్నారు.

పాలిక్లినిక్ రోడ్డుకు అదనపు హంగులు

- కోటి రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు
- సైకిల్ ట్రాక్ ఏర్పాటుకు చర్యలు



పాలిక్లినిక్ రోడ్డులో జరుగుతున్న పనులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): స్థానిక పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డుకు కార్పొరేషన్ అధికారులు అదనపు హంగులు అద్దుతున్నారు. వర్షం వచ్చినప్పుడు గతంలో ఈ రోడ్డుపై నీరు అధిక మొత్తంలో చేరి చాలా సమయం రోడ్డుపైనే నిల్వ ఉండేది. వర్షం నీటికి తోడుగా మురుగు కాలువలో నీరు, భూగర్భ డ్రైనేజీ నీరు కూడా తోడై రోడ్డుపైనే ప్రవహించేవి. ఆ నీటిలో నుంచే వాహనాలతో పాటుగా పాదచారులు సైతం రాకపోకలు సాగించే వారు. ఈ సమస్యను పరిష్కరించడానికి మదర్ థెరిస్సా జంక్షన్ నుంచి మైనేనీ జంక్షన్ వరకు కోటి రూపాయల వ్యయంతో ప్రధాన మురుగునీటి కాలువను నిర్మాణం చేశారు. దీనితో ఇప్పుడు ఎంత వర్షం కురిసినా ఈ రోడ్డుపై చుక్క వర్షం నీరు కూడా నిలబడని పరిస్థితి.

త్వరితగతిన పనులు..

ప్రస్తుతం ఈ రోడ్డులో ఇటీవలే డివైడర్‌పై కొత్తగా మొక్కలు పెట్టి అందంగా ముస్తాబు చేశారు. రోడ్డునకు రెండు వైపులా, జంక్షన్ల దగ్గర జీబ్రా లైన్స్ వేశారు. ఇప్పుడు తాజాగా ఈ రోడ్డునకు రెండు వైపులా అందంగా ఫుట్‌పాత్‌ను నిర్మాణం చేస్తున్నారు. అందులో భాగంగా ఈ రోడ్డు అంచును తవ్వి కంకరుతో చదును చేసే పనులు జరుగుతున్నాయి. ఈ ఫుట్‌పాత్‌పై అందమైన సిమెంట్ బిళ్లల(ప్లేవర్ బ్లాక్స్)ను అమర్చనున్నారు. దీనివల్ల రోడ్డు అందంగా కనిపించడమే కాకుండా ఏదైనా పైపులైను మరమ్మతులు చేయాలన్నా, కొత్తగా పైపులు, కేబుల్స్ వేయాలన్నా రోడ్డును పగలకొట్టకుండా ఈ సిమెంట్ బిళ్లలను తొలగించి పనులు పూర్తి అయిన తర్వాత తిరిగి అమర్చవచ్చు. దీనివల్ల పైపులు, కేబుల్స్ అమర్చే పనులు త్వరితగతిన పూర్తి కావడమే కాకుండా రోడ్డును తవ్వి మళ్లీ పూడ్చడం కోసం వెచ్చించే ప్రజాధనం వృథా అవ్వదు. దీని కోసం కోటి రూపాయల అంచనా వ్యయంతో పనులు చేపట్టారు. ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రోడ్డునకు మరో వైపున సైకిల్ ట్రాక్ కోసం ప్రత్యేకంగా రోడ్డు మార్జిన్స్‌లో రోడ్డు నిర్మాణం చేయనున్నారు.



ఫుట్‌పాత్‌పై అమర్చడానికి తెచ్చిన రాళ్లు



ప్రత్యేక ఆకర్షణగా డివైడర్‌పై మొక్కలు

ఆరోగ్యకర సమాజ స్థాపనకు కృషి



వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న డాక్టర్ గౌతమ్‌రెడ్డి తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజలు ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర సమాజ స్థాపనకు కృషి చేయాలని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతమ్‌రెడ్డి సూచించారు. స్థానిక సత్యనారాయణపురం భగత్ సింగ్ రోడ్డులోని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం గరుడ కంటి, దంత వైద్యశాల ఆధ్వర్యాన ఉచిత వైద్యశిబిరం జరిగింది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వైద్యశిబిరాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నారని చెప్పారు. తాము ఇప్పటికే స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి 5 వేల ఐఓఎల్ ఆపరేషన్స్ చేయించామన్నారు. ప్రతీ ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని సూచించారు. గరుడ కంటి, దంత వైద్యశాల నిర్వాహకులు శ్రీహర్ష, ఇబ్రహీం మాట్లాడుతూ.. తమ వంతు బాధ్యతగా తాము ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం 300 మందికి కంటి వైద్యులు నారాయణ, శ్రీ దివ్య దంత వైద్యులు ప్రకాష్ ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కమ్మిలి రత్నకుమార్, బల్లం కిషోర్, ఎం.ప్రభు, పి.రాజేష్, శంకర్ రాజు, గోవింద్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిరుపేదలను ఆదుకోవడం, సమాజ సేవ చేయడం ఎంతో పుణ్యమని... ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ తెలిపారు. వాసవీ క్లబ్ విజయవాడ పాయకాపురం వారి ఆధ్వర్యంలో పాయకాపురం పెట్రోల్‌బంకు వద్ద ఆదివారం 2 వేల మందికి మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న డెప్యూటీ మేయర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్నాయని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పాదచారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే నగర వ్యాప్తంగా చలివేంద్రాలను ఏర్పాటుచేసిందన్నారు. వాసవీ క్లబ్ వంటి స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని చెప్పారు. క్లబ్ జోన్ చైర్మన్ పందిరి బాల వెంకట సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ఈ వేసవికాలమంతా తమ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి రోజూ మజ్జిగ పంపిణీ చేస్తున్నామన్నారు. క్లబ్ సభ్యులు పెరుమాళ్ల హరినాథ్, పందిరి లక్ష్మీ పద్మావతి, డి.రామప్రసాద్, రావూరి ప్రసాద్, నారాయణ, సుబ్బారావు పాల్గొన్నారు.

ఠాగూర్ గ్రంథాలయంలో సరదా లెక్కలపై శిక్షణ



విద్యార్థులకు గణితంలో మెలకువలు నేర్పిస్తున్న ప్రచారక్ విక్రమ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పౌరగ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ఠాగూర్ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు సరదా లెక్కలు, గమ్మత్తులు, గణిత చమత్కారాలు నేర్పించారు. శిక్షణలో పాల్గొన్న హైదరాబాద్‌కు చెందిన శాస్త్ర ప్రచారక్ విక్రమ్‌చే విద్యార్థులకు గణితంపై అవగాహన కార్యక్రమం జరిగింది. వింత చదరం, పుట్టిన తేదీ కనిపెట్టడం, తదితర గమ్మత్తు గణితం విద్యార్థులకు నేర్పించారు. భౌతిక శాస్త్రంలోని అనునాదం, ఎలక్ట్రానిక్ కిట్స్ చేయడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉత్సాహంగా 3 గంటల పాటు శిక్షణ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన చానల్స్ ద్వారా పాఠశాల విద్యార్థులకు 24 గంటలు పాఠ్యాంశాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఎవరైనా ప్రదర్శనశాలలకు వెళ్తే వాటితో పాటు ఆ ప్రాంతంలో ఉన్న గ్రంథాలయాన్ని కూడా సందర్శించాలని సూచించారు. లైబ్రేరియన్ రమాదేవి మాట్లాడుతూ కాంపౌండ్ నౌన్స్, టంగ్ ట్విస్టర్‌లో వరల్డ్ రికార్డు సాధించేలా వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులను సిద్ధం చేస్తున్నామన్నారు. శ్రీనివాస శర్మ ఇంగ్లిషులో మంచి శిక్షణనిస్తున్నారన్నారు. అనంతరం గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ ప్రచారక్ విక్రమ్‌ను సత్కరించారు. లైబ్రేరియన్స్, సిబ్బంది వై.ధనలక్ష్మి, కుమార్, ఫణిబాబు, గోపాలరావు, దుర్గాంబ, అధ్యాపకులు శ్రీనివాస శర్మ, టి.సునీత, పిల్లి నాగమణి పాల్గొన్నారు.

దాడి, బెదిరింపులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువకునితో పాటు అతని తల్లిదండ్రులపై దాడి చేయడమే కాకుండా బెదిరింపులకు పాల్పడిన వారిపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రైజర్‌పేట చర్చి ప్రాంతానికి చెందిన సోముపాక శరత్ చంద్ర(27) వెల్డింగ్ పనులు చేస్తుంటాడు. ఈ నెల 26వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో వైఎస్సార్ కాలనీ నుంచి తిరిగి వస్తున్న శరత్‌చంద్ర, అతని స్నేహితుడు కిరణ్‌లకు ఎర్రకట్ట రోడ్డులో కొలగాని అశోక్, దేవా మరి కొంత మంది ఎదురుపడ్డారు. కారణం లేకుండా ఇద్దరిపై దాడి చేశారు. ఈ విషయం తెలుసుకుని అక్కడకు వచ్చిన శరత్‌చంద్ర తల్లిదండ్రులపై కూడా దాడి చేశారు. 27వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో ఉన్న శరత్‌చంద్రపై అశోక్ మరో నలుగురు మరో మారు దాడి చేయడంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డారు. ఘటనపై బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

అసోసియేషన్‌కు సభ్యులందరూ చేయూతనివ్వాలి



మాట్లాడుతున్న ప్రసాద్‌రెడ్డి

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఓల్డ్ ఐరన్ డీలర్స్ ఆటోనగర్ అసోసియేషన్‌ను అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్లేందుకు సభ్యులందరూ చేయూతనివ్వాలని అసోసియేషన్ నూతన అధ్యక్షుడు బత్తుల ప్రసాద్‌రెడ్డి కోరారు. ఓల్డ్ ఐరన్ డీలర్స్ అసోసియేషన్ కార్యాలయంలో 37వ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ముందుగా నూతన కార్యవర్గ సభ్యులతో ఎన్నికల అధికారి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. 1988 సంవత్సరంలో యలమందారెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన అసోసియేషన్ దిన దినాభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి ఏడాది అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సభ్యులకు బీమా అంశంపై చర్చిస్తున్నామన్నారు. ఈ ఏడాది నుంచి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామన్నారు. జీఎస్టీని తగ్గించేందుకు త్వరలో ఉన్నతాధికారులను కలుస్తామని చెప్పారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్ష, సలహాదారులు కోగంటి రాధాకృష్ణమూర్తి, ఎస్‌కే సలీం, కార్యదర్శి వి.నాగకుమార్, కోశాధికారి కె.నరసింహారావు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

కంకిపాడు: పేకాట శిబిరంపై కంకిపాడు పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన కథనం మేరకు... గొడవర్రు గ్రామంలోని పంట పొలాల్లో పేకాట శిబిరం నడుస్తున్నట్లు సమాచారం అందటంతో ఆ ప్రాంతంపై దాడి చేశారు. దాడిలో నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.28,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ 1996-97 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): 'స్నేహమేరా జీవితం..స్నేహమేరా శాశ్వతం' అన్నట్లుగా రెండున్నర దశాబ్దాల అనంతరం పూర్వ విద్యార్థులందరూ కలిసి సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. కొందరు అప్పుడప్పుడు కలుసుకుంటున్నప్పటికీ అందరూ ఒక దగ్గరే కలుసుకుని 25 ఏళ్ల నాటి మరుపురాని మధురానుభూతులను పంచుకోవడం ఒక అనిర్వచనీయమైన దృశ్యం. ఇందుకు భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని వీఎంసీ కల్యాణ మండపం వేదికగా నిలిచింది. విజయవాడ వన్‌టౌన్‌లోని శ్రీకన్యకాపరమేశ్వర విస్సంశెట్టి వెంకటరత్నం (ఎస్‌కేపీవీవీ) హిందూ హైస్కూల్ 1996–97 బ్యాచ్ ఎస్ఎస్‌సీ విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం జరిగింది. ఇక వయసు, హోదాలు మరిచి అందరూ కలిసి వేదికపై డ్యాన్స్ చేస్తుంటే మిగిలినవారు హర్షధ్వానాలతో వారిని ప్రోత్సహించారు. ఆత్మీయ ఆలింగనాలు, ఉభయకుశలోపరి, కుటుంబ సభ్యుల పరిచయాలు, పాత జ్ఞాపకాల పునశ్చరణ షరా మామూలే. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం అందరం కలిసి చదువుకున్నామని, ఇప్పుడు ఎవరి గమ్యం..ఎవరి లక్ష్యం వారిదేనని చెప్పారు. అయినా వాటన్నింటికీ అతీతమైనది స్నేహం ఒక్కటేనని స్పష్టం చేశారు.

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు



మధురానగర్(విజయవాడ సెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీలో శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరి రోజైన ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలను ఆలయ అర్చకులు అంగలూరి రంగాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే ఆలయంలో శ్రీదేవీ, భూదేవీ శిలాబింబాలను వేదపండితుల మంత్రోచ్ఛరణలతో ప్రతిష్ఠించారు. అనంతరం శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త అంగలూరి పద్మావతి పర్యవేక్షించారు.

కాలువల్లో వ్యర్థాలను తొలగించండి

మున్సిపల్ అధికారులకు కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశం



కొత్తవంతెన వద్ద రైవస్ కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరం మధ్యలో ప్రవహిస్తున్న బందరు, ఏలూరు, రైవస్ కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న మట్టి, వ్యర్థాలను తొలగించాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు నగరపాలకసంస్థ అధికారులను ఆదేశించారు. కాలువల్లో వ్యర్థాలను తొలగించి నీటి ప్రవాహం సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. దుర్గ అగ్రహారం సమీపంలోని కొత్త వంతెన వద్ద రైవస్ కాలువను ఆదివారం ఆయన పరిశీలించారు. కాలువను పరిశీలించిన అనంతరం కలెక్టర్ సమీపంలోని వార్డు సచివాలయం వద్దకు వచ్చి అక్కడ ఉన్న అధికారులతో ఈ అంశంపై మాట్లాడారు. కాలువల్లో నీరు నిలిచిపోవడం వల్ల అంటువ్యాధులు వేగంగా వ్యాపించే అవకాశం ఉందన్నారు. ఈ కాలువతో సహా నగరంలోని బందరు, ఏలూరు కాలువలో కూడా ఇటువంటి పరిస్థితి తలెత్తకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో కాల్వ గట్ల వెంబడి ఏర్పాటు చేసిన పార్కుల్లో కూడా ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చూడాలన్నారు. పరిసర ప్రాంతాల్లో నీరు నిలిచిన చోట దోమల నిరోధానికి ఉపయోగించే ద్రావణాన్ని స్ప్రే చేయాలని చెప్పారు. ప్రధానంగా కాలువలో నీరు నిలవడం వల్ల నగర ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. దోమలు, వ్యాధులు ప్రబలకు ముందే చర్యలు తీసుకుని కాలువల్లో వ్యర్థాలను తొలగించాలని చెప్పారు.

జైనులకు అండగా వైఎస్ జగన్ ప్రభుత్వం



మాట్లాడుతున్న మనోజ్‌కొఠారి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో జైనులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా ఉంటుందని ఏపీ జైన్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి అన్నారు. చైర్మన్‌గా నియమితులైన మనోజ్‌కొఠారికి శ్రీ సంభవనాథ్ రాజేంద్ర సూరి జైన్ సూర్జీ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాతబస్తీలోని పూలబావివీధిలో ఉన్న రాజేంద్ర భవన్‌లో సత్కార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోజ్‌కొఠారి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని జైనులను గుర్తించిన వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. జైనుల సమస్యలను పరిష్కరించేందుకు తాను వారిధిగా పని చేసి అండగా ఉంటానని తెలిపారు. రానున్న కాలంలో జైనులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. జైనులందరూ ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. పలువురు మత గురువులు ఆశీస్సులందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రముఖులు రాజు సోలంకి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సురవరం జయంతి వేడుకలు



సురవరం ప్రతాపరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం వజ్రోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, సంపాదకుడు సురవరం ప్రతాపరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సురవరం ప్రతాపరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మాజీ డెప్యూటీ మేయర్ సామంతపూడి నరసరాజు, అల్లూరి సాంస్కృతిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకటేశ్వరరాజు, డి.భాస్కరరాజు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం సురవరం చేసిన పోరాటం మరువలేనిదన్నారు. ప్రతాపరెడ్డి భౌతికంగా లేకున్నప్పటికీ ఆయన అందించిన సేవలు ప్రతీ ఒక్కరి మదిలో ఎన్నటికీ నిలిచే ఉంటాయని చెప్పారు. గ్రంథాలయ అధ్యక్ష, కార్యదర్శులు కె.సుబ్బరాజు, పీవీ సుబ్బరాజు మాట్లాడుతూ నేటి యువత సురవరం ప్రతాపరెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని పనిచేయాలన్నారు. సాంస్కృతిక సంఘం కోశాధికారి డీజేపీఎస్ రాజు, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్వీ సుబ్బరాజు, కెఎస్ ప్రసాదరాజు, పి.అయోధ్య రామరాజు, పి.రాంబాబు, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొని సురవరం సేవలను కొనియాడారు.

దోమల నియంత్రణకు స్పెషల్ డ్రైవ్



బుడమేరులో పనులు పర్యవేక్షిస్తున్న అధికారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరులో దోమల నియంత్రణకు ఆదివారం మలేరియా విభాగం ఆధ్వర్యాన స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మలేరియా విభాగం, పారిశుద్ధ్య విభాగం సిబ్బంది బృందాలు గా ఏర్పడి రామకృష్ణాపురం, దేవీనగర్, గద్దే వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ తదితర ప్రాంతాల్లో దోమల నియంత్రణ చర్యలు చేపట్టారు. నీటి ప్రవాహానికి ఆటంకంగా మారిన చెట్లు వ్యర్థాలను తొలగించారు. అలాగే బుడమేరులో గుర్రపుడెక్క తదితర వ్యర్థాలను బోటు సహాయంతో తరలించారు. పరిసరాలు శుభ్రం చేసి దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వీఎంసీ బయాలజిస్ట్ డి.సూర్యనాయక్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తచెదారాన్ని బుడమేరు, మురుగు కాలువల్లో వేయరాదని సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ఒకవేళ నీటి నిల్వలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే ఆయిల్ బాల్స్ వేస్తామని తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.జయరాజ్, మలేరియా ఇన్‌స్పెక్టర్ అనిల్, మలేరియా సూపర్‌వైజర్ బెనర్జీ, మేస్త్రి కె.శ్రీను పాల్గొన్నారు.

జీవనశైలిలో మార్పులతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న డాక్టర్ అశోక్ వార్ష్నికర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మంచి ఆహారం, మంచి జీవనశైలితోనే ఆరోగ్యంగా ఉంటామని ఆరోగ్య భారతి అఖిల భారత అధ్యక్షుడు డాక్టర్ అశోక్ వార్ష్నికర్ అన్నారు. స్థానిక రామలింగేశ్వరపేటలోని ఆర్ఎస్ఎస్ కార్యాలయం హైందవిలో ఆదివారం ఆరోగ్య భారతి క్షేత్ర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య వ్యక్తి, తద్వారా ఆరోగ్య గ్రామం తద్వారా ఆరోగ్య దేశం అనే సదాలోచనతో ఆరోగ్య భారతి పనిచేస్తోందన్నారు.

మన ఇంటిలో ఉండే నిత్యావసర వస్తువులు, కూరగాయలతో మనం ఆరోగ్యంగా ఉండే విధానాన్ని వివరించారు. ఆరోగ్య భారతి అన్ని రాష్ట్రాల్లోనూ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులకు మహిళలకు ఆరోగ్యం, హెల్తీ లైఫ్ స్టైల్ కొరకు కార్యక్రమాలు నిర్వహిస్తుందని ప్రాథమిక చికిత్స, చైర్ యోగ, స్వస్థ గ్రామం వంటి 24 రకాలైన కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. ప్రముఖ యూరాలజిస్టు, పిన్నమనేని ఫౌండేషన్ అవార్డు గ్రహీత డాక్టర్ సురేష్ పాటంకర్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ఆరోగ్య భారతి ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు.

ప్రతి ఒక్కరూ యోగా చేయాలని చెప్పారు. కార్యక్రమంలో విజయవాడ ఆరోగ్య భారతి అధ్యక్షురాలు డాక్టర్ సౌజన్య, ఆశ్రమం కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ పీఎస్ రావు, ఆరోగ్య భారతి అఖిల భారత కార్యదర్శి డాక్టర్ మురళీకృష్ణ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతానికి చెందిన వైద్యులు, ఆరోగ్య భారతి కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమాలను ప్రాంత కార్యవర్గ సభ్యులు శంకర్ నారాయణ, డాక్టర్ నారాయణ పర్యవేక్షించారు.

ఆర్టీసీ బస్సు, కారు ఢీకొని నలుగురు మృతి

- ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం
- త్రిపురాంతకం సమీపంలోని హైవేపై ఘటన


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

త్రిపురాంతకం: జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్న ఘటనలో నలుగురు మృతిచెందగా.. మరో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ప్రకాశం జిల్లా త్రిపురాంతకం సమీపంలోని హైవేపై ఆదివారం రాత్రి 10.15 సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. విజయవాడ నుంచి హిందూపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వినుకొండ వైపు వెళ్తున్న కారు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న విజయవాడకు చెందిన సాయి(26), పిల్లి శ్రీనివాస్(23), చంద్రశేఖర్ (25) అక్కడికక్కడే మృతిచెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న స్థానికులు, పోలీసులు క్షతగాత్రులను హైవే అంబులెన్స్, 108లో వినుకొండకు తరలించారు. మార్గం మధ్యలో శంకర్ (24) మృతిచెందాడు. అనంతపురంలో ఒక పెళ్లి మండపం డెకరేషన్ కోసం వెళ్లి విజయవాడ వస్తుండగా ఈ ఘటన జరిగినట్టు ఎస్సై జీవీ సైదులు తెలిపారు.

తెలంగాణ

రూ.2వేల నోట్ల మార్పిడి పేరిట మోసాలు..

సాక్షి, హైదరాబాద్: రూ.2వేల నోట్లను మార్పిడిచేసి ఇస్తామని కొందరు మోసాలకు పాల్పడుతున్నట్టు పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఆర్బీఐ రూ.2వేల నోట్లను ఉపసంహరించడం తెలిసిందే. రూ.2వేల నోట్లను బ్యాంకులలో జమ చేసి ఇతర కరెన్సీ నోట్లు పొందాలని ఇప్పటికే సూచించింది. దీంతో కొన్ని రోజులుగా రూ.2వేల నోట్ల మార్పిడి పెరిగింది. ఇదే అదనుగా రూ.2వేల నోట్లను కమీషన్లకు మార్చి ఇస్తామని మోసగిస్తున్న వారి వలలో పడవద్దని తెలంగాణ పోలీస్ శాఖకు చెందిన తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరించింది. రూ.2వేల నోట్ల మార్పిడి పేరిట మోసగించే వారిపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానం ఉంటే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని, నోట్ల మార్పిడికి బ్యాంకులకే వెళ్లాలని సూచించింది.



భూగర్భజలాల్లో 650.22 టీఎంసీలు మిగులు

వర్షాకాలం ముగిసేటప్పటికి రాష్ట్రంలో సగటున 6.13 మీటర్లలో భూగర్భజలాలు

- 2022–23 నీటి సంవత్సరంలో సగటున 1,046.9 మిల్లీమీటర్ల వర్షపాతం
- వర్షాల ప్రభావంతో 961.42 టీఎంసీల మేర పెరిగిన భూగర్భజలాలు
- ఇందులో సాగు, తాగు, గృహ తదితర అవసరాలకు 913.35 టీఎంసీలు వినియోగించుకునే వీలు
- నీటి సంవత్సరం ముగిసేనాటికి 263.13 టీఎంసీలే వినియోగం

సాక్షి, అమరావతి: ప్రస్తుత నీటి సంవత్సరంలో రాష్ట్రంలో భూగర్భజలాల్లో 650.22 టీఎంసీలు మిగిలాయి. నీటి సంవత్సరం జూన్ 1తో ప్రారంభమై మరుసటి ఏడాది మే 31తో ముగుస్తుంది. ప్రస్తుత అంటే 2022–23 నీటి సంవత్సరం మరో మూడురోజుల్లో ముగియనుంది. రాష్ట్రంలో ప్రస్తుత నీటి సంవత్సరంలో నైరుతి, ఈశాన్య రుతుపవనాల ప్రభావం వల్ల సగటున 967 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 1,046.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వర్షాలు సమృద్ధిగా కురవడం.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జలసంరక్షణ చర్యల వల్ల రికార్డు స్థాయిలో వర్షపు నీరు భూగర్భంలోకి ఇంకింది. భూగర్భజలాలు 961.42 టీఎంసీలయ్యాయి. ఇందులో సాగు, తాగు, గృహ తదితర అవసరాలకు 913.35 టీఎంసీలు వినియోగించుకోవడానికి వీలుందని భూగర్భ జలవనరుల అధికారులు లెక్కగట్టారు. కానీ నీటి సంవత్సరం ముగింపు దశకు చేరుకునేటప్పటికి అంటే ఆదివారానికి కేవలం 263.13 టీఎంసీల భూగర్భజలాలను మాత్రమే ప్రజలు వినియోగించుకున్నారు. దీంతో భూగర్భజలాల్లో 650.22 టీఎంసీలు మిగిలాయి. జలసంరక్షణ చర్యల ద్వారా వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భంలోకి ఇంకేలా చేసి, భూగర్భజలాలను పెంచడంతోపాటు వాటిని పొదుపుగా వినియోగించుకోవడం ద్వారా భూగర్భజలాల పరిరక్షణలో మన రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని అధికారవర్గాలు తెలిపాయి.

రబీలోనే భారీగా తోడివేత

అక్టోబర్ ఆఖరుకు వర్షాకాలం ముగిసిన తరువాత నవంబర్‌లో రాష్ట్రంలో భూగర్భజలాలు సగటున 6.13 మీటర్లలో లభ్యమయ్యేవి. రాష్ట్రంలో 15 లక్షల వ్యవసాయ బోరుబావులను భూగర్భజలవనరుల శాఖ జియోట్యాగింగ్ చేసింది. వాటికి అదనంగా మరో లక్షకుపైగా వ్యవసాయ బోరుబావులు ఉంటాయని అంచనా. భూగర్భజలమట్టాన్ని 1,806 పిజియోమీటర్ల ద్వారా భూగర్భజలవనరుల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు లెక్కిస్తూ పర్యవేక్షిస్తున్నారు. రబీలో, వేసవిలో సాగు, తాగు, గృహ అవసరాల కోసం బోరుబావుల నుంచి భారీ ఎత్తున ప్రజలు నీటిని తోడేశారు. తూర్పుగోదావరి జిల్లాలో అత్యధికంగా 3.95 మీటర్ల మేర భూగర్భజలాలను తోడేయగా, నెల్లూరు జిల్లాలో అత్యల్పంగా 0.37 మీటర్ల మేర భూగర్భజలాలను వినియోగించుకున్నారు. వర్షాభావ ప్రాంతాలైన అనంతపురం జిల్లాలో 2.79, శ్రీసత్యసాయి జిల్లాలో 3.29 మీటర్ల మేర రబీలో భూగర్భజలాలను వినియోగించుకున్నారు. నవంబర్ నుంచి మే వరకు సగటున 2.54 మీటర్ల మేర భూగర్భజలాలను వాడుకోవడంతో భూగర్భజలమట్టం 8.67 మీటర్లకు పడిపోయింది.

బాపట్లలో కనిష్ఠం.. ఏలూరులో గరిష్ఠం..

నీటి సంవత్సరం ముగిసేటప్పటికి రాష్ట్రంలో సగటున 8.67 మీటర్లలో భూగర్భజలాలు లభ్యమవుతున్నాయి. బాపట్ల జిల్లాలో కనిష్ఠంగా 3.59 మీటర్లలోనే భూగర్భజలాలు లభ్యమవుతుండగా.. ఏలూరు జిల్లాలో గరిష్ఠంగా 20.95 మీటర్ల లోతుకు వెళ్తేగానీ భూగర్భజలాలు దొరకని పరిస్థితి. వర్షాభావ ప్రాంతాలైన అనంతపురం జిల్లాలో 7.84, శ్రీసత్యసాయి జిల్లాలో 8.35 మీటర్లలోనే భూగర్భజలాలు లభ్యమవుతుండటం గమనార్హం. జూన్ 1 నుంచి కొత్త నీటి సంవత్సరం 2023–24 ప్రారంభమవుతుంది. గతేడాదిలానే ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్న వాతావరణశాఖ అంచనాల నేపథ్యంలో.. భూగర్భజలాలు పుష్కలంగా పెరిగే అవకాశం ఉందని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి.

తెలంగాణ

ప్రత్యేక రైళ్లకు భారీ డిమాండ్

పెరిగిన వేసవి రద్దీ

- పర్యాటక కేంద్రాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలకు ఎక్కువ మంది ప్రయాణం
- భారత్ గౌరవ్ రైళ్లలో వంద శాతం ఆక్యుపెన్సీ నమోదు

సాక్షి, హైదరాబాద్: రైళ్లలో వేసవి రద్దీ పెరిగింది. పర్యాటక ప్రాంతాలు, ఆధ్మాత్మిక క్షేత్రాలకు జనం పెద్ద సంఖ్యలో తరలి వెళ్తున్నారు. దీంతో హైదరాబాద్ నుంచి వివిధ మార్గాల్లో నడిచే రైళ్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసినప్పటికీ అవి ప్రయాణికుల డిమాండ్‌ను భర్తీ చేయలేకపోతున్నాయి. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా జూన్ నెలాఖరు వరకు అందుబాటులో ఉండేవిధంగా వివిధ రూట్లలో ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశారు. ఆ రైళ్లలోనూ వెయిటింగ్ లిస్టు వందల్లోకి చేరడం గమనార్హం. హైదరాబాద్ నుంచి కటక్, బికనేర్, రెక్సాల్, పట్నా తదితర ప్రాంతాలకు ప్రయాణికుల డిమాండ్ మేరకు అదనపు రైళ్లు అందుబాటులో లేకపోవడంతో జనం పడిగాపులు కాయాల్సి వస్తుంది. సాధారణంగా ప్రతి రోజు సుమారు 80 ఎక్స్‌ప్రెస్ రైళ్లు, మరో 100 వరకు ప్యాసింజర్ రైళ్లు సికింద్రాబాద్ నుంచి రాకపోకలు సాగిస్తాయి. ఈ స్టేషన్ నుంచి రోజుకు 1.85 లక్షల మంది ప్రయాణంచేస్తారు. మరో 60 వేల మంది వరకు కాచిగూడ, నాంపల్లి, లింగంపల్లి తదితర స్టేషన్‌ల నుంచి ప్రయాణిస్తారు. వేసవి సందర్భంగా గత నెల రోజులుగా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో ఈ స్టేషన్లనుంచి సుమారు 3 లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నట్లు అంచనా. సొంత ఊళ్లకు వెళ్లేవారికంటే ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలకు వెళ్లే వారి సంఖ్యే ఎక్కువగా ఉందని సమాచారం. దీంతో తిరుపతి, విశాఖ, ముంబై, షిరిడీ, ఢిల్లీ, వారణాసి, జైపూర్, కోల్‌కతా, బెంగళూరు, చెన్నై తదితర నగరాలకు తాకిడి పెరిగింది. గతంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 50 నుంచి 70 ప్రత్యేక రైళ్లను నడిపితే ఇప్పుడు వాటి సంఖ్య సగానికి పైగా తగ్గడం గమనార్హం.

అన్ని సదుపాయాలతో భారత్ గౌరవ్ రైళ్లు

ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న భారత్ గౌరవ్ పర్యాటక రైళ్లలో వందశాతం ఆక్యుపెన్సీ నమోదవుతోంది. ఈ వేసవిలో సికింద్రాబాద్ నుంచి ఇప్పటివరకు 8 రైళ్లు బయలుదేరాయి. తెలుగు రాష్ట్రాలకు చెందిన యాత్రికులు ఉత్తర, తూర్పు ప్రాంతాల్లోని ఆధ్యాత్మిక క్షేత్రాలను సందర్శించేందుకు ఈ రైళ్లలో వెళుతున్నారు. 'పూరీ–కాశీ–అయోధ్య'పేరుతో ఐఆర్‌సీటీసీ ఇటీవల భారత్ గౌరవ్ రైలును ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ రైలులో ప్రయాణించే వారికి ఐఆర్‌సీటీసీయే అన్ని రకాల సేవలను అందజేస్తోంది. వీరికి రోడ్డు రవాణా, వసతి, భోజనం తదితర అన్ని ఏర్పాట్లు ఉంటాయి. ఈ ప్యాకేజీలో పూరీ జగన్నాథ ఆలయం, కోణార్క్ సూర్య దేవాలయం, గయా విష్ణు పాద ఆలయం, వారణాసి కాశీ విశ్వనాథ ఆలయం, కాశీ విశాలాక్షి, అన్నపూర్ణ దేవాలయం, అయోధ్య రామజన్మ భూమి, ప్రయాగ్ రాజ్ తదితర ప్రాంతాలను సందర్శించ వచ్చు. 8 రాత్రులు, 9 పగళ్లు ఈ పర్యటన కొనసాగుతుంది. ఈ ట్రైన్‌లో ఏసీ, నాన్ ఏసీ కోచ్‌లు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని 9 ప్రధాన స్టేషన్‌లలో హాల్టింగ్ సదుపాయం ఉంది. ఇప్పటి వరకు నడిచిన 8 ట్రిప్పుల్లో రైలులోని మొత్తం 700 సీట్లు రిజర్వ్ కావడం విశేషం.

తెలంగాణ

రక్షణరంగ ఎగుమతిదారుగా భారత్‌ను నిలపాలి

- డీఆర్‌డీఓ చైర్మన్ సమీర్ వి కామత్

సాక్షి, హైదరాబాద్: భారత దేశాన్ని రక్షణరంగ ఉత్పత్తుల ఎగుమతిదారుగా నిలపాలని, అందుకు డీఆర్‌డీఓ పూర్తి సహకారం అందిస్తుందని రక్షణశాఖ ఆర్‌అండ్‌డీ విభాగం కార్యదర్శి, డీఆర్‌డీఓ చైర్మన్ డా.సమీర్ వి కామత్ చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ)లోని రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (ఆర్‌సీఐ)లో మేథోమథన సదస్సు నిర్వహించారు. ఎంఎస్‌ఎంఈ (మినిస్ట్రీ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్), స్టార్టప్‌లతో సహా అన్ని రక్షణ పరిశ్రమలను ఏకతాటిపైకి తెచ్చే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 180కి పైగా పరిశ్రమలు పాల్గొన్నాయి. సదస్సుకు అధ్యక్షత వహించిన కామత్ మాట్లాడుతూ, పరిశ్రమలకు డీఆర్‌డీఓ అన్ని విధాలా సహకారం అందిస్తుందని, దేశాన్ని నికర రక్షణ ఎగుమతిదారుగా మార్చేందుకు మార్గదర్శక పాత్రను పోషిస్తుందని హామీ ఇచ్చారు.

సీఎం గారూ.. మా 15 ఏళ్ల కలను నెరవేర్చండి

సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు జేఎన్‌జేఎంఏసీహెచ్‌ఎస్ మహిళా సభ్యుల వినతి

లక్డీకాపూల్(హైదరాబాద్): జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ(జేఎన్‌జేఎంఏసీహెచ్‌ఎస్) సభ్యుల ఇళ్ల స్థలాల పంపిణీపై సుప్రీంకోర్టు తీర్పును వెంటనే అమలుపరచాలని పలువురు మహిళా సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సొసైటీ మహిళా సభ్యుల ఆత్మీయ సమావేశం జరిగింది. మహిళా జర్నలిస్టులుగా సుమారు 20 నుంచి 35 ఏళ్ల వరకు వివిధ మీడియాల్లో పని చేశాము. ప్రస్తుతం కొందరు ఉద్యోగాల్లో కొనసాగుతున్నా.. కోవిడ్ అనంతరం చాలామంది ఉద్యోగాలు కోల్పోయి ఎన్నో అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సొసైటీలో సభ్యులు తమ ఆప్తులను కోల్పోయిన కుటుంబ సభ్యులు తమ కష్టాలను విన్నవిస్తూ కన్నీరు మున్నీరయ్యారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న తమ భూ సమస్యను పరిష్కరించాలని మొరపెట్టుకున్నారు. మరణించిన సభ్యుల అంత్య క్రియలకు కూడా డబ్బు లేని దుర్భర స్థితిని ఎదుర్కొన్నామని, దివంగత జర్నలిస్ట్ శ్రీనివాస్ సతీమణి జయశ్రీ ఆవేదన వ్యక్తం చేశారు. తన కార్టూన్లతో ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రతిష్టలు సంపాదించుకున్నా...ఆయన మరణానంతరం తమ కుటుంబం అనేక ఇబ్బందుల్లో పడిందని కార్టూనిస్ట్ శేఖర్ సతీమణి చంద్రకళ అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి తమ బాధను అర్థం చేసుకుని తమకు భూమిని అప్పగించాలని కోరారు. రిటైరై కూడా కనీసం పీఎఫ్, పెన్షన్ వంటి సౌకర్యాలు కూడా లేక ఇబ్బందుల్లో ఉన్నామని ఆందోళన వ్యక్తం చేశారు. 15 ఏళ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురు చూస్తున్న వారిలో 60 మంది సభ్యులు ప్రాణాలు కోల్పోవడంతో ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నాయని వాపోయారు. ఇప్పటికైనా తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని మహిళా సభ్యులు విజ్ఞప్తి చేశారు. సొసైటీ సెక్రటరీ వంశీ శ్రీనివాస్ సభ్యుల సందేహాలకు సమాధానాలిచ్చారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

ఎన్టీఆర్ ఘాట్ వద్దకు వచ్చిన కుటుంబ సభ్యులు, ప్రముఖులు

ఖైరతాబాద్ (హైదరాబాద్): ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) శత జయంతి సందర్భంగా ఆదివారం ఆయన కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు ఘనంగా నివాళి అర్పించారు. ఆదివారం తెల్లవారుజామునే ఎన్టీఆర్ ఘాట్ వద్దకు చేరుకున్న సినీ నటుడు, ఏపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ సినిమాల్లోనే కాకుండా రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేశారని.. ఎన్టీఆర్ శత జయంతిని రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. తర్వాత ఎన్టీఆర్ తనయుడు రామకృష్ణ, కుమార్తె, కేంద్ర మాజీ మంత్రి పురందేశ్వరి, జూనియర్ ఎన్టీఆర్, నటుడు రాజేంద్ర ప్రసాద్, మరికొందరు ప్రముఖులు, నేతలు, అభిమానులు ఎన్టీఆర్ ఘాట్ వద్దకు చేరుకుని ఘనంగా నివాళులు అర్పించారు. జూనియర్ ఎన్టీఆర్ వచ్చిన సమయంలో పెద్ద సంఖ్యలో అభిమానులు


ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న బాలకృష్ణ

ఆయనను చూసేందుకు, సెల్ఫీలు దిగేందుకు దూసుకురావడంతో తోపులాట జరిగింది. ఈ సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్ సీఎం, సీఎం అంటూ అభిమానులు నినాదాలు చేశారు. తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కూడా ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోయే గొప్ప మహనీయుడు, మకుటం లేని మహారాజు ఎన్టీఆర్ అని పేర్కొన్నారు.

జిల్లా వార్తలు

సీఎం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం

- త్వరలోనే అభివృద్ధి పనులను ప్రారంభిస్తాం
- హామీలు అమలు చేశాకే ఓట్లు అడుగుతాం
- 22(1)ఏ నిషేధ భూముల సమస్యకు పరిష్కారం
- 'సాక్షి' రచ్చబండలో అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవనిగడ్డ నియోజకవర్గానికి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాకే ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడుగుతామని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు స్పష్టంచేశారు. వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనపై ప్రజలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలంలోని పులిగడ్డ ఇరిగేషన్ అతిథి గృహం ఆవరణలో 'సాక్షి' చానల్ ఆధ్వర్యంలో ఆదివారం రచ్చబండ కార్యక్రమం జరిగింది. అవనిగడ్డ నియోజకవర్గంలో నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, నిధుల మంజూరు వివరాలను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు వెల్లడించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి వల్ల కలిగిన ప్రయోజనాలను వివరించగా, మరి కొందరు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను వెల్లడించారు. రచ్చబండ కార్యక్రమాన్ని సాక్షి టీవీ యాంకర్ దీప్తి నిర్వహించారు.


పులిగడ్డలో నిర్వహించిన రచ్చబండకు హాజరైన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, కడవకొల్లు తదితరులు

రాష్ట్రంలో 22,042 మంది రైతులకు మేలు



అవనిగడ్డ నియోజకవర్గంలో గత ఏడాది అక్టోబర్ 19న నిషేధిత భూముల జాబితా సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా అమలు కావడంతో సంతోషంగా ఉంది. రాష్ట్రంలో 35,669 ఎకరాలకు సంబంధించి 22,042 మంది రైతులకు ప్రయోజనం కలిగింది. మా నియోజకవర్గంలోనే 15,791 ఎకరాలకు సంబంధించి 10,119 మంది రైతులకు మేలు చేకూరింది. నియోజకవర్గంలో రూ.93.50 కోట్ల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అవనిగడ్డ – కోడూరు రోడ్డుకు రూ.35 కోట్లు, సముద్రపు కరకట్ట పటిష్టానికి రూ.25 కోట్లు, పాత ఎడ్లంక రోడ్డుకు రూ.8.50 కోట్లు, అవనిగడ్డ కంపోస్ట్ యార్డు తొలగింపునకు రూ.10 కోట్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ పనులు అన్నింటినీ త్వరలోనే ప్రారంభిస్తాం. అవనిగడ్డ – కోడూరు ప్రధాన రోడ్డు పలుచోట్ల కుంగిపోవడం వల్ల రక్షణ గోడలు నిర్మించాల్సి రావడంతో అంచనాలు పెరిగే అవకాశం ఉంది. ఈ పనులను త్వరలోనే ప్రారంభిస్తాం. ఎదురుమొండి వారధి నిర్మాణానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.110 కోట్ల నాబార్డు నిధులు మంజూరు చేయించారు. మట్టినమూనా సేకరణ జరిగిందని, త్వరలోనే ఎదురుమొండి వారధికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తాం. వైఎస్ జగన్‌ని ఓడించాలంటే అందరూ కలవాలని టీడీపీ, జనసేన ఇతర పార్టీలు కోరుకుంటున్నాయి. ఎన్ని పార్టీలు కలిసొచ్చినా మళ్లీ అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే.

– సింహాద్రి రమేష్‌బాబు, అవనిగడ్డ ఎమ్మెల్యే

సంక్షేమంతో అభివృద్ధి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అభివృద్ధి జరుగుతోంది. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. వైజాగ్ సమ్మిట్‌లో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు రావడం ఉత్తమ పాలనకు నిదర్శనం. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయి.

– కడవకొల్లు నరసింహారావు, ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి, అవనిగడ్డ

చుక్కల భూముల సమస్య తీరింది



మాకు ఐదెకరాల పొలం ఉంది. 2017లో చంద్రబాబు హయాంలో 22(1)ఏ కింద నిషేధిత జాబితాలోకి వెళ్లింది. పిల్లల పెళ్లికి లోను తీసుకునేందుకు ప్రయత్నించినా చుక్కల భూమి కావడంతో మంజూరు కాలేదు. పొలం ఉన్నా అక్కరకు రాలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం వల్ల మా భూములకు విముక్తి లభించింది. మా సమస్య పరిష్కారమైంది.

– రేపల్లె రాజయ్య, రైతు, వి.కొత్తపాలెం

ప్రభుత్వం ఆదుకుంది



గత ఏడాది చల్లపల్లి శివారు కాసానగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మా గ్రామానికి చెందిన ఐదుగురు చనిపోగా, 18 మంది గాయపడ్డారు. చనిపోయిన వారి ఒక్కొక్క కుటుంబానికి రూ.3 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున సహాయం అందించారు. ఈ సహాయం మాకు ఎంతగానో ఉపయోగ పడింది. ఈ ప్రమాదంలో నా కన్ను దెబ్బ తింది. దివ్యాంగ పింఛన్ ఇప్పించి ఆదుకోవాలి.

– పల్లె నాంచారమ్మ, రోడ్డు ప్రమాద బాధితురాలు, చింతలమడ

రోడ్డు సమస్యలు తీరాయి



రూ.16 కోట్లతో కోడూరు నుంచి పోటుమీద వరకూ రహదారిని విస్తరించి అభివృద్ధి చేశారు. గతంలో ఎడ్ల బండ్లు వెళ్లడానికి చాలా ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు రోడ్డును వెడల్పు చేసి కొత్తగా నిర్మించారు. ఇప్పుడు రోడ్డు చాలా బాగుంది. వాహనదారుల అవస్థలు అన్నీ తీరిపోయాయి.

– గుర్రం బసవయ్య, లింగారెడ్డిపాలెం, మాజీ సర్పంచ్

చెరువును బాగుచేశారు



ఎదురుమొండి దీవుల అవతల ఉన్న మా గ్రామంలో ఉన్న చెరువు చెట్లు, పిచ్చి మొక్కలు మొలచి అడవిగా మారింది. చెరువులో ఆవులు చనిపోయి నీరు దుర్వాసన వచ్చేది. ఈ సమస్యను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబుకు చెప్పిన వెంటనే చెరువులో పూడిక తీయించారు. వరదలు, తుపానుల సమయంలో మా గ్రామానికి వచ్చి మనోధైర్యం కల్పించారు. ఇలాంటి ఎమ్మెల్యేని ఎప్పుడూ చూడలేదు.

– చెన్ను వెంకటేశ్వరరావు, ఈలచెట్లదిబ్బ

రాజకీయ సంక్షోభంలో చంద్రబాబు

మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకారావు

తాడేపల్లి రూరల్: టీడీపీ అధినేత చంద్రబాబు రాజకీయ సంక్షోభంలో ఉన్నారని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్ముూరి కనకారావు అన్నారు. తాడేపల్లిలోని మాదిగ కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మహానాడులో ఎస్సీ సంక్షేమంపై నక్కా ఆనందబాబు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని తీవ్రంగా ఖండించారు. దళితులకు సామాజిక న్యాయం, సంక్షేమ ఫలాలు అందించడంలో గత చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల ద్వారా గత ప్రభుత్వాల కంటే మెరుగ్గా ఎస్సీ కుటుంబాలకు కోట్లాది రూపాయల సంక్షేమ పథకాలను పారదర్శకంగా అవినీతికి తావు లేకుండా అమలు చేస్తున్నారని తెలిపారు. గతంలో ఎస్సీలపై దాడులు జరిగితే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు ఇచ్చే పరిస్థితి ఉండేది కాదన్నారు. చంద్రబాబు అబద్ధాలెన్ని చెప్పినా దళితుల ఓట్లు పొందలేరని తేల్చి చెప్పారు. వారంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటారని స్పష్టంచేశారు.

విశ్వకర్మల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యేలు వెలంపల్లి, మల్లాది
- విశ్వకర్మ లెజెండరీ అవార్డ్‌ల ప్రదానం


ప్రొఫెసర్ కనకదుర్గకు విశ్వకర్మ లెజెండరీ అవార్డ్ ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, శ్రీకాంత్

భవానీపురం(విజయవాడపశ్చిమ): సృజనాత్మకతకు ప్రతీకలైన విశ్వకర్మల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని విజయవాడ పశ్చిమ, సెంట్రల్ ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు పేర్కొన్నారు. విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఏడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో విశ్వకర్మ నేషనల్ సమ్మిట్, విశ్వకర్మ లెజెండరీ అవార్డుల ప్రదాన కార్యక్రమం ఆదివారం జరిగింది. విద్య, వైద్య, సాంస్కృతిక, వైదిక ఆగమ, పంచ శిల్ప తదితర రంగాల్లో అసమాన ప్రతిభ చూపిన 80 మంది విశ్వబ్రాహ్మణులకు విశ్వకర్మ లెజెండరీ అవార్డ్‌లను అందజేశారు. రుంజ వాయిద్య శబ్ద తాళ విన్యాసం, విశ్వకర్మ ఉద్యమ గీతాలాపనలతో ప్రారంభమైన ఈ వేడుకలో ఎమ్మెల్యేలు వెలంపల్లి, మల్లాది మాట్లాడుతూ.. వెనుకబడిన తరగతికి చెందిన విశ్వబ్రాహ్మణుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో భాగస్వామ్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రపంచీకరణ మత్తులో మన మూల సంస్కృతిని కోల్పోతున్న తరుణంలో విశ్వకర్మ సమాజపు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వ్యవస్థాపకుడు విశ్వనాథుల పుష్పగిరి మాట్లాడుతూ.. సృష్టి ఆది నుంచి మానవ మనుగడకు వెన్నెముకగా, నాగరికతకు మూలస్తంభాలుగా నిలిచింది విశ్వకర్మలేనని అన్నారు. సృజనాత్మకతకు మూలపురుషులైన విశ్వకర్మల కృషి అనన్య సామాన్యమని కొనియాడారు. శ్రీకాళహస్తేంద్ర పారంపర్య పీఠాధిపతులు, నందికొండ సంస్థానాధీసుడు శ్రీకాంతేంద్ర స్వామీజీ, తమిళనాడు రాష్ట్రానికి చెందిన శక్తి పాఖర్ దాసన్ స్వామి, కన్యా గురుకుల వ్యవస్థాపకుడు సవితా ఆచార్య, గోకవరపు శ్రీనివాస్, వెంకట్ విశ్వకర్మ, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం మహిళా అధ్యక్షురాలు కల్లూరి శ్రీవాణి, నల్లూరి రామ్‌ప్రసాద్, విద్యానందాచారి, రేల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నాటక సంరంభం.. శుభారంభం


తొలిరోజు ప్రదర్శితమైన ఎర్రకలువ నాటకంలోని ఓ సన్నివేశం

పల్లెకోన(భట్టిప్రోలు): ప్రేక్షకుల కరతాళ ధ్వనులే కళాకారులకు దీవెనలని సినీ రచయిత, నటుడు పరుచూరి వెంకటేశ్వరరావు అన్నారు. బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పల్లెకోన గ్రామంలో మూడేళ్ల విరామం అనంతరం పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 31వ డాక్టర్ డి.రామానాయుడు అఖిల భారత ఆహ్వాన నాటకోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు 31 వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తన కొడుకు సంస్మరణార్థం ఈ పోటీలను ప్రారంభించినట్లు చెప్పారు. మానసిక రుగ్మతలను సైతం నయం చేసి మనిషిని తేజోవంతం చేసే గుణం నాటకానికి ఉందని అభిప్రాయపడ్డారు. ప్రముఖ కథా రచయిత, నటుడు, దర్శకుడు తులసి బాలకృష్ణ మాట్లాడుతూ నాటక రంగంలో విజ్ఞత, వినోదం కలసి ఉంటాయని, ఏ వేదిక అయితే తమకు గుర్తింపునిచ్చిందో దానిని మరువకుండా నాటకోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నాటక రంగం వృద్ధికి పరుచూరి బ్రదర్స్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ పరుచూరి రఘుబాబు మరణించి 28 ఏళ్లయినా నిజమైన హీరోగా వెలుగొందుతున్నారని చెప్పారు. పరుచూరి వెంకటేశ్వరరావుకు అద్భుతమైన వ్యక్తిత్వం ఉండటం వల్ల రఘుబాబు స్టార్ అయ్యారని పేర్కొన్నారు. తొలుత పరుచూరి వెంకటేశ్వరరావు కుమారుడు పరుచూరి రఘుబాబు చిత్రపటానికి వెంకటేశ్వరరావు, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాటకోత్సవ సమన్వయకర్త డి.రామకోటేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

అజ్ఞానాన్ని పటాపంచలు చేసిన 'ఎర్రకలువ'

'మన చుట్టూ ఉన్న ఇతర దేశాలు సాంకేతికంగా పురోభివృద్ధిలో దూసుకుపోతుంటే మనం ఇంకా సంస్కృతి, సంప్రదాయాల పేరుతో వెనుబడిపోవాలా? సాంకేతికత ఎక్కడిదైనా, ఎవరిదైనా దానిని అందిపుచ్చుకుని మనం అంచెలంచెలుగా అభివృద్ధి చెందాలి'' అంటూ ఆవేదన చెందిన ఒక ఇంజినీరు సిద్దప్ప కథ ఎర్ర కలువ. శ్రీ కళానికేతన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఈ నాటకం ఆద్యంతం అలరించింది. ప్రేక్షకుల కరతాళ ధ్వనులు అందుకుంది. ఆకురాతి భాస్కర్ రచించిన ఈ నాటకానికి డాక్టర్ వెంకట్ గోవాడ దర్శకత్వం వహించారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
సోమవారం ॥ 29-5-2023



అంతర్జాతీయ చింతన

మంచి మాట

దేశభక్తి ఒకవైపున ఉంటే మరొకవైపున ప్రపంచభక్తి ఉన్న నాణెంగా ప్రతివ్యక్తీ ఉండాలి; జాతీయ చింతన, అంతర్జాతీయ చింతన ఈ రెండూ ప్రతివ్యక్తిలోనూ తొణికిసలాడుతూ ఉండాలి. అంతర్జాతీయత అన్నది ప్రతివ్యక్తికీ ఆశంసనీయమైంది; అవసరమైంది.

ప్రతివ్యక్తికీ జాతీయ చింతన ఎంత ముఖ్యమైందో అంతర్జాతీయ చింతన కూడా అంత ముఖ్యమైందే. సరైన ఆలోచన చేస్తే మనకు అంతర్జాతీయత ఆవశ్యకత అవగతం అవుతుంది. ఈ ఆవశ్యకతను ఆకళింపు చేసుకున్న తరువాతే మన పెద్దలు 'వసుధైవకుటుంబకం' అంటూ భూమండలం ఒక కుటుంబమే అని చెప్పారు.

భూమి అంతా ఒక కుటుంబం అన్న భావన భూమిపై ఉంటున్న మనిషిలో కలగడం లేదు. ఈ భావనే ఉండి ఉంటే దండయాత్రలు, కూలగొట్టడాలు, కొల్లగొట్టడాలు, దారుణ మారణకాండలు భూమిపై జరిగి ఉండేవి కావు. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలు జరిగి ఉండేవి కావు. అణు ఆయుధాలు ప్రయోగించబడి ఉండేవి కావు. ఇవాళ్టి రోజున ప్రపంచానికి పెద్దగడ్డుగా పరిణమిస్తున్న ఉక్రెయిన్ యుద్ధం కూడా ఉండేది కాదు.

> అంతర్జాతీయతను ఆలోచన చేద్దాం; మనం విపత్తుల్ని నిశ్వాసిద్దాం. అంతర్జాతీయతకు మాలిమి అవుదాం; మనం ప్రశాంతతను ఉచ్ఛ్వాసిద్దాం.

కుటుంబం అని అంటే ఒక ఇంట్లో నివసించే బంధువర్గం అనీ అర్థం ఉంది. దేశదేశాలతో ఉన్న భూమి మొత్తం ఒక ఇల్లు దేశదేశాలవాళ్లందరూ ఒక బంధువర్గం అన్న భావన ప్రపంచంలోని ప్రతిదేశంలోని ప్రతివ్యక్తిలోనూ ఉండాలి.

వ్యావహారిక శకానికి పూర్వం 6వ శతాబ్దికి చెందిన తమిళ సంగకాల కవి–తాత్త్వికుడు కణియన్ పూంగున్రనార్ 'ఏదైనా ఊరే; ఎవరైనా బంధువులే' అన్న అర్థాన్ని ఇచ్చే ఒక గొప్పమాట చెప్పారు. ఆయన చెప్పిన ఆ తమిళమాట అంతర్జాతీయం అయిపోయింది. ఆ మాట సూచించిన అంతర్జాతీయతకు ఆకృతిగా' ఈ ప్రపంచంలోని ప్రతి ఊరూ మన ఊరే; ప్రతి వ్యక్తీ మన బంధువే' అన్న భావన మనకు తప్పకుండా కావాలి.

మొత్తం ప్రపంచం అంతా ఒక నేల కదా? మొత్తం నేల అంతా ఒక ప్రపంచం కదా? ఈ భావన మనలో లేకుండా పోవడం కాదు మనకు రానేలేదు. అందుకే ఎప్పటినుంచో మనల్ని అపాయాలు చుట్టుముడుతూనే ఉన్నాయి. ఈ భావన రాకపోవడంవల్ల మానవాళికి ముప్పు అంటుకుంది. ఆ ముప్పు ఆనాటికానాటికీ వ్యాపిస్తూనే ఉంది; వ్యథల్ని రగిలిస్తూనే ఉంది.

మొత్తం నేల అంతా ఖండాలు, దేశాలు, ప్రాంతాలుగా ముక్కలైపోయింది. శత్రుత్వాలు, విద్వేషాలు అనే దీర్ఘరోగాలతో అనాదిగా ప్రపంచం బాధపడుతూనే ఉంది. మనిషి ఎందుకు నేలను ముక్కలు చేశాడు? అసలు మనిషి ఎవరు నేలను ముక్కలు చెయ్యడానికి? ఇలా ముక్కలు చేసి మనిషి ప్రపంచాన్ని చెడగొట్టాడు; తనకు తానే పెనుచెడుపు చేసుకున్నాడు; తాను చేసుకున్న చెడుపునకు తానే చెల్లిపోతున్నాడు.

ప్రపంచం అన్న నేల పలుముక్కలయ్యాక ఒక ముక్క మరో ముక్కకు పక్కలో బల్లెం అయింది; ఒక ముక్క మరో ముక్కకు గాయం చేస్తూనే ఉంది. గాయంలేని చోటులేదు ప్రపంచంలో. అవును ప్రపంచానికి గాఢమైన గాయం అయింది. ఆ గాయం వల్ల ప్రజ జీవనం విలవిలలాడుతోంది; ప్రజ జీవితం విలపిస్తోంది. అంతర్జాతీయత లేకపోవడం ఈ పరిణామానికి ఏకైక కారణం.

సరిహద్దుల్ని చెరిపేసుకుని దేశాలన్నీ కలిసిపోవాలి. ఇలా అనుకోవడం అత్యాశే కావచ్చు; ఇది జరిగేది కాకపోవచ్చు. నిజంగా అదే జరిగితే ప్రపంచానికి పట్టుకున్న యుద్ధాల ఉచ్చు తొలగిపోతుంది. మూడవ ప్రపంచ యుద్ధం రాకుండా ఉండాలన్నా, ఏ దేశమూ, ఏ వ్యక్తీ యుద్ధానికి గురై బలైపోకుండా ఉండాలన్నా మనలో అంతర్జాతీయత రావాలి. భయంతో కాదు మనిషి భద్రతతో మనుగడ చెయ్యాలి. అందుకు మనలో అంతర్జాతీయత ఉండాలి.


– రోచిష్మాన్

సన్నిధి

సంపద.. సమృద్ధి

గురువాణి

సన్యసించిన వ్యక్తులు, పరమహంసలు, మతాధిపతులు, పీఠాధిపతులు... వీరు సర్వసాధారణంగా ఆత్మోద్ధరణకు సంబంధించిన విషయాల మీద అనుగ్రహభాషణలు చేస్తుంటారనీ, వారు తాము తరించి, ఇతరులు తరించడానికి సంబంధించిన మార్గాలను బోధచేయడం వరకే పరిమితం అవుతారని లోకంలో భావన చేస్తుంటారు. కానీ ఈ భావనలకు భిన్నంగా వెళ్ళిన గురువు ఒకరున్నారు. ఆయన సమర్థ రామదాసు. ఈ దేశం కష్టాల్లో ఉన్నప్పుడు సనాతన ధర్మానికి పూర్వ వైభవం తీసుకురావడంలో ఆయన ఎనలేని కృషి చేశారు.



దేశంలో సమకాలీన పరిస్థితులను బాగా అధ్యయనం చేసారు. ఆ కాలంలో ఉన్న పాలనా వ్యవస్థ, అప్పుడున్న సామాజిక అలజడులు, ప్రజలలో అప్పుడున్న అభద్రతా భావాన్ని దష్టిలో పెట్టుకుని ప్రజలకు మౌలికంగా ఏవి అవసరమో వాటిని బోధించి, ఆచరణలో కూడా మార్గదర్శనం చేసిన గురువు ఆయన. ప్రజలు తమ శారీరక ఆరోగ్యంతోపాటూ, ఆత్మరక్షణకు అవసరమయిన దృఢత్వాన్ని పొందడానికి ఆయన పర్యటించిన ప్రదేశాల్లో వ్యాయామశాలలు నెలకొల్పారు. ఆరోగ్యంతోపాటూ మానసిక పరిణతికి చదువు అవసరమని పాఠశాలలు ఏర్పాటు చేసారు. ఆధ్యాత్మిక క్రమశిక్షణకు, ధర్మంపట్ల అనురక్తి కలగడానికి భక్తి అవసరమని హనుమాన్ మందిర్ లు నిర్మించారు. ప్రజలందరిలో దేశభక్తి నూరిపోసారు. ఆయన ప్రజలకు తరచుగా ఆరు సూత్రాలు బోధిస్తుండేవారు...అవి ఎప్పటికీ ఆచరణ యోగ్యాలే.

వాటిలో మొదటిది సంపద, సమృద్ధి. అంటే అందరివద్దా సంపద ఉండాలి, అది కూడా సమృద్ధిగా ఉండాలి. లేకపోతే తను వ్యక్తిగతంగా అనుకున్నది కూడా సాధించలేరు, జీవితంలో అభ్యున్నతిని పొందలేరు. ఒక వయసు వచ్చిన తరువాత, మనిషి కష్టపడి స్వయంగా సంపాదించుకోవడం అవసరం.

దీని ప్రాధాన్యతను మన సుభాషితాలు కూడా చక్కగా వివరించాయి. మాతానిందతి/ న అభినందతి పితా / భ్రాతా న సంభాషతే! భృత్యః కృప్యతి/ న అనుగచ్ఛతి సుతః/ కాంతాచ న ఆలింగతే/ అర్థప్రార్థన్

శంకయా న కురుతే స్వాలాపమాత్రం సుహృత్/ తస్మాత్ అర్థముపాశ్రయ శ్రుణు సర్వేహి అర్థేన సర్వే వశాః... అంటాయి. అంటే – నీకంటూ సంపాదన లేకపోతే ఎప్పుడూ నిందించని అమ్మ కూడా నిందిస్తుంది. తండ్రి సంతోషంతో భుజం మీద చెయ్యివేసి ఆప్యాయంగా అభినందించడు. తోడపుట్టినవారు కూడా చులకన చేస్తారు. పలకరించరు.సేవకుడికి ఏదయినా పని చెబితే... పైసా విదల్చడు కానీ పనులు మాత్రం చెబుతుంటాడని ఆగ్రహిస్తాడు.

పిల్లల అభ్యున్నతికి ఖర్చుపెట్టనప్పుడు కన్న కుమారుడు సేవలందించడు. ఇల్లు గడవడానికి అవసరమయిన సొమ్ము తీసుకురానప్పుడు కట్టుకున్న భార్య ప్రేమగా కౌగిలించుకోదు. ఎంత మంచి స్నేహితుడయినా ఎదురుపడితే అప్పు అడుగుతాడేమోనని ముఖం చాటేస్తాడు. అందువల్ల ఓ స్నేహితుడా! నీతి తప్పకుండా సంపాదించు. దానితో సమస్తమూ నీకు వశపడుతుంది... అంటారు.

ఒక తోటలో అరవిరిసిన పువ్వుల వాసనలకన్నా.... కష్టపడి చెమటోడ్చి సంపాదించిన ద్రవ్యం ఎంత తక్కువయినా దాని సువాసన ఎక్కువగానే ఉంటుందని కూడా అంటారు. అలా సక్రమ మార్గంలో కష్టపడి మనిషి సంపాదించి బతకగలగాలి. అది ఆత్మగౌరవం. అది మనిషికి సంపూర్ణతను ఇస్తుంది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



పట్టుదలకు ప్రతిరూపం

బౌద్ధవాణి

కొందరు అపజయం వస్తుందేమో అని అసలు పనులు ప్రారంభించరు. కొందరు కొద్ది ఇబ్బంది రాగానే విరమించుకుంటారు. ఇంకొందరు గట్టి దెబ్బ తగిలితే మధ్యలోనే మానుకుంటారు. కానీ, ధీరులు ఫలితం పొందే వరకూ ప్రయత్నం విడిచిపెట్టరు. అలా ఉండటమే బుద్ధుని లక్షణాల్లో ఒకటి. జ్ఞానం కోసం ఎక్కడెక్కడో, ఎన్నోచోట్ల, ఎంతోమంది గురువుల దగ్గరకు తిరిగి తిరిగి వెదకి వెదకి చివరికి తానే ఏకాంతంగా ధ్యానానికి కూర్చున్నాడు గౌతముడు. ఎన్ని కష్టాలొచ్చినా జ్ఞానోదయం పొందేవరకూ లేవకూడదు అనుకున్నాడు. శారీరకంగా మానసికంగా తట్టుకోలేనన్ని అవాంతరాలు వచ్చిపడ్డాయి. అయినా లేవలేదు. చివరికి జ్ఞానోదయం పొందాడు. పట్టుదలకు మారుపేరుగా నిలిచాడు.

ఒకసారి బుద్ధుడు గోసింగ అనే చోట సాలవనంలో ఉన్నాడు. అప్పుడు ఆయనతో సారిపుత్రుడు, మహా మౌద్గల్యాయనుడు, మహా కాశ్యపుడు, అనిరుత్థుడు, రేవతుడు, ఆనందుడు అనే అనుయాయులు ఉన్నారు. వీరంతా బౌద్ధ సంఘ ప్రముఖులే. మహా ప్రాజ్ఞులే.

ఒకరోజు వారంతా ఒకచోటకు చేరి మాట్లాడుకుంటున్నారు. ఆ సాలవనం పచ్చగా నిండుగా ఉంది. చెట్లనిండా పూలు విప్పారాయి. ఆ పూల తెల్లని రేకుల చుట్టూ నల్లని తుమ్మెదలు తిరుగుతున్నాయి. మెల్లగా వీచే గాలి పూల పరిమళాన్ని మోసుకు వస్తోంది. చెట్లమీద పున్నమి వెన్నెల పడి మెరుస్తోంది.

అప్పుడు సారిపుత్రుడు ''మిత్రులారా! ఈ గోసింగవనం గుబాళిస్తోంది. ఈ వనంలో ఎలాంటి భిక్షువు ఉంటే మరింత శోభనీయగలడు?'' అని అడిగాడు.

''బహుశ్రుతుడు విన్నవన్నీ గుర్తుపెట్టుకోగల నేర్పరి. లోతైన దృష్టి గలవాడు'' అన్నాడు ఆనందుడు.

''మరి రేవతా! నీ అభిప్రాయం?''

''ఇక్కడ ఏకాంతంగా ఉండి ఈ ఏకాంతంలోని ఆనందాన్ని అనుభవించే భిక్షువు'' అన్నాడు రేవతుడు.

సారిపుత్రుడు ప్రశాంతంగా అనిరుత్థుని వైపు చూశాడు.

''ఏకాంతంగా కూర్చొని మానవ నేత్రంతో కాకుండా, దివ్య నేత్రంతో లోకాన్ని దర్శించగలవాడు'' అన్నాడు గంభీరంగా.

''మహా కాశ్యపా! మీ అభిప్రాయం?''

''తాను ఒంటరిగా ఉంటూ ఒంటరిగా ఉండేవారిని మెచ్చుకునే వాడు. తాను ప్రయత్నిస్తూ ప్రయత్నించే వారిని ప్రోత్సహించేవాడు. తాను శీలవంతునిగా ఉంటూ శీల సంపన్నులను శ్లాఘించే వాడు'' అన్నాడు. సారిపుత్రుడు మౌద్గల్యాయుని వంక తల తిప్పాడు.

''నా ఉద్దేశ్యంలో ఒంటరిగా కాదు, ఇద్దరు మిత్రులు ఇక్కడ ఉండాలి. వారు ధర్మాన్ని చెప్పుకోవాలి. చర్చించుకోవాలి. ప్రశ్నించుకోవాలి. సమాధానాలు చెప్పుకోవాలి. అలాంటి మైత్రి వల్ల ఈ వనం మరింత శోభిస్తుంది'' అన్నాడు. ఇక అందరూ సారిపుత్రుని వైపు చూశారు.

''తాను చిత్తం (మనస్సు) వశంలో కాకుండా చిత్తాన్నే తన వశంతో ఉంచుకోగల భిక్షువు అన్నాడు.

అలా ఆరుగురు మిత్రులూ ఆరు విధాలుగా సమాధానాలు చెప్పారు. వారిలో ఎవరి అభిప్రాయం సరైనదో తెలుసుకోవాలని బుద్ధుని దగ్గరకు వెళ్లారు. విషయం చెప్పారు.

''మీరు చెప్పినవన్నీ అయితే.. ఎవరైతే ధ్యానానికి కూర్చొని '' నా మనస్సు నిండి మలినాలు పూర్తిగా తొలగేవరకూ ఇక్కడి నుండి లేవను. అని కూర్చొని దాన్ని సాధించే వరకూ పట్టు విడవని వారు ఎవరుంటారో.... వారి వల్ల, వారి అకుంఠిత దీక్ష వల్ల ఈ వనం మరింత ప్రకాశిస్తుంది'' అన్నారు.

మనోప్రకాశానికి పట్టుదల, దీక్షలే పట్టుకొమ్మలని వారికి అర్థమయ్యింది. వారంతా తదేకంగా బుద్ధుని వంక చూశారు. ఆయన ముఖం వెన్నెల కంటే ప్రకాశంగా, ప్రశాంతంగా, మనోహరంగా కనిపించింది. అందరూ ప్రణమిల్లారు!

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా

నేను క్షేమంగా ఉన్నాను

– శర్వానంద్



'నా కారు చిన్న ప్రమాదానికి గురైంది. కానీ, నేను క్షేమంగానే ఉన్నాను' అంటూ హీరో శర్వానంద్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ జంక్షన్‌లో శర్వానంద్ ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో శర్వానంద్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడనే వార్తలు రావడంతో ఆయన అభిమానులు, సినీ వర్గాల్లో ఆందోళన నెలకొంది. దీనిపై సోషల్ మీడియా వేదికగా శర్వానంద్ స్పందిస్తూ – ''ఈ రోజు (ఆదివారం) ఉదయం నా కారు ప్రమాదానికి గురైనట్లు వార్తలు వస్తున్నాయి. ఇది చాలా చిన్న ప్రమాదం. మీ అందరి ప్రేమ, ఆశీస్సులతో నేను క్షేమంగానే ఉన్నాను. నా ఆరోగ్యం గురించి ఎవరూ ఆందోళన పడొద్దు'' అన్నారు. కాగా జూన్ 3న రాజస్థాన్‌లో శర్వానంద్ వివాహం రక్షితతో జరగనున్న విషయం తెలిసిందే.

హనుమంతుణ్ణి నమ్మాం

– ప్రశాంత్ వర్మ

''హను–మాన్' చిత్రాన్ని చిన్నదిగా స్టార్ట్ చేశాం. అయితే మా మూవీ హనుమంతుని వలే భారీ ప్రాజెక్టు అయ్యింది. మేము హనుమంతుణ్ణి, కథని నమ్మాం. అద్భుతమైన విజువల్ ట్రీట్‌గా రూపొందిన 'హను–మాన్' అందరి అంచనాలు అందుకుంటుంది'' అని డైరెక్టర్ ప్రశాంత్ వర్మ అన్నారు. తేజ సజ్జ హీరోగా నటించిన చిత్రం 'హను–మాన్'. చైతన్య సమర్పణలో ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె.నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. నేడు ప్రశాంత్ వర్మ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ–''తెలుగులో గొప్ప దర్శకులు చాలా అద్భుతమైన చిత్రాలు తీశారు. వాళ్ల కంటే నేను బెటర్‌గా తీయలేను. నాకంటూ ఒక యూనిక్ జోనర్ క్రియేట్ చేయాలనే ఆలోచనలో భాగంగా కొత్త జోనర్స్‌పై దృష్టి పెట్టాను. ఆ క్రమంలో 'అ, కల్కి, జాంబి రెడ్డి' సినిమాలు చేశాను. తర్వాత నాకు ఇష్టమైన సూపర్ హీరో కథతో 'హను–మాన్' తీశా. హనుమంతుని కథలో జరిగిన ఒక కీలక ఘటనని తీసుకొని ఈ మూవీ చేశాం. 'హను–మాన్' టీజర్ విడుదలైన తర్వాత రాజమౌళిగారిని కలిశాను.. ఆయన ఇచ్చిన సూచనలతో మాకు చాలా సమయం కలిసొచ్చింది. జులై ఫస్ట్ వీక్‌లో సినిమా రిలీజ్ డేట్ ప్రకటిస్తాం. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌ని(పీవీసీయూ) నా బర్త్ డే కానుకగా నేడు అనౌన్స్ చేస్తాను. ప్రస్తుతం నా దర్శకత్వంలో 'అధీర' ఫిల్మ్ రూపొందుతోంది. బాలకృష్ణగారితోనూ ఓ సినిమా ఉంటుంది'' అన్నారు.



నిరుద్యోగుల జీవితాలు ఏమైపోవాలి?

ఆర్.నారాయణ మూర్తి ప్రధాన పాత్రలో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యూనివర్సిటీ'. స్నేహచిత్ర పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా సెన్సార్ పూర్తి చేసుకుంది. జూన్ 9న రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. ఆర్.నారాయణ మూర్తి మాట్లాడుతూ– ''10వ తరగతిలో పేపరు లీకేజీలు.. గ్రూప్ 1, 2లాంటి ఉద్యోగ పరీక్షల్లోనూ పేపరు లీకేజీలు జరుగుతున్నాయి. ఇలా అయితే విద్యార్థుల భవిష్యత్ ఏం కావాలి? నిరుద్యోగుల జీవితాలు ఏమైపోవాలి?. కుంభకోణాలు చేసే వారి వల్ల విద్యావ్యవస్థ, ఉద్యోగ వ్యవస్థ నిర్వీర్యం కావాలా?. మనది నిరుద్యోగ భారతం కాదు.. ఉద్యోగ భారతం కావాలని చెప్పే చిత్రమే 'యూనివర్సిటీ'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: బాబూరావు దాస్, కథ–స్క్రీన్ ప్లే–మాటలు– సంగీతం– దర్శకత్వం– నిర్మాత: ఆర్. నారాయణ మూర్తి.



● ఆర్. నారాయణ మూర్తి

నన్ను కొత్తగా చూస్తారు

– సత్యదేవ్



● శరణ్, రామాంజనేయులు, సత్యదేవ్, కోన వెంకట్


''నాలుగు క్వార్టర్స్ ఉంటే ఫుల్ బాటిల్. అలాగే మనిషి జీవితం కూడా ఓ ఫుల్‌బాటిల్ లాంటిదనే ఉద్దేశంతోనే ఈ సినిమాకు 'ఫుల్‌బాటిల్' టైటిల్‌ని పెట్టాడు శరణ్. ఇందులో మెర్క్యూరీ సూరిగా కొత్త సత్యదేవ్‌ని చూస్తారు'' అని హీరో సత్యదేవ్ అన్నారు. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో సత్యదేవ్ హీరోగా రూపొందిన చిత్రం 'ఫుల్ బాటిల్'. జవ్వాజి రామాంజనేయులు, ఎస్.డి కంపెనీ చినబాబు నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను హీరో విజయ్ దేవరకొండ సోషల్ మీడియాలో షేర్ చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో శరణ్ కొప్పిశెట్టి మాట్లాడుతూ–''డార్క్ కామెడీ నా బలం అని భావించి ఈ మూవీ చేశాను'' అన్నారు. ''సత్యదేవ్‌తో మా బ్యానర్‌లో మరో సినిమా చేస్తాం'' అన్నారు రామాంజనేయులు.

టైమ్ కూడా కలిసిరావాలి

– రాకేష్ ఉప్పలపాటి



''ఇండస్ట్రీలో దర్శకుడిగా అవకాశం రావాలంటే ప్రతిభతో పాటు సరైన టైమ్ కూడా కలిసిరావాలని నమ్ముతాను. ఎందుకంటే ఫిల్మ్‌నగర్, కృష్ణానగర్‌లో దర్శకులు కావాలనుకునే కొందరితో నేను మాట్లాడుతున్నప్పుడు వారిలో నా కన్నా ఎక్కువ ప్రతిభ ఉన్నట్లు అనిపిస్తుంటుంది'' అని డైరెక్టర్ రాకేష్ ఉప్పలపాటి అన్నారు. బెల్లంకొండ గణేష్, అవంతిక దాసాని జంటగా నటించిన చిత్రం 'నేను స్టూడెంట్ సర్!'. రాకేష్ ఉప్పలపాటిని దర్శకుడిగా పరిచయం చేస్తూ 'నాంది' సతీష్ వర్మ నిర్మించిన ఈ చిత్రం జూన్ 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా రాకేష్ ఉప్పలపాటి మాట్లాడుతూ– ''నా స్వస్థలం భీమడోలు. నాన్నగారి వ్యాపారం నిమిత్తం తాటిపాకకు మారాం. డిగ్రీ పూర్తి చేసిన తర్వాత 'చుక్కలాంటి అమ్మాయి చక్కనైన అబ్బాయి' సినిమాకు దర్శకత్వ విభాగంలో పనిచేశాను. ఆ తర్వాత తేజగారి దగ్గర అసిస్టెంట్‌గా వర్క్ చేశాను. కృష్ణ చైతన్యగారి కథతో 'నేను స్టూడెంట్ సర్' సినిమా చేశాను. హీరోకి ఇష్టమైన ఫోన్, అవసరమైన ఐడెంటిటీ.. భయపెట్టే గన్.. ఈ మూడు అంశాల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. హీరోకి, ఓ పోలీస్ కమిషనర్‌కు మధ్య ఎలాంటి యుద్ధం నెలకొంది? అనేది ఇందులో ఆసక్తిగా ఉంటుంది. నిర్మాత 'నాంది'సతీష్‌గారితోనే మరో సినిమా చేస్తాను'' అన్నారు.



'ది ఇండియా హౌస్' లోకి నిఖిల్ ఎంట్రీ ఇస్తున్నారు. నిఖిల్ హీరోగా అనుపమ్ ఖేర్ ఓ లీడ్ రోల్‌లో నటించనున్న తాజా చిత్రం 'ది ఇండియా హౌస్'. 'జై మాతా ది' అనేది ఉపశీర్షిక. వి మెగా పిక్చర్స్, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకాలపై రామ్

స్వాతంత్ర్యానికి పూర్వం...

చరణ్, విక్రమ్ రెడ్డి, అభిషేక్ అగర్వాల్ ఈ సినిమాను నిర్మించనున్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు వీర్ సావర్కర్ 140వ జయంతి సందర్భంగా 'ది ఇండియా హౌస్' సినిమా ప్రకటన వీడియోను సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేశారు రామ్‌చరణ్, అభిషేక్ అగర్వాల్. ఈ సినిమాలో శివ పాత్రలో నిఖిల్, సయామీ కృష్ణ వర్మగా అనుపమ్ ఖేర్ కనిపిస్తారు. ''లండన్‌లో స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన ఘటనల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది.

హృదయాలను హత్తుకుంటుంది

– 'బన్నీ' వాసు


''గీతగోవిందం' సినిమాను కేరళలో విడుదల చేసి, వసూళ్లను అక్కడ విరాళంగా ఇచ్చాం(కేరళలో 2018 వచ్చిన వరదలను ఉద్దేశిస్తూ). బాహుశా.. అందుకేనేమో మలయాళ హిట్ మూవీ '2018' ని తెలుగులో విడుదల చేసే అవకాశం నాకు వచ్చింది. ఈ అవకాశం ఇచ్చిన ప్రొడ్యూసర్స్ వేణు, ఆంథోనీ, పద్మ కుమార్‌గార్లకు థ్యాంక్స్. హృదయాన్ని హత్తుకునే సినిమా '2018'' అని నిర్మాత 'బన్నీ' వాసు అన్నారు. టోవినో థామస్, అపర్ణ బాలమురళి ప్రధాన పాత్రల్లో నటించిన మలయాళ చిత్రం '2018'. జూడ్ ఆంథోనీ జోసెఫ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మలయాళంలో ఈ నెల 3న రిలీజైంది. ఈ మూవీని ఈ నెల 26న తెలుగులో 'బన్నీ' వాసు విడుదల చేశారు. హైదరాబాద్‌లో జరిగిన '2018' సక్సెస్ సెలబ్రేషన్స్‌లో టోవినో థామస్ మాట్లాడుతూ–''ఇకపై నేను నటించే సినిమాలను తెలుగులోనూ విడుదల చేస్తాను'' అన్నారు. ''ఈ సినిమాని థియేటర్స్‌లో చూడండి'' అన్నారు జూడ్ ఆంథోనీ జోసెఫ్. ఈ కార్యక్రమంలో అపర్ణా బాలమురళి, నిర్మాత ఎస్‌కేఎన్ పాల్గొన్నారు.



● టోవినో థామస్, బన్నీ వాసు

క్రూరమైన ప్రపంచంలో...

విశ్వక్ సేన్ హీరోగా కృష్ణ చైతన్య దర్శకత్వంలో ఓ సినిమా 'వీఎస్ 11'(వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. దివంగత నటుడు ఎన్టీఆర్ 100వ జయంతి సందర్భంగా 'వీఎస్ 11' నుంచి విశ్వక్ పోస్టర్‌ను విడుదల చేసింది చిత్ర బృందం. 'నైతికత లేని సమాజంలో ఓ గ్రే మ్యాన్ ప్రయాణాన్ని వర్ణించే చిత్రం ఇది. చీకటి, క్రూరమైన ప్రపంచంలో అట్టడుగు నుంచి ధనవంతుడిగా ఎదిగిన వ్యక్తి కథను ఈ సినిమా వివరిస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.



● విశ్వక్ సేన్

మళ్ళీ పెళ్లి కృష్ణగారికి అంకితం

– వీకే నరేష్



● వీకే నరేష్, పవిత్రా లోకేష్

''రియల్ బోల్డ్ కపుల్ అంటే కృష్ణగారు, విజయ నిర్మలగారు. వాళ్ల రథం మళ్లీ ముందుకు వెళ్లాలని విజయ్ కృష్ణ మూవీస్‌ని మళ్లీ ప్రారంభించడం గర్వంగా ఉంది. సూపర్‌స్టార్ కృష్ణగారి 81వ జయంతి (మే 31) సందర్భంగా 'మళ్ళీ పెళ్లి' చిత్రాన్ని ఆయనకి అంకితం చేస్తున్నాను'' అని వీకే నరేష్ అన్నారు. ఎంఎస్ రాజు దర్శకత్వంలో వీకే నరేష్, పవిత్రా లోకేష్ జంటగా నటించిన చిత్రం 'మళ్ళీ పెళ్లి'. నరేష్ నిర్మించిన ఈ సినిమా గత శుక్రవారం (26) విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో వీకే నరేష్ మాట్లాడుతూ–'' నేను బతికున్నంత కాలం నటిస్తాను. అలాగే సమాజ సేవ చేస్తా'' అన్నారు. చిత్రపరిశ్రమలో వీకే నరేష్ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 'సెలబ్రిటీ వరల్డ్ రికార్డ్' నిర్వాహకులు ఆయన్ను సత్కరించారు. సంగీత దర్శకుడు సురేష్ బొబ్బిలి, నటి అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



● పాయల్, దినేష్, హెబ్బా

దినేష్ తేజ్ హీరోగా, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ హీరోయిన్లుగా నూతన దర్శకుడు మారేష్ శివన్ తెరకెక్కించిన చిత్రం 'అలా నిన్ను చేరి'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో విజన్ మూవీ మేకర్స్‌పై కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ జరుపుకుంటోంది. ''కుటుంబ సమేతంగా చూడదగ్గ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. త్వరలోనే మూవీ విడుదల తేదీ ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సుభాష్ ఆనంద్, కెమెరా: ఐ ఆండ్రూ.



అర్జున్ గేమ్ 'డ్రా'

దుబాయ్ ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ఖాతాలో తొలి 'డ్రా' చేరింది. మిఖేల్ మెచ్‌డ్లిష్‌విలి (జార్జియా)తో ఆదివారం జరిగిన రెండో గేమ్‌ను నల్లపావులతో ఆడిన అర్జున్ 28 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. శనివారం జరిగిన తొలి రౌండ్ గేమ్‌లో అర్జున్ 77 ఎత్తుల్లో తెలంగాణకే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్‌పై గెలుపొందాడు. తెలంగాణకు చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ హర్ష భరతకోటి, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ లలిత్ బాబు రెండో రౌండ్ గేముల్లో తమ ప్రత్యర్థుల చేతుల్లో ఓడిపోయారు.

జ్యోతి యర్రాజీకి స్వర్ణ పతకం

కుర్ప్‌ఫాల్జ్ గాలా ఈవెంట్ అంతర్జాతీయ అథ్లెటిక్స్ మీట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ స్వర్ణ పతకంతో మెరిసింది. జర్మనీలో జరిగిన ఈ మీట్‌లో విశాఖపట్నం జిల్లాకు చెందిన జ్యోతి 100 మీటర్ల హర్డిల్స్‌లో విజేతగా నిలిచింది. జ్యోతి 12.84 సెకన్లలో గమ్యానికి చేరి తన కెరీర్‌లో రెండో అత్యుత్తమ సమయాన్ని నమోదు చేసింది. ఈ సీజన్‌లో జ్యోతికిదే తొలి అంతర్జాతీయ పతకం. గత ఏడాది జ్యోతి 12.82 సెకన్లతో జాతీయ రికార్డు నెలకొల్పింది.



వాన వచ్చె... వాయిదా పడె




ఐపీఎల్–2023 విజేత ఎవరో తేలేందుకు మరో రోజు వేచి చూడాల్సిందే. ఫైనల్ కోసం మైదానంలో లక్షకు పైగా ఉన్న అభిమాన సందోహం సరిపోదన్నట్లుగా నేనూ ఉన్నానంటూ వరుణ దేవుడు వచ్చేయడంతో అంతా మారిపోయింది. టాస్ సమయానికి అరగంట ముందు మొదలైన వాన నిరంతరాయంగా కురవడంతో ఆటకు ఏమాత్రం అవకాశం లేకుండా పోయింది. ఎంత ఎదురు చూసినా వర్షం తెరిపినివ్వలేదు. దాంతో ఆదివారం జరగాల్సిన తుది పోరును సోమవారానికి వాయిదా వేయక తప్పలేదు. రిజర్వ్ డే అయిన నేడు చెన్నై సూపర్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ ట్రోఫీ కోసం తలపడతాయి. అన్నట్లు సోమవారం కూడా 10 శాతం వర్ష సూచన ఉంది. అయితే ఏమాత్రం వర్షసూచన లేని ఆదివారమే ఇలా జరిగితే సోమవారం ఏం జరుగుతుందనేది ఆసక్తికరం!

- రిజర్వ్‌డేకు ఐపీఎల్ ఫైనల్
- నేడు జరగనున్న తుది సమరం
- ఆదివారం సాధ్యం కాని ఆట

అహ్మదాబాద్: ఐపీఎల్ తాజా సీజన్‌లో మొత్తం 73 మ్యాచ్‌లు జరిగాయి. ఒక మ్యాచ్ వర్షం బారిన పడి రద్దు కాగా, మరో మ్యాచ్‌లో వర్షం ఆటంకం కలిగించినా ఒక్క బంతి కూడా వృథా కాలేదు. కానీ అసలైన అంతిమ సమరం సమయానికి మాత్రం వరుణుడు పూర్తి ప్రతాపం చూపించాడు. అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూసిన ఫైనల్ పోరుకు అడ్డుగా నిలిచాడు. మండు వేసవిలో అహ్మదాబాద్‌లో వర్షం అంటే అలా కొద్దిసేపు వచ్చిపోయే చినుకుల్లా అందరూ భావించినా ఆదివారం మాత్రం అలా జరగలేదు. చివరకు ఫైనల్ మ్యాచ్ నేటికి వాయిదా పడింది. సాయంత్రం 6.30 సమయంలో స్వల్పంగా వాన మొదలైంది. ఆ తర్వాతి నుంచి తగ్గుతూ, పెరుగుతూ వచ్చింది. కవర్లు కప్పడం, తొలగించడం మళ్లీ మళ్లీ జరిగాయి. 9 గంటల సమయంలో మాత్రం వాన పూర్తిగా తగ్గిపోయింది. దాంతో అంపైర్లతో పాటు ఇరుజట్ల ఆటగాళ్లు, కోచ్‌లు మైదానంలోకి వచ్చారు. అంతా పిచ్‌ను, అవుట్‌ఫీల్డ్‌ను పరిశీలించడంతో పాటు వామప్ కూడా మొదలైంది. అయితే ఒక్కసారిగా వాన జోరందుకోవడంతో అంతా పరుగెడుతూ గ్రౌండ్ వీడారు. ఆ తర్వాత దాదాపు రెండు గంటల పాటు వేచి చూసినా ఫలితం కనిపించలేదు. రాత్రి 9.30కి ఆట ఆరంభమైతే పూర్తి ఓవర్లు సాగేవి. ఆపై ఓవర్ల కోతతోనైనా మ్యాచ్ నిర్వహించాలని అంపైర్లు ప్రయత్నించారు. కనీసం 5 ఓవర్ల మ్యాచ్ ఆడాలన్నా అర్ధరాత్రి 12.06కు ఆట ఆరంభం కావాలి. దానికి కనీసం గంట ముందుగా వాన ఆగిపోవాలి. అయితే అనుకున్న సమయానికి వర్షం తగ్గకపోవడంతో మ్యాచ్ వాయిదా పడింది. ఇరు జట్ల కోచ్‌లు స్టీఫెన్ ఫ్లెమింగ్, ఆశిష్ నెహ్రాల 'షేక్ హ్యాండ్'తో అధికారికంగా ఖాయమైంది.

నేడు వాన కురిస్తే...

ఐపీఎల్ నిబంధనల ప్రకారం ఎలాగైనా ఫైనల్ మ్యాచ్‌ను నిర్వహించేందుకు ప్రయత్నిస్తారు. 20 ఓవర్ల నుంచి 15 ఓవర్ల లేదా 10 ఓవర్ల లేదా 5 ఓవర్ల మ్యాచ్ అయినా జరపాల్సిందే. చివరకు అదీ సాధ్యం కాకపోతే రాత్రి. గం. 1.20 సమయంలో 'సూపర్ ఓవర్'తోనైనా ఫలితాన్ని తేలుస్తారు. అయితే దానికీ అవకాశం లేకపోతే



మాత్రం లీగ్ దశలో అత్యధిక పాయింట్లు సాధించిన జట్టునే విజేతగా ప్రకటిస్తారు. అప్పుడు గుజరాత్ టైటాన్స్ చాంపియన్‌గా నిలుస్తుంది.

రెజ్లర్లపై పోలీసుల ప్రతాపం

- నిరసన దీక్ష భగ్నం
- శిబిరాన్ని ఖాళీ చేసిన పోలీసులు
- కొత్త పార్లమెంట్ వైపు దూసుకెళ్తుండగా నిర్బంధించిన ఢిల్లీ పోలీసులు
- తీవ్రంగా ప్రతిఘటించిన రెజ్లర్లు
- అర్ధంతరంగా ఆగిన పోరాటం

న్యాయం కోసం రోడ్డెక్కిన భారత రెజ్లర్ల పోరాటం రోడ్డుపైనే అర్ధంతరంగా ముగిసింది. నెలరోజులపైగా నోరెత్తి నినదించిన మల్లయోధులకు ఊరట లేకుండా పోయింది. రెజ్లర్ల డిమాండ్లలో ఏ ఒక్కటి నెరవేరకుండానే నిరసన దీక్ష శిబిరాన్ని ఢిల్లీ పోలీసులు ఎత్తేశారు. బాసటగా నిలిచిన రాజకీయ నేతల బలగానికి, మద్దతు తెలిపిన క్రీడాకారుల దళానికి, ప్రజాస్వామ్య వాదుల గళానికి నిరాశ తప్పలేదు.

న్యూఢిల్లీ: న్యాయం కావాలంటూ జంతర్ మంతర్ వద్ద నిరసన దీక్ష చేపట్టిన భారత స్టార్ రెజ్లర్ల నిరసన పోలీసుల దమనకాండతో ముగిసింది. లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలనే డిమాండ్ ఢిల్లీలో మూగబోయింది. అంతర్జాతీయ పతక విజేతలు వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్, బజరంగ్ పూనియా తదితరులు గత నెల 23 నుంచి చేస్తున్న దీక్షను ఢిల్లీ పోలీసులు భగ్నం చేశారు. కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా అతిరథులు హాజరవుతున్న నూతన భవన ప్రాంగణం వైపు రెజ్లర్లు దూసుకెళ్తుండటంతో ఢిల్లీ పోలీసులు జులుం చూపించారు. ఒక్కో రెజ్లర్‌ను పదుల సంఖ్యలోని పోలీసులు ఉక్కుపాదంతో అడ్డుకున్నారు. దేశానికి పతకాలు తెచ్చిన క్రీడాకారులన్న కనీస మర్యాద కూడా పాటించకుండా సాధారణ నిరసనకారుల్ని ఈడ్చుకెళ్లినట్లు... మహిళా, పురుషుల పోలీసులు రెజ్లర్లను బలవంతంగా ఈడ్చుకెళ్లారు. తీవ్ర ప్రతిఘటనల మధ్య వారి న్యాయ పోరాటాన్ని అణచివేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నరనే కారణంతోనే దీక్షను భగ్నం చేశామని ఢిల్లీ పోలీసులు చివరకు తమ దమనకాండను సమర్థించుకున్నారు. విచారణ జరిపిన అనంతరం రెజ్లర్లపై పలు సెక్షన్ల కింద ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు ఢిల్లీ పోలీసు కమిషనర్ దీపేంద్ర పాఠక్ వెల్లడించారు. కొత్త పార్లమెంట్ భవన ప్రారంభోత్సవం జరుగుతున్న ఈ చారిత్రక దినోత్సవాన ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని రెజ్లర్లకు తెలిపామని, అయినా వారు వినిపించుకోకుండా దూసుకు రావడంతోనే ఇలా వ్యవహరించాల్సి వచ్చిందని పాఠక్ వివరణ ఇచ్చారు. జంతర్ మంతర్ వేదిక వద్ద టెంట్‌లు, కుర్చీలు, మంచాలు, కూలర్లే కాదు కనీసం చిన్న కాగితం ముక్కయిన కనపడకుండా తుడిచిపెట్టేశారు. తద్వారా మళ్లీ దీక్షలో కూర్చోకుండా, నిరసన ఇకపై కొనసాగకుండా కఠిన చర్యలు తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న రెజ్లర్లను, మద్దతుదారులను వేర్వేరు చోట్లకు తరలించారు. వినేశ్ ఫొగాట్ పోలీసు కాఠిన్యంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. సాక్షి మలిక్ భర్త సత్యవర్త్ కడియాన్, జితేంద్ర కిన్హా 'ఇంక్విలాబ్ జిందాబాద్' అంటు గట్టిగా నినదించారు.

సిగ్గుచేటు... మండిపడిన నేతలు

కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని పోలీసుల దమన చర్యను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. 'పట్టాభిషేకం జరిగింది. ప్రజల గొంతు నొక్కే చర్యలు మొదలయ్యాయి' అని అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిన రెజ్లర్లను ఇలా బలవంతంగా ఈడ్చుకెళ్లడం సిగ్గుచేటన్నారు. మేటి రెజ్లర్ల పట్ల అధికార బీజేపీ ప్రభుత్వం దురహంకారం చూపింది అని కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా విమర్శించారు. పతకాలు సాధించిన రెజ్లర్లపై ఇలా ప్రవర్తించడం దారుణమని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దుయ్యబట్టారు. చాంపియన్లపై పోలీసు దమనకాండ సరికాదని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ పేర్కొన్నారు. వామపక్షాలు, ఇతర పార్టీల నేతలు, మద్దతు దారులు బీజేపీ నిరంకుశత్వ శైలిని, పోలీసుల చర్యను ఖండించారు.


కొత్త పార్లమెంట్ వద్ద బ్రిజ్‌భూషణ్


ప్రతిఘటిస్తున్న సాక్షి మలిక్


పోలీసుల అదుపులో బజరంగ్ పూనియా




సంగీత, వినేశ్ ఫొగాట్‌లపై ఖాకీల కాఠిన్యం

రాయుడు 'గుడ్‌బై'

- ఐపీఎల్ ఫైనల్ ఆఖరి మ్యాచ్‌గా ప్రకటన
- 'యు టర్న్' లేదని స్పష్టీకరణ

అహ్మదాబాద్: ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన బ్యాటర్లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్న తెలుగు తేజం అంబటి తిరుపతి రాయుడు ఈ లీగ్‌లో తన ఆటను ముగిస్తున్నాడు. చెన్నై, గుజరాత్ మధ్య నేడు జరిగే ఫైనల్ తనకు చివరి ఐపీఎల్ మ్యాచ్ అని 38 ఏళ్ల రాయుడు ప్రకటించాడు. తన నిర్ణయం విషయంలో ఎలాంటి పునరాలోచన ఉండదని అతను స్పష్టం చేశాడు. '2 గొప్ప జట్లు ముంబై, చెన్నై... 204 మ్యాచ్‌లు, 14 సీజన్‌లు, 11 ప్లే ఆఫ్స్, 8 ఫైనల్స్, 5 ట్రోఫీలు, ఆరవ ట్రోఫీ కూడా ఆశిస్తున్నా, ఇదో అద్భుత ప్రయాణం, ఈ ఫైనల్ మ్యాచ్ ఐపీఎల్‌లో నాకు చివరిది కానుంది. ఇంత గొప్పగా టోర్నీలో ఆడటాన్ని ఎంతో ఆస్వాదించా. థ్యాంక్యూ, ఇక ఎలాంటి యు టర్న్ ఉండదు' అని రాయుడు ఆదివారం ట్వీట్ చేశాడు. 2022లో కూడా చెన్నై జట్టు ప్లే ఆఫ్స్ అవకాశాలు కోల్పోయిన వెంటనే తాను ఐపీఎల్ నుంచి తప్పుకుంటున్నట్లు రాయుడు ప్రకటించాడు. అయితే సీఎస్‌కే యాజమాన్యం జోక్యంతో అర గంటలోనే ఆ ప్రకటనను అతను ఉపసంహరించుకొని తాజా సీజన్‌లోనూ బరిలోకి దిగాడు. అయితే ఈసారి రాయుడు ప్రదర్శన సంతృప్తికరంగా లేదు. 15 మ్యాచ్‌లలో 11 సార్లు బ్యాటింగ్ అవకాశం రాగా, 105 బంతులు ఎదుర్కొన్న రాయుడు 15.44 సగటుతో మొత్తం 139 పరుగులే చేయగలిగాడు. అత్యధిక స్కోరు 27 నాటౌట్ కాగా 9 ఫోర్లు, 7 సిక్స్‌లు కొట్టాడు.

ఘనమైన రికార్డు...

ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్)లో భాగంగా ఉండటంతో తొలి రెండు ఐపీఎల్‌లలో రాయుడుకు అవకాశం దక్కలేదు. 2010లో అతడిని ముంబై ఇండియన్స్ తీసుకుంది. 2017 వరకు ఎనిమిది సీజన్ల పాటు జట్టుకు ప్రాతినిధ్యం వహించిన రాయుడు 114 మ్యాచ్‌లు ఆడాడు. మూడుసార్లు ముంబై టైటిల్ విజయాల్లో (2013, 2015, 2017) కీలక పాత్ర పోషించాడు. అనంతరం 2018 నుంచి ఆరు సీజన్లు చెన్నై సూపర్‌కింగ్స్ తరఫున 89 మ్యాచ్‌లు ఆడాడు. 2018, 2021లలో విజేతగా నిలిచిన చెన్నై టీమ్‌లో అతను సభ్యుడు. అత్యధిక ఐపీఎల్ టైటిల్స్ గెలిచినవారిలో రోహిత్ శర్మ (6 ట్రోఫీలు) అగ్రస్థానంలో ఉండగా, రాయుడు రెండో స్థానంలో (5 ట్రోఫీలు) నిలిచాడు. ఓవరాల్‌గా ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన జాబితాలో అతను 12వ స్థానంలో ఉన్నాడు. 2018 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై రాయుడు తన ఏకైక సెంచరీ (100 నాటౌట్) సాధించాడు.



ఐపీఎల్‌లో రాయుడు ప్రదర్శన

మ్యాచ్‌లు: 203	అత్యధిక స్కోరు: 100 నాటౌట్
ఇన్నింగ్స్: 186	సెంచరీలు: 1
పరుగులు: 4329	అర్ధ సెంచరీలు: 22
సగటు: 28.29	ఫోర్లు: 358
స్ట్రయిక్‌రేట్: 127.28	సిక్సర్లు: 171

సెమీస్‌లో భారత్

థాయ్‌లాండ్‌పై 17–0తో ఘనవిజయం



సలాలా (ఒమన్): ఆసియా కప్ జూనియర్ పురుషుల హాకీ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. థాయ్‌లాండ్ జట్టుతో ఆదివారం జరిగిన పూల్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 17–0 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించింది. భారత్ తరఫున అంగద్‌బీర్ సింగ్ (13వ, 33వ, 47వ ని.లో) మూడు గోల్స్ చేయగా... అమన్‌దీప్ లాక్రా (26వ, 29వ ని.లో), ఉత్తమ్ సింగ్ (24వ, 31వ ని.లో) రెండు గోల్స్ చొప్పున సాధించారు. శ్రద్ధానంద్ తివారి (46వ ని.లో), యోగంబర్ రావత్ (17వ ని.లో), అమన్‌దీప్ (47వ ని.లో), రోహిత్ (49వ ని.లో), అరైజీత్ సింగ్ హుండల్ (36వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ఐదు జట్లున్న పూల్ 'ఎ'లో భారత్ మూడు విజయాలు, ఒక 'డ్రా'తో 10 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. పూల్ 'ఎ'లో నేడు జపాన్, పాకిస్తాన్ మధ్య జరిగే మ్యాచ్ విజేతకు మరో సెమీఫైనల్ బెర్త్ దక్కుతుంది. మ్యాచ్ 'డ్రా' అయితే పాకిస్తాన్ ముందంజ వేస్తుంది.

ప్రణయ్ నిరీక్షణ ముగిసె...

- మలేసియా మాస్టర్స్ టోర్నీ టైటిల్ నెగ్గిన భారత షట్లర్
- ఆరేళ్ల తర్వాత అంతర్జాతీయ టైటిల్

కౌలాలంపూర్: అడపాదడపా తనకంటే ఎంతో మెరుగైన ర్యాంక్ ఉన్న ఆటగాళ్లను మట్టికరిపించడం... కీలక మ్యాచ్‌ల్లో తడబడటం... గాయాల బారిన పడటం... కొన్నేళ్లుగా భారత స్టార్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్‌కు అలవాటుగా మారిపోయింది. ఒకవైపు ఎంతో నైపుణ్యమున్నా... మరోవైపు ఆశించినస్థాయిలో విజయాలు దక్కడంలేదనే అసంతృప్తి కూడా అతనిని వేధించింది. అయితేనేం పట్టుదల కోల్పోకుండా తనవంతు కృషి చేస్తూనే ఉన్నాడు. ఎట్టకేలకు టోర్నీ మొత్తం నిలకడగా రాణిస్తూ... ఆరేళ్ల నిరీక్షణను ముగిస్తూ ఈ కేరళ షట్లర్ తన కెరీర్‌లో గొప్ప విజయాన్ని అందుకున్నాడు. ఆదివారం ముగిసిన మలేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–500 టోర్నీలో 30 ఏళ్ల ప్రణయ్ చాంపియన్‌గా అవతరించాడు. 94 నిమిషాలపాటు హోరాహోరీగా సాగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ ప్రణయ్ 21–19, 13–21, 21–18తో ప్రపంచ 34వ ర్యాంకర్ వెంగ్ హాంగ్ యాంగ్ (చైనా)పై గెలుపొందాడు. విజేతగా నిలిచిన ప్రణయ్‌కు 31,500 డాలర్ల (రూ. 26 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 9,200 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. 2017లో యూఎస్ ఓపెన్ గ్రాండ్‌ప్రి గోల్డ్ టోర్నీలో విజేతగా నిలిచిన తర్వాత ప్రణయ్ ఖాతాలో చేరిన మరో అంతర్జాతీయ టైటిల్ ఇదే కావడం విశేషం. గత రెండేళ్లుగా అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్న ప్రణయ్ గత ఏడాది స్విస్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచాడు. మలేసియా, ఇండోనేసియా సూపర్–1000 టోర్నీల్లో సెమీఫైనల్లో నిష్క్రమించాడు.

తాజాగా మలేసియా మాస్టర్స్ టోర్నీలో ప్రణయ్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. తొలి రౌండ్‌లో ప్రపంచ ఆరో ర్యాంకర్ చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ)పై, ప్రిక్వార్టర్ ఫైనల్లో ఈ ఏడాది ఆల్ ఇంగ్లండ్ చాంపియన్, 11వ ర్యాంకర్ లీ షి ఫెంగ్ (చైనా)పై, క్వార్టర్ ఫైనల్లో 13వ ర్యాంకర్ నిషిమోటో (జపాన్)పై నెగ్గిన ప్రణయ్ సెమీఫైనల్లో తొలి గేమ్‌లో 19–17తో ఆధిక్యంలో ఉన్న దశలో అతని ప్రత్యర్థి క్రిస్టియన్ అడినాటా (ఇండోనేసియా) గాయంతో వైదొలిగాడు. సెమీఫైనల్ మినహా మిగతా అన్ని మ్యాచ్‌ల్లో ప్రణయ్‌కు మూడు గేముల్లో విజయం దక్కింది. ఓవరాల్‌గా అతను 5 గంటల 46 నిమిషాలపాటు కోర్టులో గడిపాడు.



> ఈ విజయం వెనుక ఎన్నో భావోద్వేగాలు దాగి ఉన్నాయి. ఆరేళ్ల తర్వాత మళ్లీ టైటిల్ గెలుస్తానని అనుకోలేదు. కోచ్‌లందరికీ, సహాయక సిబ్బందికి, మరీ ముఖ్యంగా చీఫ్ కోచ్ గోపీచంద్ సర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. నేను నిరుత్సాహంతో ఉన్నపుడల్లా ఆయన తన మాటలతో నాలో కొత్త ఉత్సాహం నింపారు. ఏదో ఒకరోజు తప్పకుండా గొప్ప విజయం దక్కుతుందని నాపై నమ్మకం ఉంచారు. గతేడాది కోచ్‌గా మారిన నా మాజీ సహచరుడు గురుసాయిదత్‌కు కూడా థాంక్స్. గత నాలుగు నెలలుగా మేమిద్దరం పడ్డ కష్టానికి ఫలితం దక్కింది. –హెచ్‌ఎస్ ప్రణయ్

సబలెంకా సులువుగా...

- రెండో రౌండ్‌లోకి రెండో సీడ్
- ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీ


సబలెంకా

పారిస్: అంతా అనుకున్నట్లు జరిగే ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ కూడా సొంతమయ్యే పరిస్థితుల్లో... ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో రెండో ర్యాంకర్ సబలెంకా (బెలారస్) శుభారంభం చేసింది. ఆదివారం మొదలైన సీజన్ రెండో గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సబలెంకా రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. ఉక్రెయిన్ ప్లేయర్ మార్టా కోస్టుక్‌తో జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సబలెంకా 6–3, 6–2తో గెలిచింది. 71 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకా తన ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. 19 విన్నర్స్ కొట్టిన సబలెంకా 21 అనవసర తప్పిదాలు కూడా చేసింది. మరోవైపు ఎనిమిదో సీడ్ మరియా సాకరి (గ్రీస్) తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టింది. కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్) 7–6 (7/5), 7–5తో సాకరిని ఓడించి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టింది. 2 గంటల 6 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ముకోవా తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది.

పురుషుల సింగిల్స్ విభాగంలో ఐదో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్), ఏడో సీడ్ రుబ్లెవ్ (రష్యా), 11వ సీడ్ ఖచనోవ్ (రష్యా), 13వ సీడ్ హుర్కాజ్ (పోలాండ్) తమ ప్రత్యర్థులపై కష్టపడి గెలిచి రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో సిట్సిపాస్ 7–5, 6–3, 4–6, 7–6 (9/7)తో జిరీ వెసిలీ (చెక్ రిపబ్లిక్)పై, రుబ్లెవ్ 6–1, 3–6, 6–3, 6–4తో జెరె (సెర్బియా)పై, హుర్కాజ్ 6–3, 5–7, 4–6, 2–6, 6–4తో డేవిడ్ గాఫిన్ (బెల్జియం)పై, ఖచనోవ్ 3–6, 1–6, 6–2, 6–1, 6–3తో లెస్టిన్ (ఫ్రాన్స్)పై విజయం సాధించారు.

వెర్‌స్టాపెన్‌దే గెలుపు

సీజన్‌లో నాలుగో టైటిల్



మోంటెకార్లో: ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో తన జోరు కొనసాగిస్తూ రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ నాలుగో విజయం నమోదు చేశాడు. ఆదివారం జరిగిన సీజన్‌లోని ఆరో రేసు మొనాకో గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. 'పోల్ పొజిషన్' నుంచి రేసును ఆరంభించిన వెర్‌స్టాపెన్ నిర్ణీత 78 ల్యాప్‌లను అందరికంటే వేగంగా 1 గంట 48 నిమిషాల 51.980 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఫెర్నాండో అలోన్సో (ఆస్టిన్ మార్టిన్) రెండో స్థానంలో, ఎస్టెబన్ ఒకాన్ (అల్పైన్ టీమ్) మూడో స్థానంలో నిలిచారు. మెర్సిడెస్ జట్టు డ్రైవర్లు లూయిస్ హామిల్టన్, జార్జి రసెల్ వరుసగా నాలుగు, ఐదు స్థానాలను దక్కించుకున్నారు. ఈ సీజన్‌లో ఆరు రేసులు జరగ్గా ఆరింటిని రెడ్‌బుల్ డ్రైవర్లే గెల్చుకోవడం విశేషం. వెర్‌స్టాపెన్ బహ్రెయిన్, ఆస్ట్రేలియన్, మయామి, మొనాకో గ్రాండ్‌ప్రిలలో నెగ్గగా... సెర్జియో పెరెజ్ సౌదీ అరేబియా, అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రిలలో విజేతగా నిలిచాడు. ప్రస్తుతం 144 పాయింట్లతో వెర్‌స్టాపెన్ టాప్ ర్యాంక్‌లో, 105 పాయింట్లతో పెరెజ్ రెండో ర్యాంక్‌లో, 93 పాయింట్లతో అలోన్సో మూడో ర్యాంక్‌లో ఉన్నారు. సీజన్‌లోని తదుపరి రేసు స్పానిష్ గ్రాండ్‌ప్రి జూన్ 4న జరుగుతుంది.

ఐదో స్థానంతో ముగింపు

అల్మాటీ (కజకిస్తాన్): ప్రపంచకప్ షాట్‌గన్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు ఐదో స్థానం లభించింది. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో భారత్ ఒక రజతం, ఒక కాంస్య పతకం సాధించింది. చివరిరోజు భారత్‌కు పతకం రాలేదు. మిక్స్‌డ్ ట్రాప్ ఈవెంట్‌లో భారత్ నుంచి రెండు జోడీలు బరిలోకి దిగాయి. పృథ్వీరాజ్–శ్రేయసి సింగ్ ద్వయం 136 పాయింట్లు స్కోరు చేసి ఐదో స్థానంలో నిలిచింది. జొరావర్ సంధూ–ప్రీతి రజక్ జోడీ 134 పాయింట్లు స్కోరు చేసి ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకుంది.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	629	62,502
నిఫ్టీ ▲	178	18,499


విదేశీ సూచీలు		
నాస్‌డాక్	12,976 ▲	278
డోజోన్స్	33,093 ▲	329
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,627 ▲	56
డాక్స్	15,984 ▲	190
షాంఘై	3,213 ▲	11
నికాయ్	30,916 ▲	115

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

నామినీ నమోదు చేశారా?

లేదంటే వారసులకు కష్టాలు • కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుంది • నామినేషన్ ఉంటే క్లెయిమ్ వేగం, సులభం
ప్రతీ పెట్టుబడికీ దీన్ని ఇవ్వాలి • అప్పుడే ఆశించిన లక్ష్యం నెరవేరుతుంది • ఏటా సవరణ కూడా అవసరమే



ప్రతి ఒక్కరి జీవితంలో పెట్టుబడులకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. తమ సంపదను వృద్ధి చేసుకునేందుకు ఎన్నో రూపాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటారు. సొంతిల్లు సమకూర్చుకోవాలని, వారసులకు బంగారు భవిష్యత్తును ఇవ్వాలని.. ఇలాంటి ముఖ్యమైన ఎన్నో జీవిత లక్ష్యాల కోసం పలు రకాల సాధనాల్లో పెట్టుబడులు పెడుతుంటారు. స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్, డిపాజిట్లు, బాండ్లు, జీవిత బీమా ప్లాన్లు, పీపీఎఫ్ ఇలా ఎన్నో ఆర్థిక సాధనాలు వ్యక్తుల ఆర్థిక ప్రణాళికల్లో భాగంగా ఉంటాయి. అయితే, జీవితం ఎప్పుడు ఎలాంటి మలుపు తీసుకుంటుందో చెప్పలేం. దురదృష్టం కొద్దీ ఈ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసిన వారికి ఏదైనా ప్రమాదం జరిగితే ఏంటి పరిస్థితి? ఆ పెట్టుబడులనేవి జీవిత భాగస్వామి లేదా వారసులకు సాఫీగా, సులభంగా, వేగంగా బదిలీ అవ్వాలి. అందుకు ఓ చిన్న పని చేయాల్సి ఉంటుంది. అదే నామినేషన్ నమోదు చేయడం. తమకు అత్యంత ఆప్తులైన వారిలో ఒకరి పేరును నామినీగా ప్రతి పెట్టుబడి సాధనంలోనూ నమోదు చేయాలి. నామినేషన్ లేని సందర్భాల్లో క్లెయిమ్ కోసం పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. కనుక నామినేషన్ ప్రాధాన్యాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి.

నామినీ అంటే ఎవరు..?

పెట్టుబడిదారు మరణించిన సందర్భాల్లో వారి పేరిట ఉన్న పెట్టుబడులను క్లెయిమ్ చేసుకుని, వాటిని పొందే హక్కును కలిగిన వ్యక్తి నామినీ అవుతారు. ఎక్కువ మంది నామినీగా కుటుంబ సభ్యులనే ముందుగా నియమించుకుంటారు. జీవిత భాగస్వామి లేదా పిల్లలు లేదా తల్లిదండ్రులు నామినేషన్ విషయంలో ప్రథమ ఎంపికగా ఉంటారు. అవివాహితులై, తల్లిదండ్రులు, తోడబుట్టిన వారు కూడా లేని సందర్భాల్లో అత్యంత సన్నిహితులు, నమ్మకస్తులైన వారిని, స్నేహితులను నామినీగా నియమించుకోవచ్చు. నామినీకి ఎవరు అయినా అర్హులే. కాకపోతే అంతిమంగా దీని ప్రయోజనం నెరవేరేలా నామినేషన్ ఉండాలన్న అంశాన్ని మర్చిపోవద్దు. ఒకవేళ నామినీగా మైనర్‌ను పేర్కొంటే, సంబంధిత నామినీ సంరక్షకుడి పేరు, చిరునామా, కాంటాక్ట్ వివరాలు ఇవ్వాలి.



ఎంతో ప్రాధాన్యం..



నామినేషన్ నమోదు చేసిన వ్యక్తి మరణించిన సందర్భంలో.. అతని పేరిట ఉన్న పెట్టుబడులు నామినీకి చాలా సులభంగా బదిలీ అవుతాయి. నామినీని నమోదు చేయకపోతే.. అప్పుడు ఆ పెట్టుబడులను వారసులే క్లెయిమ్ చేయగలరు. చట్ట ప్రకారం తామే వారసులమని ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి. వీటిని స్థానిక తహసీల్దార్ లేదా కోర్టు నుంచి తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు సమయంతోపాటు, శ్రమ కూడా పడాలి. ముఖ్యంగా కోర్టు నుంచి లీగల్ హేర్ సర్టిఫికెట్ తీసుకుని సమర్పించాల్సి ఉంటుంది. నామినేషన్ రిజిస్టర్ చేస్తే ఇలాంటి ఇబ్బందులేమీ ఉండవు. పెట్టుబడిదారు డెత్ సర్టిఫికెట్ ఒక్కటి సరిపోతుంది. ఒక అప్లికేషన్, దానికితోడు కేవైసీ వివరాలు సమర్పిస్తే చాలు. ప్రక్రియ సులభంగా ముగుస్తుంది.

వేటికి?..: బీమా పాలసీ తీసుకోవడం వెనుక ఉద్దేశం తమకు ఏదైనా జరిగితే కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదనే. అంత ముఖ్యమైన బీమా ప్లాన్ దరఖాస్తులో నామినేషన్ నమోదు చేయకపోతే? అర్థమే ఉండదు. అలాంటప్పుడు పరిహారం దక్కించుకునేందుకు కుటుంబ సభ్యులు శ్రమ పడాల్సి వస్తుంది. అలాగే బ్యాంకు ఖాతాకు సైతం నామినేషన్ ఉండాలి. అప్పుడు ఖాతాలో బ్యాలన్స్ మొత్తాన్ని నామినీ సులభంగా పొందడానికి వీలవుతుంది. అకౌంట్ హోల్డర్ మరణ ధ్రువీకరణ పత్రంతోపాటు, నామినీ కేవైసీ వివరాలను బ్యాంకు శాఖలో సమర్పించడం ద్వారా వాటిని సొంతం చేసుకోవచ్చు. అలాగే, బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లలోనూ నామినేషన్ ఉండాలి. ఇంకా పీపీఎఫ్, మ్యూచువల్ ఫండ్స్, స్టాక్ ట్రేడింగ్, డీమ్యాట్ అకౌంట్, అన్ని పోస్టాఫీసు పథకాలకు నామినేషన్ నమోదు చేసుకోవచ్చు. ఇక్కడ గుర్తు పెట్టుకోవాల్సింది ఏమిటంటే నామినేషన్ నమోదు చేయడం తప్పనిసరి కాదు. అయినా కానీ, నమోదు చేయడం బాధ్యతగా భావించాలి. ప్రతి పెట్టుబడి దరఖాస్తులో నామినేషన్ కాలమ్‌ను తప్పకుండా పూరించాలి.

ఎంత మంది?



నామినీలు ఎంత మంది అనే విషయం ఆయా పెట్టుబడి సాధనాల్లో వేర్వేరుగా ఉంటుంది. ఉదాహరణకు జీవిత బీమా పాలసీ అయితే ఎంత మందిని అయినా నామినీలుగా నమోదు చేసుకోవచ్చు. ఒకరికి మించి నామినీగా పేర్లు ఇచ్చినప్పుడు, విడిగా ఒక్కొక్కరికీ ఎంత శాతం చొప్పున క్లెయిమ్‌కు అర్హత అనేది కూడా పేర్కొనాలి. ఉదాహరణకు ముగ్గురిని నామినీలుగా నమోదు చేశారనుకుందాం. అప్పుడు ఏకి 50 శాతం, బీకి 30 శాతం, సీకి 20 శాతం లేదా తమకు నచ్చిన విధంగా ఈ శాతాన్ని నిర్ణయించుకోవచ్చు. బ్యాంకు ఖాతాలకు అయితే సాధారణంగా ఒక్కటే నామినేషన్ ఉంటుంది. పీపీఎఫ్ ఖాతాకు కూడా ఒకటికి మించి నామినేషన్లు ఇవ్వొచ్చు. మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులకు నామినేషన్ కింద ముగ్గురి పేర్లను నమోదు చేసుకోవచ్చు. కొందరు తమపై ఆధారపడిన ఒంటరి తల్లి లేదా తండ్రికీ కొంత పెట్టుబడుల మొత్తం వెళ్లాలని కోరుకుంటారు. అలాంటప్పుడు విల్లు రాసి అందులో ఎవరికి ఏమి చెందాలో పేర్కొనాలి. లేదంటే నామినేషన్‌లో తల్లిదండ్రులకూ ఇంత శాతం చొప్పున వాటా ఇవ్వాలి.

సవరణ..: నామినేషన్ ఇవ్వడంతో పని ముగిసిపోయిందని అనుకోవద్దు. ఏడాదికోసారి సంబంధిత నామినేషన్‌ను సమీక్షించుకోవాలి. అప్పటికే నామినీగా పేర్కొన్న వ్యక్తులతో తమకున్న అనుబంధాన్ని విశ్లేషించుకోవాలి. తమకు ఏదైనా జరిగితే వారు ఆస్తులను క్లెయిమ్ చేసుకునేందుకు సరైన వారేనా అని ప్రశ్నించుకోవాలి. ఎందుకంటే కొందరు వైవాహిక బంధం నుంచి వేరు పడుతుంటారు. మరొకరిని వివాహం చేసుకుంటారు. అవివాహితులు వైవాహిక జీవితంలోకి ప్రవేశించొచ్చు. లేదా నామినీగా పేర్కొన్న వ్యక్తి మరణించి ఉండొచ్చు. మరేదైనా కారణం ఉండొచ్చు. నామినీగా నమోదు చేసిన వ్యక్తి ఆచూకీ లేకుండా పోతే, అప్పుడు అసలు ఉద్దేశమే నెరవేరదు. అందుకే నామినేషన్‌ను ఏడాదికోసారి సమీక్షించి, సవరించుకోవాలి.

ఊహించని అనుభవం



2021లో మద్రాస్ హైకోర్టు ఓ సంచలనాత్మక తీర్పునిచ్చింది. తన భర్త మరణంతో జీవిత బీమా పాలసీ ప్రయోజనాలను క్లెయిమ్ చేసుకునే విషయమై ఒక మహిళకు తన మామతో విభేదాలు ఏర్పడ్డాయి. కోర్టును ఆశ్రయించగా, ఆమెకు వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. కారణం ఆమె భర్త తీసుకున్న జీవిత బీమా పాలసీ ప్రీమియంలను తండ్రి (బాధితురాలి మామ) చెల్లించడమే. పైగా మరణించిన వ్యక్తి తన జీవిత బీమా పాలసీలో నామినీని నమోదు చేయలేదు. విల్లు కూడా రాయలేదు. ప్రీమియంలను పాలసీదారు సొంతంగా చెల్లించనప్పుడు, ఆ పాలసీ ప్రయోజనాలకు జీవిత భాగస్వామి వారసురాలని తేల్చడం కుదరదని కోర్టు స్పష్టం చేసింది. నామినీని నమోదు చేయకపోవడంతో, ప్రీమియం చెల్లించిన తండ్రికి ఆ పాలసీ ప్రయోజనాలపై అధికారాలు ఉంటాయని ఈ ఘటన స్పష్టం చేసింది.

సరైన నిర్ణయం



మనలో కొందరు తమ పిల్లల పేరిట జీవిత బీమా పాలసీలను తీసుకుని తొలుత వారే ప్రీమియం చెల్లిస్తుంటారు. కనుక పెళ్లయిన వ్యక్తులు వెంటనే జీవిత బీమా పాలసీల్లో తమ జీవిత భాగస్వామిని నామినీగా నమోదు చేయాలి. లేదంటే ఆశించిన ప్రయోజనం నెరవేరదు. అందుకే సరైన వ్యక్తిని నామినీగా నమోదు చేసుకోవాలి. లేదంటే విల్లు రాసి రిజిస్టర్ చేసుకోవాలి. ముఖ్యంగా జీవిత బీమా పాలసీల ఉద్దేశం నెరవేరాలంటే అందుకు నామినేషన్ మెరుగైన మార్గం. చాలా కేసుల్లో వ్యక్తి మరణంతో జీవిత భాగస్వామిపైనే ఆర్థిక బాధ్యతల భారం పడుతుంది. కనుక జీవిత భాగస్వామినే నామినీగా నమోదు చేసుకోవాలి. కుటుంబం కోసం ఒక పాలసీ, ఒంటరి తల్లి లేదా తండ్రి లేదా తనపై ఆధారపడిన తల్లిదండ్రుల కోసం విడిగా మరో పాలసీ తీసుకునే వారు.. ఆయా పాలసీల్లో తప్పనిసరిగా నామినీని పేర్కొనాలి.

నామినేషన్ గడువు



మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు కలిగిన వారు, ట్రేడింగ్, డీమ్యాట్ ఖాతా కలిగిన వారు తప్పనిసరిగా నామినీ విషయంలో ఆప్షన్ ఇవ్వాలని సెబీ ఆదేశాలు తీసుకొచ్చింది. 2023 మార్చి 31 వరకే ఉన్న గడువును, సెప్టెంబర్ 30 వరకు పొడిగించింది. కనుక ఇన్వెస్టర్లు వచ్చే సెప్టెంబర్ 30 నాటికి నామినేషన్ ఇవ్వాలి. నామినేషన్ ఇవ్వడం ఇష్టం లేకపోతే 'ఆప్ట్ అవుట్ ఆఫ్ నామినేషన్'ను ఎంపిక చేసుకోవాలన్నది నిబంధన. అంటే నామినేషన్ నుంచి వైదొలగడం. కానీ, సెబీ ఆదేశాల ఉద్దేశం అది కాదు. నామినేషన్ విలువ తెలియజేసి, ప్రతి ఒక్కరూ నమోదు చేసుకునేలా చేయడమే. ఇక జీవిత బీమా ప్లాన్లు, బ్యాంకు ఖాతాలకు సంబంధించి నామినేషన్ నమోదు తప్పనిసరి కాదు. అయినా కానీ, నామినేషన్ ఇవ్వడం తన బాధ్యతగా ఇన్వెస్టర్ గుర్తించాలి.

ఆభరణాల మార్కెట్లో సంఘటిత రంగం పట్టు!

- 2023–24 ఆదాయంలో 15% వృద్ధి
- రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా



ముంబై: ఆభరణాల మార్కెట్లో సంఘటిత రంగం వాటా ఆదాయం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 12–15 శాతం మేర పెరగొచ్చని పరిశ్రమ అంచనా వేస్తోంది. పెద్ద సంస్థలన్నీ విస్తరణ ప్రణాళికలతో ముందుకు వెళుతున్న విషయాన్ని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా గుర్తు చేసింది. దీంతో స్థూల ఆర్థిక సవాళ్లతో కూడిన వాతావరణంలోనూ సంఘటిత రంగం వాటా పెంచుకోగలదని ఇక్రా అంచనా వేస్తోంది. ఆభరణాల మార్కెట్ 2023–24లో విలువ పరంగా 8–10 శాతం వృద్ధిని నమోదు చేయవచ్చని తెలిపింది. బంగారం ధరల్లో అస్థిరతల నేపథ్యంలో పరిమాణాత్మకంగా మార్కెట్లో పెద్ద వృద్ధి నమోదు కాకపోవచ్చన్న అంచనాతో ఉంది. కాకపోతే బంగారానికి ఉన్న బలమైన సాంస్కృతిక అనుబంధం నేపథ్యంలో పండుగలు, వివాహాల సందర్భంగా బంగారం ఆభరణాలకు డిమాండ్ మద్దతుగా నిలుస్తుందని వివరించింది. ''చాలా మంది జ్యూయలరీ రిటైలర్లు 2023 అక్షయ తృతీయ సందర్భంగా ఆదాయంలో 15 శాతానికి పైగా వృద్ధిని చూసినట్టు పేర్కొన్నారు. బంగారం ధరలు పెరగడం, ఎక్కువ సంస్థలు దూకుడుగా రిటైల్ స్టోర్లను పెంచడం ఆదాయ వృద్ధికి మద్దతునిస్తుంది''అని ఇక్రా వైస్ ప్రెసిడెంట్ కౌశిక్ దాస్ పేర్కొన్నారు. జ్యుయలర్ల ఆపరేటింగ్ మార్జిన్ సౌకర్య స్థాయిలో 7.5–8 శాతం మేర వచ్చే రెండేళ్లు ఉంటుందని ఇక్రా అంచనా వేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

29-5-2023	
విశాఖ	500–00
చిత్తూరు	533–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	495–00
విజయవాడ	495–00
రిటైల్ ధర (డజను)	72.00
28-5-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	465–00
వరంగల్	467–00
రిటైల్ ధర	5.25

సాక్షి స్టాక్స్

టాటా పవర్ | ఆనంద్ రాఠీ రీసెర్చ్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 212
టార్గెట్: రూ. 256



ఎందుకంటే: గతేడాది(2022–23) చివరి త్రైమాసికం(జనవరి–మార్చి)లో టాటా పవర్ కన్సాలిడేటెడ్ నికర లాభం 48 శాతం జంప్‌చేసి రూ. 939 కోట్లను తాకింది. కంపెనీకి చెందిన అన్ని విభాగాలూ వృద్ధి చూపడం ఇందుకు దోహదపడింది. నిర్వహణ లాభం(ఇబిటా) 38 శాతం ఎగసి రూ. 3,101 కోట్లకు చేరింది. ముంద్రా ప్లాంటులో తక్కువ అండర్‌రికవరీ, సోలార్ ఈపీసీ ప్రాజెక్టుల ఎగ్జిక్యూషన్ వంటి అంశాలు ఇందుకు కారణమయ్యాయి. మొత్తం ఆదాయం 4 శాతం మెరుగుపడి రూ. 12,454 కోట్లయ్యింది. ఇందుకు వివిధ పంపిణీ సంస్థల అమ్మకాలు, పునరుత్పాదక విభాగంలో సామర్థ్య విస్తరణ సహకరించాయి. ప్రధానంగా రూఫ్‌టాప్ విభాగం బిజినెస్ పటిష్ట వృద్ధిని సాధించింది. క్యూ4లో 300 మెగావాట్ల అదనపు సామర్థ్యాన్ని జత కలుపుకుంది. రూఫ్‌టాప్ విభాగం ఆర్డర్‌బుక్ అత్యంత పటిష్టంగా రూ. 1,900 కోట్ల విలువైన 468 మెగావాట్లకు చేరింది. ఈ బాటలో సోలార్ రూఫ్‌టాప్ బిజినెస్ సైతం 1,600 మెగావాట్లకుపైగా విస్తరించింది. గ్రీన్ మొబిలిటీ విభాగంలో కోయంబత్తూర్ మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు, గెయిల్‌తో సైతం ఇటీవలే ఒప్పందాలు కుదుర్చుకుంది. క్యూ4లో నికర రుణ భారాన్ని రూ. 2,800 కోట్లమేర తగ్గించుకుంది. వెరసి మొత్తం రుణ భారం రూ. 35,328 కోట్లకు పరిమితమైంది. ఆకర్షణీయ ఆర్థిక పనితీరు, వ్యూహాత్మక భాగస్వామి నుంచి ఈక్విటీ పెట్టుబడులు తదితర అంశాలు రుణ భార తగ్గింపునకు దారిచూపాయి. ఆయా అంశాలు కంపెనీకి ప్రయోజనం చేకూరుస్తాయి.

మ్యాట్రిమోనీ.కామ్ | ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 586
టార్గెట్: రూ. 700



ఎందుకంటే: గతేడాది(2022–23) చివరి త్రైమాసికం(జనవరి–మార్చి)లో మ్యాట్రిమోనీ.కామ్ ఆదాయం త్రైమాసిక ప్రాతిపదికన పురోభివృద్ధి సాధించింది. వెరసి రెండు వరుస త్రైమాసికాల తదుపరి తిరిగి జనవరి–మార్చి(క్యూ4)లో టర్నోవర్‌లో వృద్ధిని సాధించింది. మ్యాచ్‌మేకింగ్ బిల్లింగ్స్‌లో దాదాపు 9 శాతం వృద్ధిని అందుకుంది. వార్షికంగా అయితే మరింత అధికంగా 77 శాతం పురోగతిని సాధించింది. వార్షిక ప్రాతిపదికన పెయిడ్ సబ్‌స్క్రైబర్స్ 12 శాతం పెరిగారు. ఇది సెంటిమెంటును మెరుగుపరచనుంది. తద్వారా ప్రస్తుత ఏడాది(2023–24)లో ఆదాయ వృద్ధికి మార్గాన్ని చూపనుంది. కంపెనీ యాజమాన్యం సైతం ఇదే అంశంపై ఆశావహంగా స్పందిస్తోంది. యాజమాన్యం ఈ ఏడాది ఆదాయంలో 10 శాతం వృద్ధిని అంచనా వేస్తోంది. నిర్వహణ(ఇబిటా) మార్జిన్లు 3 శాతంమేర బలపడవచ్చని అభిప్రాయపడింది. ఫలితాల సాధనపై ఆశావహ అంచనాలు, షేరు ప్రస్తుత ధర కంపెనీపట్ల ఆకర్షణకు కారణమవుతున్నాయి. ప్రధానంగా మధ్యకాలానికి మ్యాచ్‌మేకింగ్ క్లాసిఫైడ్స్ విభాగంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించే అవకాశముంది. పెళ్లిళ్ల సంబంధ సర్వీసులలోకి ప్రవేశించడం కంపెనీకి మరింత బలాన్నివ్వనుంది. ప్రస్తుత త్రైమాసికంలో పటిష్ట బిల్లింగ్స్‌ను సాధించడం ద్వారా కంపెనీ రానున్న రెండేళ్లలో రెండంకెల వృద్ధిని అందుకునే అంచనాలకు దారిచూపుతోంది. కొత్తగా ప్రవేశించిన పెళ్లిళ్ల సర్వీసుల విభాగం ఆశించిన స్థాయిలో ఊపందుకోకపోవడం, యాక్టివ్ ప్రొఫైల్స్.. పెయిడ్ సబ్‌స్క్రిప్షన్లకు మార్పు చెందడంలో మందగమనం వంటి అంశాలు కీలక రిస్కులుగా పరిగణించవచ్చు.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

అందరికీ బీమా కోసం మూడంచెల విధానం

ఐఆర్‌డీఏఐ చైర్మన్ దేవాశిష్ పాండా



న్యూఢిల్లీ: దేశంలో 2047 నాటికి బీమాను అందరికీ చేరువ చేసేందుకు.. లభ్యత, పొందడం, అందుబాటు అనే మూడంచెల విధానాన్ని అనుసరిస్తున్నట్టు బీమా రంగ నియంత్రణ సంస్థ (ఐఆర్‌డీఏఐ) చైర్మన్ దేవాశిష్ పాండా తెలిపారు. 2047 నాటికి స్వాతంత్ర్యం సిద్ధించి నూరేళ్లు అవుతున్నందున అప్పటికీ, బీమాను అందరికీ చేరువ చేయాలని ఐఆర్‌డీఏఐ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు సంబంధించి గడిచిన ఏడాది కాలంలో పలు చర్యలు కూడా తీసుకుంది. సీఐఐ నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా పాండా ఈ అంశంపై మాట్లాడారు. ''బీమా రంగంలో యూపీఐ తరహా విప్లవాన్ని తీసుకొచ్చేందుకు లైఫ్ ఇన్సూరెన్స్, జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిళ్లతో కలసి పనిచేస్తున్నాం. ఇందుకు సంబంధించి ఓ ఊహాత్మక కార్యాచరణ గురించి ఆలోచించాం''అని పాండా తెలిపారు. దేశంలో బీమా వ్యాప్తి తక్కువగా ఉండడం, పెద్ద మార్కెట్ కావడంతో ఈ రంగంలో పెట్టుబడులకు అపార అవకాశాలున్నట్టు చెప్పారు.

వృద్ధులకు మెరుగైన పెట్టుబడి సాధనం?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

వేర్వేరు మ్యూచువల్ ఫండ్స్‌కు విడిగా కేవైసీ ఇవ్వకుండా, ఏదైనా కేంద్రీకృత ప్లాట్‌ఫామ్ ఉందా? – సమీర్ పటేల్

కేవైసీ (కస్టమర్ గురించి తెలుసుకోవడం) అనేది ఇన్వెస్టర్ల గుర్తింపు, చిరునామాకు సంబంధించినది. నల్లధన నిరోధక చట్టం కింద ఇన్వెస్టర్ విధిగా కేవైసీ వివరాలు ఇవ్వాల్సిందే. ప్రస్తుతం కేంద్రీకృత కేవైసీ (సీకేవైసీ) ప్లాట్‌ఫామ్ ఒకటి పనిచేస్తోంది. ఇది కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చినది. ఇన్వెస్టర్ తన కేవైసీ ప్రక్రియను ఒక్కసారి పూర్తి చేస్తే చాలు. ఇన్వెస్టర్ కొత్త మ్యూచువల్ ఫండ్ పథకంలో ఇన్వెస్ట్ చేయాల్సిన ప్రతి సందర్భంలోనూ కేవేసీ సమర్పించాల్సిన అవసరం ఉండదు. అలాగే, ఇన్వెస్టర్లు పాన్, చిరునామా ధ్రువీకరణ పత్రాలను మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్ లేదా సెబీ వద్ద నమోదైన క్యాపిటల్ మార్కెట్ మధ్యవర్తి (స్టాక్ బ్రోకర్, డీపీ)కి సమర్పించొచ్చు. ఆ సమాచారం కేవైసీ రిజిస్ట్రేషన్ ఏజెన్సీల ద్వారా కేంద్రీకృత వ్యవస్థలో నమోదు అవుతుంది.

నా వయసు 62 ఏళ్లు. నేను ఏక మొత్తంలో పెట్టుబడి పెట్టాలని అనుకుంటున్నాను. నా మాదిరి వృద్ధులు ఒకే విడత ఇన్వెస్ట్ చేసుకునేందుకు డెట్ ఫండ్ లేదా ఈక్విటీ ఫండ్ ఏది అనుకూలం? – శర్వానంద్ శివమ్



వృద్ధులు కేవలం డెట్‌లోనే ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటే అది పొరపాటు అవుతుంది. ముందు కొంత సమయం తీసుకుని పెట్టుబడిపై మరింత స్పష్టతను తెచ్చుకోవాల్సి ఉంటుంది. మీ పెట్టుబడి ఉద్దేశాలు, పెట్టుబడి కాలం ఎంతన్నది తేల్చుకోవాలి. మీకు దీర్ఘకాల లక్ష్యం ఉందా? లేక ఐదేళ్ల అంతకంటే ఎక్కువ కాలం తర్వాతే పెట్టుబడి అవసరం ఉందా? వీటికి అవును అనేది సమాధానం అయితే అందుకు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ సరైన ఎంపిక అవుతుంది. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్/క్రమానుగత పెట్టుబడి) లేదా లంప్‌సమ్ (ఒకే విడత) పెట్టుబడిలో ఏది మంచిది? అని అడిగితే.. మేము అయితే సిప్‌కు అనుకూలం. ఎందుకంటే ఇది కొనుగోలు ధరను సగటుగా మారుస్తుంది. మార్కెట్లు పడిపోయినప్పుడు తక్కువ ధరల్లోనూ సిప్ ద్వారా కొనుగోలు చేస్తారు. అలాగే, మార్కెట్లు గరిష్టాల్లో ఉన్నప్పుడు కూడా క్రమశిక్షణతో పెట్టుబడులు కొనసాగుతాయి. డెట్ ఫండ్స్ అన్నవి స్థిరంగా ఉంటాయి. పెట్టుబడికి రక్షణ ఉద్దేశంతో కొనసాగుతాయి. మీ పెట్టుబడి ఉద్దేశాలకు అనుకూలం అనుకుంటే డెట్ ఫండ్స్‌లో ఒకే విడత ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఈక్విటీ పథకాలు స్వల్పకాలంలో తీవ్ర అస్థిరతలతో ఉంటాయి. కనుక ఈక్విటీ పథకాల్లో ఒకే విడత పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేసుకోవాలని అనుకుంటుంటే, అప్పుడు ఆ మొత్తాన్ని డెట్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసుకోండి. అక్కడి నుంచి సిస్టమ్యాటిక్ విత్ డ్రాయల్ ప్లాన్ ద్వారా ఈక్విటీ పథకాల్లోకి నిర్ణీత కాలంలోపు పెట్టుబడులను బదిలీ చేసుకోండి.

నా సోదరుడు ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసి ఉన్నాడు. దురదృష్టంకొద్దీ అతడు ఇటీవలే మరణించాడు. నామినీగా మా వదిన ఉండడంతో, ఆమె పేరు మీదకు ఫండ్స్ యూనిట్లు బదిలీ అయ్యాయి. ఇప్పుడు మా వదిన వాటిని విక్రయించాల్సి ఉంటుందా? –వరుణ్

యూనిట్ హోల్డర్ మరణిస్తే, వారి పేరుమీద ఉన్న యూనిట్లను నామినీ క్లెయిమ్ చేసుకోవాలి. అప్పుడు ఆ యూనిట్లు నామినీకి బదిలీ అవుతాయి. సాధారణంగా బ్యాంకు డిపాజిట్లు, బీమా ప్లాన్లలో ఆ మొత్తం నామినీ బ్యాంకు ఖాతాకు జమ అవుతుంది. కానీ, మ్యూచువల్ ఫండ్స్‌లో అలా కాకుండా యూనిట్లను నామినీకి బదిలీ చేస్తారు. ఒకసారి ఇలా బదిలీ అయిన యూనిట్లకు నామినీయే యజమాని అవుతారు. కనుక వారు కోరుకున్నంత కాలం ఆ యూనిట్లను కొనసాగించుకోవచ్చు. విక్రయించడం తప్పనిసరి కాదు.

కోమాలో ఉన్న వ్యక్తికి ఏపీ ఎన్ఆర్టీఎస్ చేయూత


- స్వదేశానికి పంపేందుకు సాయం



కువైట్‌లో చికిత్స పొందుతున్న శోభన్‌బాబును పరామర్శిస్తున్న ఏపీఎన్ఆర్టీఎస్ సభ్యులు

కడప కార్పొరేషన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి రెండేళ్లుగా కోమాలో ఉన్న వ్యక్తికి ఏపీఎన్ఆర్టీఎస్ సభ్యులు చేయూతనందించారు. రేణిగుంటకు చెందిన ఆర్.శోభన్‌బాబు 2018లో జీవనోపాధి కోసం సముద్రంలో బోట్లు రిపేరు చేసేందుకు కువైట్ వెళ్లాడు. 2019 జూన్‌లో రోడ్డు దాటుతుండగా ప్రమాదానికి గురై జబీరియాలోని ముబారక్ ఆసుపత్రిలో రెండేళ్ల పాటు కోమాలో ఉన్నాడు. కోమా నుంచి బయటికి వచ్చిన తర్వాత జహార ప్రాంతంలోని మరో ఆసుపత్రిలో రెండేళ్లు ఉన్నాడు. అతనికి ప్రమాదం జరిగిన విషయాన్ని కువైట్ అధికారులు శోభన్‌బాబు కుటుంబ సభ్యులకు తెలుపగా అతని అన్న ఆర్.మధుబాబు కువైట్‌కు వచ్చి తన తమ్ముడిని భారత్‌కు తీసుకుపోవడానికి సాయం చేయాలని ఏపీఎన్ఆర్టీఎస్ డైరెక్టర్ ఇలియాస్ బీహెచ్, కువైట్ కన్వీనర్ బాలిరెడ్డి, రీజనల్ కో ఆర్డినేటర్ మహేశ్వర్‌రెడ్డిలను కోరారు. వారు వెంటనే స్పందించి ఆసుపత్రిలో ఉన్న శోభన్‌బాబును పరామర్శించి అతని పరిస్థితిని భారత రాయబార అధికారులు, ఏపీ ఎన్ఆర్టీఎస్ అధ్యక్షుడు మేడపాటి వెంకట్‌ల దృష్టికి తీసుకొచ్చారు. త్వరలోనే శోభన్‌బాబును భారత్‌కు పంపించేందుకు ఏర్పాట్లు చేస్తామని వారు హామీ ఇచ్చారు. తన తమ్ముడిని చూసేందుకు కువైట్ వచ్చిన మధుబాబుకు రూ.16,000 ఆర్థిక సాయం చేశారు. మధుబాబు మాట్లాడుతూ గతంలో తాను కువైట్ వచ్చినప్పుడు ఉచిత భోజన వసతి కల్పించిన మాధవి, హోటల్ యజమాని విజయ్‌కుమార్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

సింహాద్రి నాలుగో యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తి పునఃప్రారంభం



పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో ఈ నెల 26న రిజర్వు షెడ్‌డౌన్‌లో భాగంగా నిలిపివేసిన 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగో యూనిట్ నుంచి ఆదివారం రాత్రి విద్యుదుత్పత్తిని పునరుద్ధరించారు. విద్యుత్‌కు తగినంత డిమాండ్ లేని కారణంగా ఈ నెల 26న 2, 3, 4 యూనిట్ల ద్వారా జరుగుతున్న విద్యుదుత్పత్తిని నిలిపివేశారు. అవసరాన్ని బట్టి మళ్లీ నాలుగో యూనిట్ ద్వారా ఆదివారం రాత్రి 7.30 గంటలకు విద్యుదుత్పత్తిని పునఃప్రారంభించారు. సోమవారం ఉదయానికల్లా యూనిట్ నుంచి పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా జరుగుతుందని ఎన్టీపీసీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం 1,4 యూనిట్ల నుంచి విద్యుత్ సరఫరా జరుగుతుండగా 2, 3 యూనిట్లను తాత్కాలికంగా నిలిపివేశారు.

31న విశాఖలో నేవల్ ఇన్వెస్టిచర్ వేడుకలు

- హాజరుకానున్న నౌకాదళాధిపతి అడ్మిరల్ హరికుమార్

సాక్షి, విశాఖపట్నం: భారత నౌకాదళంలో విశిష్ట సేవలందించిన వారికి గ్యాలంట్రీ, విశిష్ట సేవా పతకాల్ని అందించే బృహత్తర కార్యక్రమానికి విశాఖ వేదికగా మారనుంది. ఈ నెల 31న విశాఖలోని తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంలోని నేవల్ బేస్‌లో నేవల్ ఇన్వెస్టిచర్ సెర్మనీ–2023 పేరుతో ఈ వేడుకల్ని నిర్వహించనుంది. భారత రాష్ట్రపతి తరపున సేవా పతకాల్ని అందించేందుకు భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ ఆర్ హరికుమార్ ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. నౌకాదళంలో దీటైన చర్యలు, నాయకత్వం, వృత్తిపరమైన విజయాలు, అత్యుత్తమ సేవలు అందించిన నావికాదళ సిబ్బందికి ఈ వేదికపై ప్రతిష్టాత్మకమైన అవార్డుల్ని అందజేస్తారు. ఇద్దరికి నవ్‌సేనా శౌర్య పతకాలు, 13 మందికి నవ్‌సేనా డివోషన్ టు డ్యూటీ పతకాలు, 16 మందికి విశిష్ట సేవా పతకాలు, ఇద్దరికి జీవన్ రక్షా పతకాలు కలిపి మొత్తం 33 మందికి అవార్డుల్ని అందించనున్నారు. నౌకాదళంలో ఆయుధ సంపత్తి మెరుగుపరచడం, ఎల్రక్టికల్ ఇంజినీరింగ్‌లో మార్గదర్శక పరిశోధనలు చేస్తోన్న వారికి లెఫ్టినెంట్ వీకేజైన్ మెమోరియల్ గోల్డ్ మెడల్, విమాన భద్రతని ప్రోత్సహిస్తోన్న వారికి కెప్టెన్ రవిధీర్ మెమోరియల్ గోల్డ్ మెడల్ అందజేయనున్నట్లు తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ బిస్వజిత్‌దాస్ గుప్తా వెల్లడించారు.

బడిలో చేరేందుకు 30 వరకు గడువు

సాక్షి, అమరావతి: ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం కింద 2023–24 విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థులు ఈనెల 30వ తేదీ వరకు ఆయా పాఠశాలల్లో చేరవచ్చని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రకటించిన షెడ్యూల్ మేరకు ఈ నెల 28వ తేదీతో గడువు ముగిసిందని పేర్కొన్నారు. అయితే విద్యార్థుల సౌలభ్యం కోసం మరో రెండు రోజులు గడువు పెంచినట్లు తెలిపారు.

విదేశాలకు విద్యార్థినుల క్యూ



ఉన్నత విద్య కోసం విదేశీ బాట పడుతున్న విద్యార్థినులు

మూడేళ్లలో 150 % పెరుగుదల

ప్రశంసించిన ప్రపంచ బ్యాంక్

దేశంలోని నగరాల నుంచే కాకుండా.. చిన్న పట్టణాల నుంచి కూడా విద్యార్థినులు ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళుతుండటం పెరుగుతోందని ప్రపంచ బ్యాంక్ నివేదికను ఉటంకిస్తూ విద్యారంగంలోని ప్రముఖ కన్సల్టెన్సీ ప్రాడిగీ ఫైనాన్స్ నివేదిక వెల్లడించింది. అమెరికా, బ్రిటన్‌ల తోపాటు యూరప్‌లోని పలుదేశాల్లో ఉన్నత విద్య పట్ల మన విద్యార్థినులు ఆసక్తి చూపిస్తున్నారు. విదేశీ విద్య కన్సల్టెన్సీలను, విదేశీ విద్య రుణం కోసం బ్యాంకులను సంప్రదిస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

- సాక్షి, అమరావతి

విద్యా రుణాల కోసం పోటీ

విదేశీ విద్య కోసం బ్యాంకులకు వస్తున్న దరఖాస్తుల్లో కూడా పురుషులతోపాటు మహిళలు సమానంగా ఉంటుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. 2019కి ముందు విదేశీ విద్య కోసం బ్యాంకులకు అందే దరఖాస్తుల్లో విద్యార్థినులు 10శాతం మంది మాత్రమే ఉండేవారు. కాగా.. 2022లో విదేశీ విద్యా రుణాల కోసం బ్యాంకులను ఆశ్రయించే విద్యార్థినుల దరఖాస్తులు ఏకంగా 49 శాతానికి పెరగడం విశేషం. మేనేజ్‌మెంట్, మెడిసిన్ రంగాల్లో ఉన్నత విద్య కోసం బ్యాంకు రుణాల కోసం భారతీయ విద్యార్థినుల నుంచి 145 శాతం దరఖాస్తులు పెరిగాయని ప్రముఖ కన్సల్టెన్సీ ప్రాడిగీ ఫైనాన్స్ వెల్లడించింది.

విదేశీ విద్యలోనూ సగం

2019కు ముందు దేశంలోని మెట్రో నగరాల నుంచి విదేశీ విద్య కోసం వెళ్లే పురుషులు, మహిళల నిష్పత్తి 70:30గా ఉండేది. అంటే విదేశాలకు వెళ్లేవారిలో పురుషులు 70 శాతం, మహిళలు 30 శాతం మంది ఉండేవారు. కానీ.. 2022లో మెట్రో నగరాల నుంచి విదేశాల్లో విద్య కోసం వెళ్లిన పురుషులు, మహిళల నిష్పత్తి 50:50గా ఉండటం విశేషం. అంటే పురుషులు, మహిళలు సమానంగా ఉన్నారు. దేశంలోని చిన్న నగరాల నుంచి 2019కి ముందు విద్య కోసం విదేశాలకు వెళ్లే పురుషులు, మహిళల నిష్పత్తి 80:20గా ఉండేది. కానీ 2022లో దేశంలో చిన్న నగరాల నుంచి విదేశాల్లో విద్య కోసం వెళ్లిన పురుషులు, మహిళల నిష్పత్తి 60:40గా ఉండటం విశేషం. 2019కి ముందు దేశంలోని చిన్న పట్టణాల నుంచి విదేశాల్లో విద్య కోసం వెళ్లే పురుషులు, మహిళల నిష్పత్తి 80:20గా ఉండేది. 2022లో చిన్న పట్టణాల విదేశాల్లో విద్య కోసం వెళ్లిన పురుషులు, మహిళల నిష్పత్తి 55:45గా ఉంది.

ప్రపంచ బ్యాంక్ ప్రశంసలు

ప్రపంచంలో మిగిలిన దేశాల కంటే భారతీయ విద్యార్థినులు అత్యున్నత విద్యా ప్రమాణాలు సాధిస్తున్నారని ప్రపంచ బ్యాంక్ నివేదిక ఇటీవల ప్రశంసించడం విశేషం. భారత్‌లో సైన్స్–టెక్నాలజీ, ఇంజినీరింగ్, మేథమెటిక్స్ సబ్జెక్టుల్లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న వారిలో మహిళలు 43 శాతంగా ఉన్నారని పేర్కొంది. విద్య, ఉపాధి రంగాల్లో ఆడ పిల్లలను ప్రోత్సహించే దృక్పథం భారతీయ తల్లిదండ్రుల్లో పెరుగుతుండటమే అందుకు కారణమని చెప్పింది. విద్యార్థినుల కోసం స్కాలర్‌షిప్‌లు, ఫెలోషిప్‌లు పెరుగుతుండటం కూడా అందుకు దోహదపడుతోందని చెప్పింది. ఈ సానుకూల దృక్పథం రానున్న కాలంలో మరింతగా పెరుగుతుందని కూడా పేర్కొంది.

అభివృద్ధి పథంలో ఇంధన రంగం

- రాష్ట్రంలో 31.45 శాతం పెరిగిన విద్యుత్ వాడకం
- గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో 42 ఒప్పందాలతో 1.80 లక్షల ఉద్యోగాలు
- ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్



సాక్షి, అమరావతి: రాష్ట్ర ఇంధన రంగం అభివృద్ధి పథంలో పయనిస్తోందని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. వార్షిక ఇంధన వినియోగం 2017–18లో 50,077 మిలియన్ యూనిట్లతో పోలిస్తే 2022–23లో 65,830 మిలియన్ యూనిట్లకు చేరుకోవడమే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. భవిష్యత్ ప్రణాళికలపై విద్యుత్ సంస్థలతో ఆయన ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంతో పోలిస్తే.. విద్యుత్ వినియోగం దాదాపు 31.45 శాతానికి పెరిగిందని, ఇటీవల రోజుకు 251 మిలియన్ యూనిట్లు ఆల్ టైమ్ హై ఎనర్జీ డిమాండ్ రాగా విద్యుత్ సంస్థలు విజయవంతంగా తీర్చాయని చెప్పారు.

ఒప్పందాలతో ఉజ్వల భవిష్యత్

ఈ ఏడాది మార్చి నెలలో విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో దాదాపు రూ.9.57 లక్షల కోట్ల విలువైన ఇంధన రంగం పెట్టుబడులతో దాదాపు 1.80 లక్షల ఉద్యోగాలను సృష్టించే అవకాశం ఉందని విజయానంద్ వెల్లడించారు. ఈ 42 అవగాహన ఒప్పందాలను అమలు చేయాల్సిన అవసరం విద్యుత్ సంస్థలపై ఉందన్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో దేశంలోనే అత్యంత అనుకూల రాష్ట్రంగా ఏపీని ప్రభుత్వం మార్చిందన్నారు. విండ్ సోలార్ హైబ్రిడ్ ప్రాజెక్టులను స్థాపించడానికి ప్రభుత్వం ఇప్పటికే పునరుత్పాదక ఇంధన ఎగుమతి విధానం 2020ని ప్రకటించిందని తెలిపారు. పంప్డ్ హైడ్రో స్టోరేజీ ప్రాజెక్టులు (పీఎస్‌పీ) పూర్తయితే విద్యుత్ రంగంలో దేశంలోనే ఏపీ నంబర్ వన్‌గా మారి మిగులు విద్యుత్‌ను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వినియోగదారులకు నమ్మకమైన విద్యుత్‌ను అందించాలని, వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను అందించాలని పదే పదే చెబుతున్నారన్నారు. వ్యవసాయానికి 9 గంటలు పగటిపూట ఉచిత విద్యుత్‌ను వచ్చే 25 ఏళ్ల పాటు కొనసాగించేందుకు 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ)తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందన్నారు.

రాష్ట్ర గ్రిడ్ కు 105 మిలియన్ యూనిట్లు

జెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ.. రాష్ట్ర గ్రిడ్‌కు రోజుకు 102 నుంచి 105 మిలియన్ యూనిట్లను జెన్‌కో సరఫరా చేస్తోందని, ఇది మొత్తం ఇంధన డిమాండ్‌లో 40 నుండి 45 శాతం ఉందని తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత ఇదే అత్యధికమని, బొగ్గు నిల్వలను మెరుగుపరచడానికి కూడా జెన్‌కో అన్ని ప్రయత్నాలు చేస్తోందని వివరించారు. సమావేశంలో ట్రాన్స్‌కో జేఎండీ బి.మల్లారెడ్డి, డిస్కంల సీఎండీలు ఐ.పృథ్వీతేజ్, జె.పద్మ జనార్దనరెడ్డి, కె.సంతోషరావు, ఏపీ ఎస్ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖర్‌రెడ్డి, ట్రాన్స్‌కో డైరెక్టర్లు ఏవీకే భాస్కర్, టి.వీరభద్రారెడ్డి పాల్గొన్నారు.

నేడు జీఎస్ఎల్వీ ఎఫ్-12 ప్రయోగం

కౌంట్‌డౌన్ ప్రారంభం



షార్‌లోని రెండో ప్రయోగవేదికపై సిద్ధంగా ఉన్న జీఎస్ఎల్వీ ఎఫ్-12 ఉపగ్రహ వాహకనౌక

సూళ్లూరుపేట/తిరుమల: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) స్థానిక సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లోని రెండో ప్రయోగవేదిక నుంచి సోమవారం ఉదయం 10.42 గంటలకు జియో సింక్రోనస్ లాంచింగ్ శాటిలైట్ వెహికల్ (జీఎస్ఎల్వీ–ఎఫ్12)ను ప్రయోగించేందుకు సర్వం సిద్ధం చేసింది. ఈ మేరకు ఆదివారం ఉదయం 7.12 గంటలకు కౌంట్‌డౌన్‌ను శాస్త్రవేత్తలు ప్రారంభించారు. మొత్తం 27.30 గంటల కౌంట్‌డౌన్ అనంతరం జీఎస్ఎల్వీ ఎఫ్–12 రాకెట్ ద్వారా 2,232 కిలోల బరువు కలిగిన నావిక్–01 ఉపగ్రహాన్ని రోదసిలోకి ప్రవేశపెట్టనున్నారు. ఈ ప్రయోగ పనులను ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ పర్యవేక్షిస్తున్నారు.

నావిగేషన్ శాటిలైట్ సిస్టం బలోపేతం కోసం

భారత క్షేత్రీయ దిక్సూచి ఉపగ్రహ వ్యవస్థ (ఇండియన్ రీజనల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం) వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు నావిక్–01 పేరుతో నావిగేషన్ ఉపగ్రహ ప్రయోగాన్ని నిర్వహిస్తున్నారు. నావిక్–01 ఉపగ్రహం సరికొత్తగా ఎల్–5, ఎస్–బాండ్‌ల సిగ్నల్స్‌తో పనిచేసే విధంగా రూపొందించారు. ఈ ఉపగ్రహం వల్ల భూమి, జల, వాయు మార్గాల స్థితిగతులు, దిక్కులు తెలియజేయడం, ఆపద సమయాల్లో భూగోళానికి సంబంధించిన సమాచారం అందించడం, వాహనచోదకులకు దిశానిర్దేశం చేయడం, ఇంటర్నెట్‌తో అనుసంధానం లాంటి ఎన్నో సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. భారత విమానయాన, నౌకాయాన మార్గాలకు, సైనిక అవసరాలకు కూడా ఈ ఉపగ్రహం దోహదపడుతుంది. మరోవైపు తిరుమల శ్రీవారి ఆలయంలో జీఎస్ఎల్వీ ఎఫ్–12 నమూనా ఉపగ్రహానికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఒకే వేదికపై 1,459 మంది
వలంటీర్లకు సత్కారం



సత్కారం పొందిన వలంటీర్లతో మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ

రామచంద్రపురం రూరల్: ఒకే వేదికపై 1,459 మంది గ్రామ వలంటీర్లకు శాలువా కప్పి, సర్టిఫికెట్, మెమొంటోలు అందించి మంత్రి వేణు సత్కరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలో 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని ఐదుగురు వలంటీర్లకు సేవావజ్ర, 20 మందికి సేవారత్న, 1,434 మందికి సచివాలయాల వారీగా సేవామిత్ర పురస్కారాలను మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అందజేశారు. ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో పెత్తందార్లకు మద్దతుగా చంద్రబాబు నిలిస్తే, పేదల తరఫున సీఎం జగన్ నిలిచారన్నారు.

పెట్రోల్ ట్యాంక్‌లో దిగి ముగ్గురి దుర్మరణం

- బంక్‌లోని ట్యాంకులో కార్బన్‌మోనాక్సైడ్ పీల్చి మృతి
- అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఘటన

రాయచోటి టౌన్: పెట్రోల్ బంక్‌లోని ట్యాంక్ మరమ్మతు చేసేందుకు వెళ్లిన ముగ్గురు టెక్నీషియన్లు.. అందులోని కార్బన్‌మోనాక్సైడ్ వాయువును పీల్చి ఊపిరాడక దుర్మరణం పాలయ్యారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాయచోటిలోని మేదరిళ్ల సమీపంలోని (ఫైర్‌స్టేషన్ దగ్గర) హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో గల ట్యాంకర్ మరమ్మతుకు గురైంది. ఈ విషయం కంపెనీకి తెలియజేయగా.. వైఎస్సార్ జిల్లా సీకే దిన్నెకు చెందిన శివ (25), పెండ్లిమర్రికి చెందిన ఆనంద్ (40), రవి (34) అనే టెక్నీషియన్లు వచ్చారు. ఈ బంక్‌లోని ఒక భాగం చాలాకాలంగా నిరుపయోగంగా ఉండటంతో.. అందులో విషవాయువులు చేరాయి. మొదట ఒక టెక్నీషియన్ ట్యాంక్ లోపలికి దిగి మరమ్మతు చేసేందుకు ప్రయత్నించగా.. ట్యాంక్‌లో కార్బన్‌మోనాక్సైడ్ ఉండటంతో ఊపిరాడక అపస్మారక స్థితికి చేరుకున్నాడు. బయట ఉన్న మిగిలిన ఇద్దరు టెక్నీషియన్లు అతన్ని రక్షించే ప్రయత్నంలో లోపలికి దిగారు. ముగ్గురూ లోపల అపస్మారక స్థితిలో పడిపోవడంతో బంక్ యజమానులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే ఫైర్ స్టేషన్ అధికారులు, సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. రెస్క్యూ టీం లోపలకు దిగి ముగ్గురు టెక్నీషియన్లను బయటకు తీసి ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.